
నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 216 | ఆదివారం | 06-07-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## మహిళా సాధికారతలో దేశానికి తెలంగాణ రోల్ మోడల్

- ఈనెల 12 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవంలా వడ్డీ లేని రుణాలు
- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- 151 మండల మహిళా సంఘాల గ్రూప్‌లకు ఆర్‌టిసి అద్దె రూ.1.05 కోట్లు అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళా సాధికారతలో దేశానికి తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళా సంఘాలు అందిపుచ్చుకుని ఆర్థిక స్వాలంభన సాధించడం ద్వారా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాక్షించారు. శనివారం ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా 151 మండల తరువాయి 2లో



ట్రంపునకు మోదీ తలవంచుతారు


- భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందాలపై రాహుల్‌గాంధీ విమర్శ



05

20 ఏళ్ల తరువాత ఒకే వేదికపై..

- కలిసొచ్చిన ఉద్ధవ్, రాజ్ థాక్రేలు
- ప్రతిపక్షాల విజయోత్సవ ర్యాలీలో ప్రసంగాలు



05

అమెరికాలో నీరవ్‌మోదీ సోదరుడు నేహల్ మోదీ అరెస్ట్..

- పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13,000 కోట్ల మోసం కేసులో నిందితుడు

05

### చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడితే

# కఠిన శిక్షలు

## ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టం

## దోషులపట్ల ఎలాంటి జాలి చూపొద్దు

- మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- 'నిస్సహాయకులకు అండగా - లైంగిక దాడికి గురైన పిల్లల రక్షణ, హక్కులు' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు



బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. వారి రక్షణ కోసం రాష్ట్రంలో భరోసా ప్రాజెక్టును చేపట్టాం. ఈ ప్రాజెక్టు కింద ప్రస్తుతం 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటి ద్వారా బాధితులకు పోలీసు సహకారమే కాకుండా న్యాయపరమైన, వైద్యపరమైన సహాయం అందించడంతో పాటు సానుకూల వాతావరణంలో వారికి అవసరమైన కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. పోక్సో చట్టం, జువెనైల్ చట్టాల ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి వేదన కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి.

– సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి అత్యంత కఠినమైన శిక్షలు తప్పవని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా బాలలపై జరుగుతున్న లైంగిక దాడుల విషయంలో ఎలాంటి జాలి చూపకుండా దోషుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసిహెచ్‌ఆర్‌డి) లోశనివారం 'నిస్సహాయకులకు అండగా లైంగిక దాడికి గురైన పిల్లల రక్షణ, హక్కులు' అనే అంశంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న హేయమైన నేరాలను నియంత్రించడమే కాకుండా బాధితులకు చట్టపరంగా, నైతిక పరంగా మాత్రమే కాకుండా అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, వారి రక్షణ కోసం తెలంగాణలో భరోసా ప్రాజెక్టును చేపట్టామన్నారు. భరోసా ప్రాజెక్టు కింద ప్రస్తుతం 29 కేంద్రాలు పని చేస్తున్నాయని, ఈ కేంద్రాల ద్వారా బాధితులకు పోలీసు సహకారమే కాకుండా న్యాయపరమైన, వైద్యపరమైన సహాయం అందించడంతో పాటు సానుకూల వాతావరణంలో వారికి అవసరమైన కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయన్నారు. హైదరాబాద్ కేంద్రంగా తరువాయి 2లో




## వ్యవసాయంలో ఎఐ టెక్నాలజీ



- మొబైల్ ద్వారా శాటిలైట్‌తో రైతులు వినియోగించుకోవాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులందరూ మొబైల్ ఫోన్ ద్వారా శాటిలైట్ తో ఎఐ టెక్నాలజీని వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ యాప్ వినియోగించడం వల్ల రైతుల విలువైన సమయం ఆదా కావడంతో పాటు, రైతులు తమ పంటలకు కచ్చితమైన నివారణ చర్యలు తీసుకునే వీలుకలుగుతుందని సూచించారు. సచివాలయంలో శనివారం మంత్రి కృషి వాస్ సంస్థ ప్రతినిధులతో తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. రైతులకు ఎఐ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషివాస్ సంస్థతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించారు. ఈ టెక్నాలజీ రైతులకు పూర్తి ఉపయోగపడే విధంగా తరువాయి 2లో

### వచ్చే అసెంబ్లీ సమావేశంలో

## 'కొత్త స్టాంప్ సవరణ బిల్లు'



- శాస్త్రీయంగా భూముల ధరల సవరణ
- పాత అపార్ట్‌మెంట్లకు, మహిళలకు స్టాంప్ డ్యూటీలు తగ్గింపు..
- త్వరలోనే సిఎంతో చర్చించి తుది నిర్ణయం : మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హైదరాబాద్

సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండే విధంగా నూతన స్టాంప్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు భారతీయ స్టాంపు చట్టం 1899ను అనుసరించి, తెలంగాణ సవరణ బిల్లు–2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎటువంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని,దీనికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. 'తెలంగాణ సవరణ బిల్లు2025' అంశంపైన హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్యకార్యదర్శి వి. శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి. ఎస్.లోకేష్ కుమార్, న్యాయవ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఒఎస్‌డి వేముల శ్రీనివాస్ తదితరులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం సమావేశాన్ని నిర్వహించారు. భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం, తరువాయి 2లో



## సిఎం సవాల్ స్వీకరిస్తున్నాం

- రైతులపై చర్చించేందుకు ఎక్కడికి వచ్చేందుకైనా సిద్ధమే
- ఈనెల 8న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తాం.. మేమే ఏర్పాట్లు చేస్తాం
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులపై చర్చించేందుకు సిఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బిఆర్‌ఎస్ తరపున తాము స్వీకరిస్తున్నామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ప్రకటించారు. అసెంబ్లీ, అంబేద్కర్ విగ్రహం, కొండాపల్లి, కొడంగల్, గజ్వేల్ ఏ ప్రాంతంలో చర్చకు పెట్టినా తాము వస్తామన్నారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌కు వస్తామని, తామే ఏర్పాట్లు చేస్తామని, తాను చర్చకు 'రెడీ' అని కెటిఆర్ అన్నారు. తాము వ్యవసాయ రంగంలో తరువాయి 2లో

### రాష్ట్రంలో అధికారంలోకి రాకుండా

# బిజెపిని అడ్డుకుంటాం

- గాంధీని చంపిన గాడ్సే వారసులు బిజెపి నాయకులు
- దేశం కోసం ప్రాణాలొడ్డిన అమరుల వారసులు కమ్యూనిస్టులు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ఘనంగా మహబూబాబాద్ జిల్లా మహాసభలు
- కురవిలో భారీ ర్యాలీ



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి

తెలంగాణలో మనువాద, ఫాసిస్ట్ బిజెపిని అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా సిపిఐ తృతీయ మహాసభలు కురవి మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా భారీ ప్రదర్శన అనంతరం జరిగిన బహిరంగ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులు బిజెపి నాయకులని, అలాంటి పార్టీని తెలంగాణలో అధికారంలోకి రానివ్వం అన్నారు. దేశం కోసం ప్రాణాలొడ్డిన అమరుల వారసులు కమ్యూనిస్టులని చెప్పారు. కమ్యూనిస్టులను అంతం చేయాలని బిజెపి కలలు కంటున్నదని, కమ్యూనిస్టులను అంతం చేయడం బిజెపి తరం కాదని అన్నారు. ప్రజలంతా కమ్యూనిస్టులు బతకాలని కోరుకుంటుంటే మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావును అమిత్ షా అన్యాయంగా చంపించారని అన్నారు. కమ్యూనిస్టులను అంతంచేయడం అడాల్ఫ్ హిట్లర్ వల్లే సాధ్యం తరువాయి 12లో

## సుప్రీంకోర్టుకు 'ఎడిఆర్'

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై సవాల్

ADR Association for Democratic Reforms

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కోసం ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్‌చేస్తూ ది అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిహార్‌లో అనర్హుల పేర్లను తొలగించి, అర్హులైన పౌరులను మాత్రమే ఓటర్ల జాబితాలో చేర్చాలని జూన్ 24న ఎన్నికల సంఘం (ఇసి) ఆదేశాలు జారీచేసింది. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21, 325, 326, ప్రజా ప్రాతినిథ్య చట్టం 1950, ఓటర్ల నమోదు నియమాలు 1960సంవత్సరం రూల్ 21ఏ లోని నిబంధనలను ఉల్లంఘిస్తున్నదని వాదిస్తూ ఆదేశాలను, కమ్యునికేషన్‌ను పక్కకు పెట్టాలని ఎడిఆర్ సుప్రీంకోర్టును కోరింది. ఎన్నికల సంఘం ఉత్తర్వు ఏకపక్షంగా, తగిన ప్రక్రియ లేకుండా లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును కోల్పోయేలా చేయగలదని, తరువాయి 12లో

### నేడు రేపు రియో డీ జనీరోలో

## 'బ్రిక్స్ ప్లస్ గ్రూప్ దేశాల' భేటీ

పుతిన్, జిన్‌పింగ్ లేకుండానే సమావేశాలు




**రియో డి జనీరో :** అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలలో మార్పులు సంభవిస్తున్న ప్రస్తుత తరుణంలో బ్రిక్స్ దేశాల నాయకులు ఆది–సోమ వారాలలో బ్రెజిల్ నగరం రియో డీ జనీరోలో సమావేశమవుతున్నారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా బ్రిక్స్ వ్యవస్థాపక సభ్యదేశాలుగా ఉన్నాయి. ఈ రెండేళ్ళలో కొత్తగా మరో ఐదు దేశాలు బ్రిక్స్ సభ్యత్వం తీసుకోవడంతో ఇప్పుడు దీనిని ''బ్రిక్స్ ప్లస్ గ్రూపు''గా పిలుస్తున్నారు.రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇద్దరు ఈ సమావేశాలకు హాజరుకావడంలేదు. వారు లేకుండానే ఈ సమావేశాలు జరుగుతాయి. వీరిద్దరిస్థానంలో రష్యా తరపున విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్, చైనా ప్రధానమంత్రి లీ క్వియాంగ్ హాజరవుతారు. పుతిన్,జిన్‌పింగ్ ఇద్దరూ ఈ సమావేశాల్లో పాల్గొనకపోవడంతో ఇక భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీపైనే ప్రధానంగా అందరూ దృష్టి సారించే అవకాశం ఉంది. ఆయనతోపాటు బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో డ సిల్వా కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన నాయకుడే కావడంతో వీరిద్దరూ ప్రధానంగా బ్రిక్స్ సమావేశాలను నడిపించే అకాశాలు కనిపిస్తున్నాయి. వ్యవస్థాగతంగా ఉన్న అంతర్జాతీయ సంస్థలలో ప్రత్యేకించి సంక్షోభ సమయాలలో న్యాయం చేసేవిధంగా సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని బ్రిక్స్ ప్లస్ వేదిక ప్రధానంగా కోరుతున్నది. ప్రపంచంలో తరువాయి 12లో

### నకిలీ పత్రాలు, స్టాంపుల

## కుంభకోణం గుట్టురట్టు

- పలు శాఖల పత్రాలు, అధికారుల సంతకాలతో స్టాంపులు స్వాధీనం
- తండ్రీకొడుకులపై కేసు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్‌పి



ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి

ప్రభుత్వ నకిలీ పత్రాలు, నకిలీ స్టాంపులు తయారు చేస్తున్న కుంభకోణాన్ని ఆదిలాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారని, ఈ కేసులో పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి తండ్రీ కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌పి అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## దాడుల్లో పాలస్తీనా వైద్యుడు, కుటుంబం మృతి

**గాజా:** గాజాలో శనివారం తెల్లవారుజామునుండి జరుగుతున్న దాడుల్లో సాయంత్రం వరకూ పాలస్తీనా వైద్యుడు సహా ఆయన పిల్లలు, కుటుంబీకులతో కలిపి 42 మంది మరణించారు. నస్సర్ మెడికల్ కాంప్లెక్స్ లో గైనకాలజీ, సంతానసాఫల్య విభాగాలలో ప్రత్యేక నిపుణుడైన మూసా హమ్దాన్ ఖాఫజాతో సహా ఆయన పిల్లలు, కుటుంబీకులు ఐడిఎఫ్ దాడుల్లో మరణించారు. పాలస్తీనియన్లపై యుద్ధం మొదలై జులై ఐదో తేదీకి 639 రోజులు గడిచాయి. గడచిన 45 రోజులుగా గాజాలో ఆహారంకోసం వేచి ఉంటున్న పాలస్తీనా ప్రజలపై ప్రతిరోజూ జరుగుతున్న దాడుల్లో ఇప్పటివరకూ 600 మంది మరణించారు. మార్చి 18వ తేదీన ఇజ్రాయెల్ సైన్యం యుద్ధం తిరిగి ప్రారంభించినప్పటినుండి 6000 మంది ప్రజలు మరణించారు.



# చర్చలకు మేం రెడీ : హమాస్ ప్రకటన

నెతన్యాహూ మంత్రివర్గం చర్చ

ఔనా..గుడ్..వచ్చేవారం ఒప్పందం:ట్రంప్



**దుబాయ్:** గాజాలో కాల్పుల విరమణ సంబంధించి మధ్యవర్తి దేశాల ప్రతిపాదనలకు తాము సానుకూలమైన సంకేతాలు ఇచ్చామని పాలస్తీనాకు చెందిన హమాస్ సాయుధ సంస్థ ప్రకటించింది. తక్షణం మొదటి విడత సంప్రదింపులు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలియజేసింది. ఐతే సంబంధిత షరతులను నమ్మవచ్చునా? లేదా? అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. "మేం చిత్తశుద్ధితో ఉన్నాం, తక్షణం సంప్రదింపుల్లోకి దిగేందుకు కట్టుబడి ఉన్నాం" అని చెప్పింది. ఖతార్, ఈజిప్టు దేశాల ప్రతినిధులు కొద్దినెలలుగా హమాస్‌ను ఒప్పించే బాధ్యతలు చేపట్టాయి. అమెరికా నిమగ్నమయ్యాయి. కొత్తగా ట్రంప్ ప్రతిపాదించిన 60 రోజుల కాల్పుల విరమణకు సంబంధించి తాము సుముఖంగా ఉన్నామని శుక్రవారం పొద్దుపోయాక చెప్పింది. బందీలను విడుదల చేయాలని, మృతదేహాలుంటే వాటిని కూడా స్వాధీనం చేయాలని ట్రంప్ ప్రతిపాదించారు.

హమాస్‌కు చెందిన సీనియర్ అధికారి ఒకరు అమెరికా మీడియాతో మాట్లాడుతూ, "మళ్ళీ యుద్ధం రాకుండా చూడాలని మేం కోరాం, ఇజ్రాయెల్‌కు ఆయుధ సహాయం చేయకూడదని కోరాం, గాజాలో మానవతా సహాయ పంపిణీకి సంబంధించి చేసిన ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని కోరాం, మార్పులు అంటే సహాయం కేవలం ఐక్యరాజ్యసమితి, దాని భాగస్వామ్య సంస్థల నాయకత్వంలోనే జరగాలని కోరాం, చర్చలు విఫలమైతే తిరిగి యుద్ధం రాదని అమెరికా హామీ ఇచ్చింది, కానీ ఒప్పందం కుదిరితే గాజా నుండి ఇజ్రాయెల్ సైన్యాన్ని ఉపసంహరించాలని మేం కోరాం, షరతుల్లో ఇలాంటి కొన్ని మార్పులు చెయ్యాలని అడిగాం" అని చెప్పారు. ఇదే విషయాన్నిఎయిర్‌ఫోర్స్ వన్ విమానం లో పాత్రికేయులు ట్రంప్ దృష్టికి తీసుకురాగా, హమాస్ ఉద్దేశాల విషయం తన దృష్టికి రాలేదంటూ "అలా అయితే మంచిదే... వచ్చేవారం గాజాపై ఒప్పందం జరిగే అవకాశాలు ఉన్నాయి" అన్నారు. అదేవిధంగా నిర్దిష్ట ప్రకారం వచ్చేవారంలో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ వాషింగ్టన్‌లో పర్యటించనున్నారు. చర్చలు విఫలమైతే యుద్ధం ఆపుతామని ట్రంప్ హామీ ఇచ్చారు తప్ప ఇజ్రాయెల్ సైన్యం గాజాను వదిలివెళ్ళిపోతుందని హామీ ఇవ్వలేదు. అదే విధంగా గాజాలో ఆహార సరఫరా పుష్కలంగా జరుగుతుందని హామీ ఇచ్చారు. కానీ అమెరికా, ఇజ్రాయెల్ సారథ్యంలోని సహాయ సంస్థల ద్వారా ఆహార సరఫరా జరగకూడదని హమాస్ కోరుతున్నది. ఈ మార్పులు చెయ్యాలని అడుగుతోంది. 10 మంది సజీవులైన బందీలను, 18 మృత దేహాలను ఇజ్రాయెల్‌కు అప్పగించేందుకు హమాస్ సుముఖత వ్యక్తం చేసిందన్నది మధ్యవర్తుల సందేశం. హమాస్ వద్ద ఇప్పటికీ ఇంకా 50 మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారు. వీరిలో కేవలం 28మంది మరణించారు. ఐతే ఐడిఎఫ్ సైన్యం గాజాలో ముమ్మర గాలింపు కొనసాగిస్తోంది.

**ఇజ్రాయెల్ మంత్రివర్గం చర్చ..వేలాదిమంది ప్రదర్శనలు**

నెతన్యాహూ వచ్చేవారం అమెరికా పర్యటన నేపథ్యంలో ఇజ్రాయెల్ మంత్రివర్గం గాజాలో ఒప్పందం చేసుకునే విషయంపై చర్చ జరిపింది. భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 9 గంటలకు ఇజ్రాయెల్ మంత్రివర్గం సమావేశమైంది. ఆ తర్వాత రాత్రి 10 గంటలకు ఇజ్రాయెల్ వ్యాప్తంగా వేలాది మంది ప్రదర్శనలు చేయడం ప్రారంభించారు. చర్చలకు సానుకూలంగా ఉన్నట్లు హమాస్ ప్రకటించడంతో బందీల కుటుంబాలు, వారి బంధువులు, స్నేహితులు వేలాదిమంది వీధుల్లోకి వచ్చి హమాస్‌తో ఒప్పందం చేసుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం ప్రారంభించారు. పెండింగ్ లేకుండా మొత్తం బందీలందరినీ విడుదల చేసేవిధంగా ఈ ఒప్పందం జరగాలని వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నినాదాలు చేశారు.

# స్వాతంత్ర్యవేడుకల వేళ 'బిగ్ బిల్'కు చట్టరూపం

మసకబారనున్న స్వల్పాదాయ వర్గాల జీవితాలు



**వాషింగ్టన్ :** అనుకున్న విధంగా అనుకున్న సమయానికి డోనాల్డ్ ట్రంప్ కల-పట్టుదల రెండూ నెరవేరాయి. గ్రాండ్ ఓల్డ్ పార్టీ (అధికార రిపబ్లికన్‌పార్టీ) ప్రతిష్ఠాత్మకంగా భావించిన బిగ్ బిల్‌పై ట్రంప్ సంతకం చేసి ఆమోదముద్ర వేయడంతో "బ్యూటిఫుల్ బిల్" చట్టరూపం దాల్చింది. ఎట్టిపరిస్థితుల్లో జులై నాలుగోతేదీనాటికి బిగ్ బిల్లు ఆమోదం పొందడానికి తన టేబుల్ మీద ఉండాలని రిపబ్లికన్లు ఆధికంగా ఉన్న అమెరికా దిగువసభకు ఆదేశించిన విధంగానే బిల్లు చట్టరూపం తీసుకుంది. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ బిల్లు ఒక బహుమతిగా ట్రంప్‌కు లభించడంతో రిపబ్లికన్లు హర్షాతిరేకం చేస్తున్నారు. అన్ని విభాగాలు, శాఖల కార్యాలయాలను అలంకరించి వేడుకలు ముమ్మరం చేశారు. బిల్లుపై సంతకం చేసేముందు దూరా ట్రంప్ లాంఛనంగా 22 నిమిషాలసేపు మాట్లాడారు. "వాగ్దానాలు చేశాం, వాటిని నిలబెట్టుకున్నాం" అన్నారు. రెండోవిడత పరిపాలనాకాలంలో ట్రంప్‌కు స్వదేశం లో ఇదే అతిపెద్ద ఘనవిజయం.

ఈ బిల్లుకు ఆమోదం తెలియజేస్తే ఆ మరునాడే డెమొక్రాట్లు, రిపబ్లికన్లకు వ్యతిరేకంగా 'ద అమెరికన్ పార్టీ' ఆవిర్భవిస్తుందని డాడ్జ్ శాఖ మాజీ అధిపతి, అపర కుబేరుడు ఎలాన్ మస్క్ హెచ్చరించిన తర్వాత నిర్దిష్ట సమయానికే బిల్లు ఆమోదం పొందింది. రెండోవిడత ట్రంప్ పరిపాలనా కాలం లో ఈ బిగ్ బిల్లు అత్యంత ప్రాముఖ్యతగల అంశంగా ఆయన యంత్రాంగం స్పష్టం చేసింది. ఈ బిల్లు దిగువ సభలో తుది ఆమోదం పొందడంలో హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ ఎంతో కీలకపాత్ర వహించారు. ఈ బిల్లును ఆయన ట్రంప్‌కు ఒక బహుమతిగా అందజేశారు. ఎంతో ఉత్కంఠభరితంగా ఎన్నడూలేనివిధంగా ఈ బిల్లుపై అమెరికా ఉభయసభలో చర్చలు నిద్రలేని రాత్రులతో కొనసాగాయి. బిల్లును చరిత్రాత్మకమైనదిగా, జాతి ఆవిర్భావకాలంలో ఇప్పటివరకూ అమెరికా చట్టసభల్లో ఆమోదముద్ర వేయించుకున్న మైలురాయి విజయంగా రిపబ్లికన్లు దీనిని అభివర్ణించారు. 215–214 ఓట్ల తేడాతో గట్టెక్కిన ఈ బిల్లును డెమోక్రటిక్ పార్టీ ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లు విజయం సాధించడంద్వారా అమెరికా వైభవం తిరిగి వచ్చినట్టేనని మైక్ జాన్సన్ అన్నారు. బుధవారంనాడు దిగువసభలో సుదీర్ఘ చర్చలు జరుగుతుండగా, ట్రంప్ గ్రాండ్ ఓల్డ్ పార్టీ ముఖ్యుందరూ సమావేశం జరిపారు. "ఈ చరిత్రాత్మకమైన బిల్లు ఆమోదం పొందడానికి కృషి చేసిన పార్టీ సభ్యులు, స్నేహితులు ప్రముఖులందరికీ ఆయన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఆహార ధరలపై దెబ్బ..ధనవంతులకు ప్యాకేజీ**

ట్రంప్ బ్యూటిఫుల్ బిల్లుతో వైద్యసేవలకు, పేదల వైద్య బీమాకు గండి పడింది. 1.18 కోట్లు కంటే ఎక్కువ మంది వైద్యబీమాకు దూరమవుతారు. తక్కువకు సరఫరా అయ్యే ఆహార వస్తుల ధరలు పెరుగుతాయి. ఒబామా, బైడెన్ పాలనాకాలంలో చేపట్టిన ఆరోగ్యసేవల విస్తరణ, పునర్వినియోగ ఇంధన వినియోగానికిగాను తక్కువ ఆదాయాలవారికి వర్తించే పన్నుల తగ్గింపు చర్యలను ఈ మెగా బిల్లు వెనక్కు మళ్ళిస్తుంది. తక్కువ ఆదాయాలున్న లక్షల మందిని దోచుకుని ధనవంతులకు ప్యాకేజీ ఇస్తున్నారని విమర్శకులు ట్రంప్‌పై ధ్వజమెత్తారు. ముఖ్యమైన రంగాలకు కోతలు విధించి న ఈ నిధుల్లో ఎక్కువ భాగం సరిహద్దు కాపలాకు, రక్షణ రంగానికే ఉపయోగిస్తారని ప్రతిపక్షాలు విమర్శించాయి. అందుకు తగ్గట్టుగానే, అనేక ట్రిలియన్ డాలర్లతో కూడిన ఈ మెగా బిల్లు ప్రణాళికలో 150 బిలియన్లు పెంటగాన్‌లోని రక్షణశాఖ కు వెళతాయి. అమెరికా గగనతల రక్షణకు ట్రంప్ తలపెట్టిన "గోల్డ్ డోమ్" ప్రాజెక్టు కూడా ఇందులో కలిసే ఉంది.


# టెక్సాస్ వరదల్లో 23 మంది బాలికలు గల్లంతు

## 24కు పెరిగిన మృతులసంఖ్య



**ఆస్టిన్ :** టెక్సాస్‌లో గడచిన గురువారం నుండి మొదలైన భారీ వరదలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ వరదలకారణంగా మరణించినవారిసంఖ్య 24కు పెరిగింది. రివర్‌సైడ్ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులలో 23 బాలికలు ఈ వరదల్లో గల్లంతయ్యారు. ఈ బాలికలకోసం చాలా ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. 500 మంది సిబ్బంది సామూహిక గాలింపు చర్యలు ప్రారంభించారు. మరో 14 హెలికాప్టర్లు కూడా రంగంలోకి దిగాయి. అత్యవసర సిబ్బంది 237 మందిని రక్షించారనీ, హెలికాప్టర్ల ద్వారా మరో 167 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చామని టెక్సాస్ సైనికాధికారి మేజర్ జనరల్ థామస్ సుయెల్జర్ చెప్పారు. ఈ వరదలు తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయని దేశాధ్యక్షుడు ట్రంప్ అన్నారు. టెక్సాస్‌కు ఏదైనా సహాయం చేశారా? అని పాత్రికేయులు ప్రశ్నించగా అదే పనిలో ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రజాభద్రతా విభాగం డైరెక్టర్ ఫ్రీమాన్ మార్టిన్ మాట్లాడుతూ, దీనిని సామూహిక ప్రాణనష్ట ఘటనగా పేర్కొన్నారు. వరదలు ముంచెత్తిన ప్రాంతాన్ని హిల్ కౌంటీగా పేర్కొంటారు. దక్షిణమధ్య టెక్సాస్ ప్రాంతంలో ఆకస్మిక వరదల కారణంగా తీవ్ర విపత్తు పరిస్థితులు నెలకున్నాయనీ, ఇప్పటివరకు 24 మరణించారనీ కెర్ కౌంటీ షరీఫ్ లారీ లైతా పత్రికాగోష్ఠిలో చెప్పారు. రివర్ సమ్మర్ క్యాంప్‌లో ఎక్కువమంది బాలికలు కనిపించకుండా పోయారని, మొత్తం గల్లంతైనవారి సంఖ్య 25గా తేలిందని టెక్సాస్ లెఫ్టినెంట్ గవర్నర్ డాన్ పాట్రిక్ చెప్పారు. గ్వాడాలుపే నది ఒడ్డున 750మంది బాలికలతో వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్న సమయంలో భారీవర్షం కురిసిందని, కేవలం 45 నిమిషాల వ్యవధిలోనే నది మట్టం ఎనిమిది మీటర్ల (26 అడుగులు) ఎత్తుకు పెరిగిపోయిందని పిల్లలు గల్లంతయ్యారని లైతా చెప్పారు. అమెరికాలోనే ఇది అత్యంత ప్రమాదకరమైన 'రివర్ వ్యాలీ'గా పేర్కొన్నారు.

# రష్యా వైమానిక స్థావరంపై ఉక్రేన్ దాడి



**కీవ్ :** రష్యా వైమానిక స్థావరంపై ఉక్రేన్ దళాలు శనివారంనాడు భారీ దాడులు చేశాయి. శుక్రవారం నాడు రష్యా గత మూడేళ్ళలో లేనిరీతిలో తీవ్రస్థాయిలో 550 డ్రోన్లు, క్షిపణులతో ఉక్రేన్ అంతటా దాడులు చేసి బీభత్సం సృష్టించింది. అనేక జిల్లాలలో తీవ్ర నష్టం జరిగింది. 23 మంది గాయపడ్డారు. ఈ ఘటన తర్వాత ఆగ్రహించిన ఉక్రేన్ ఎదురుదాడులకు దిగింది. రెండు దేశాల మధ్యా ఇటీవల దాడులు ఉద్ధృతం కావడంతో యుద్ధం ముగించేందుకు ఇటీవల జరిగిన ప్రయత్నాలు నీరు గారుతాయన్న ఆందోళన రేకెత్తుతోంది. రష్యా వోరోనెజ్క్స రీజియన్‌లోని బోరిసోగ్లెబ్క్స వైమానిక స్థావరాన్ని ఉక్రేన్ దళాలు ధ్వంసం చేశాయని ఆ దేశ మిలిటరీ జనరల్ స్టాఫ్ చెప్పారు. ఈ వైమానికస్థావరంలో రష్యాకు చెందిన ఎస్‌యు–34, ఎస్‌యు–35, ఎస్‌యు–30 ఎస్ఎం ఫైటర్‌జెట్స్‌కు స్థావరంగా ఉందని చెప్పారు. ఉక్రేన్ జనరల్ స్టాఫ్ పేస్‌బుక్‌లో ఈ విషయం రాశారు.

**పుతిన్–జెలెన్‌స్కీలతో ట్రంప్ ఫోన్ సంభాషణలు**

ఉక్రేన్ చుట్టూ పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. "జెలెన్‌స్కీతో నేను జులై నాలుగోతేదీన ఫోన్‌లో మాట్లాడాను, చాలా చాలా మంచి సంభాషణ జరిగింది, కానీ అక్కడ పరిస్థితి చాలా సంక్లిష్టంగా ఉంది, అదేవిధంగా జులై 3న పుతిన్‌తో నేను ఫోన్‌లో సంభాషణ చేశా, నాకు చాలా అసంతృప్తిగా ఉంది" అన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి రష్యా సుముఖంగా ఉందన్న విషయంపై ఆయన సందేహాలు వ్యక్తం చేస్తూ, ఇది మంచి పరిణామం కాదన్నారు. ఉక్రేన్‌తో చర్చలు జరపడానికి కొత్త తేదీలు వెతకడానికి మేం ఇంకా అన్వేషణలో ఉన్నామని ఫోన్ సంభాషణ సందర్భంగా ట్రంప్‌కు పుతిన్ చెప్పారు. ఉక్రేన్‌కు అన్ని రకాల భారీ ఆయుధాల సరఫరాలను అమెరికా ఆపేస్తుందని న్యూయార్క్ టైమ్స్ పత్రిక జులై రెండో తేదీన వార్త రాసింది.





## కఠిన శిక్షలు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉందని, ఈ కోర్టుల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం కల్పించడం, భవిష్యత్తులో వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నదే లక్ష్యమన్నారు. పోక్సో చట్టం, జువెనైల్ చట్టాల ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలని, ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి వేదన కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలన్నారు. న్యాయం కేవలం కోర్టుల్లోనే లభించాలని కాకుండా, ఈ ప్రక్రియలో ప్రతి దశలోనూ వారికి అవసరమైన అండదండలు లభించాలని, పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో పాటు అన్ని దశల్లోనూ బాధితులకు న్యాయం దక్కాలి, రక్షణ కల్పించాలి. న్యాయం దక్కడం అంటే కేవలం దోషులకు శిక్షలు విధించడం వరకే సరిపోదని, బాధితుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని, వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు ఉండాలన్నారు. అత్యంత హేయమైన ఇలాంటి నేరాలను నియంత్రించడంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, పౌర సమాజంలోని ఇతర భాగస్వామ్య సభ్యులందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామన్నారు. సదస్సులో యునిసెఫ్ ప్రతినిధి సింథియా మెక్‌ఫ్రే, డిజిపి డాక్టర్ జితేందర్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులు, పోలీసు అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో పాటు పౌర సమాజంలోని భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు హాజరయ్యారు.

## కుంభకోణం గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఎస్‌పి వివరాలు వెల్లడించారు. శాంతినగర్‌కు చెందిన ఎ1 లడ్వే రాహుల్‌కుమార్, ఎ2 లడ్వే బద్రీనాథ్ తండ్రీ కొడుకులు నిందితులని తెలిపారు. ఎ1 లడ్వే రాహుల్ కుమార్, గత కొన్ని నెలలుగా పట్టణంలోని వివిధ శాఖలకు సంబంధించిన పత్రాలను స్టాంపులను నకిలీవి సృష్టించి ప్రజలను మోసం చేస్తున్న సందర్భంలో పక్కా సమాచారంతో శుక్రవారం రాత్రి ఇంటిపై దాడి చేసి నకిలీ స్టాంపులు, స్టాంపులను తయారుచేసే రసాయనాలు, ఎక్స్‌రే పేపర్లు, స్టాంపుల పరికరాలు, కంప్యూటర్, హార్డ్ డిస్కులు, వివిధ జిల్లాల్లో వివిధ శాఖలకు సంబంధించినటువంటి తయారు చేసిన నకిలీ స్టాంపులు, అధికారుల సంతకాలతో కూడిన నకిలీ స్టాంపులు, నకిలీ పత్రాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పత్రాలను సృష్టించి నిజమైన భూ యజమానులకు, నకిలీ యజమానులకు మధ్య గొడవలు వచ్చే విధంగా పత్రాలను సృష్టించడం జరిగిందని తెలిపారు. నకిలీ పత్రాల ద్వారా ప్రభుత్వ స్కీములలో లబ్ధి పొందిన వారికి వివరాలను సేకరించి అదేవిధంగా ప్రభుత్వ స్థలాలను నకిలీ పత్రాలను సృష్టించి కబ్జా చేసిన వారి వివరాలను పట్టుకోవడానికి ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. డ్యాక్యుమెంట్ రైటర్ ముసుగులో ఫేక్ పత్రాలను తీసుకున్న వీరిపై కఠినమైన చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. దర్యాప్తులో పూర్తి వివరాలను విశ్లేషించి కుంభ కోణంలో ఇతర వ్యక్తుల పాత్రపై విశ్లేషణ జరుగుతుందని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేసి ఫేక్ పత్రాలను ద్వారా లబ్ధి పొందిన వారిపై తగు చర్యలను తీసుకోబడతాయని తెలిపారు. ఈ కుంభకోణం బట్టబయలులో కీలక పాత్ర పోషించిన సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి సునీల్‌కుమార్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి ఎల్ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సిఐ బి సునీల్ కుమార్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'కొత్త స్టాంప్ సవరణ బిల్లు'

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను, 26 ఆర్టికల్స్‌ను సవరించేందుకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి భారత ప్రభుత్వ ఆమోదం కోసం పంపించామని, దీనిపైన కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చినప్పటికీ, 2023 జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకుని, ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించామన్నారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలను కట్టుదిట్టమైన రూపంలోనికి తీసుకురావడం, కొత్త ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని, అలాగే పాత చట్టంలో లేని వాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని మంత్రి అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు.

**శాస్త్రీయ పద్ధతిలో భూముల సవరణ**

సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎటువంటి భారం పడకుండానే, ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా, ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలని మంత్రి పొంగులేటి సూచించారు. ఏ,ఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది, అక్కడ హేతబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది? ఇలా తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ అభ్యుదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందని,ఇందులో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గించాలనే ఆలోచన చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. కొత్త, పాత అపార్ట్‌మెంట్‌లకు స్టాంప్ డ్యూటీ ఒకే విధంగా ఉన్నదని, ఇక నుంచి పాత అపార్ట్‌మెంట్లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకుని స్టాంప్ డ్యూటీ తగ్గించాలనే ఆలోచన చేస్తున్నామని, ఈ రెండు అంశాలపై సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ రోల్ మోడల్

(మొదటి పేజీ తరువాయి)

మహిళా సంఘాల గ్రూప్‌లకు ఆర్‌టిసి నుంచి రావాల్సిన బస్సుల అద్దెకు సంబంధించి రూ.1.05 కోట్ల చెక్కులను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి డిప్యూటి సిఎం అందజేశారు. అదేవిధంగా మహిళ రచయితలు, కవులు రాసిన మహాలక్ష్మి 'మహిళా సాధికారతలో ప్రగతి చక్రాలు' పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మహిళలను మహారాణులుగా గౌరవించుకోవాలని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తుతోందని తెలిపారు.రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి నిర్దేశించుకున్న లక్ష్యంలో మొదటి సంవత్సరం రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించగా, ప్రతి ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా వీటిని అందంచబోతున్నామని తెలిపారు. ఈనెల 12 నుంచి 18 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రజలందరి సమక్షంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కేవలం వడ్డీ లేని రుణాలే కాకుండ బ్యాంకు లింకేజ్, లోన్ బీమా, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మనందరిదని, సమాజంలో ప్రధానమైనదికుటుంబ వ్యవస్థ అని, దీనిని నడిపేది మహిళేనని వారి ఆర్థికంగా బలోపేతం చేస్తే ప్రజలందరూ సగౌరవంగా జీవించే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడుతుందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్‌టిసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించామన్నారు. త్వరలోనే దాదాపు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసిన రికార్డు నమోదుకాబోంది. తద్వారా ప్రభుత్వం రూ.6500 కోట్ల విలువైన ఉచిత ప్రయాణిన్ని అందించిన ఘనతను దక్కించుకోనుందని తెలిపారు. నష్టాలో ఉన్న ఆర్‌టిసి ఆదుకుంది మహాలక్ష్మి పథకమని, ఇప్పుడిప్పుడే ఆర్‌టిసి లాభాల బాట పడుతోందని చెప్పారు. జంట నగరాల్లో మహిళలకు 5 వేల ఈవి ఆటోలను అందజేసే ఆలోచన చేస్తున్నామని, తద్వారా వారికి ఉపాధి కల్పంచడంతోపాటు హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గుతుందని తెలిపారు.

## సిఎం సవాల్ స్వీకరిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

పండిపోయామని, కానీ వారు (కాంగ్రెస్) ఫ్రీపేర్ కాలేదని చెప్పకుండా, సిఎం రేవంత్‌రెడ్డి మంచిగా ప్రీపేర్ అయి చర్చకు రావాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం కెటిఆర్ మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో చంద్రబాబు రైతుల గొంతు కోస్తుంటే, గోదావరి నీళ్లను తీసుకెళ్తుంటే సిఎం వంత పడుతున్నారని, జల దోపిడీని అడ్డుకునే క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రయోజాలనకు సిఎం రేవంత్ రెడ్డి వంత పాడుతున్నారని కెటిఆర్ ఆరోపించారు. ఇందిరమ్మ గొప్పతనం కాలిపోయిన మోటర్లు, ఎరువులు, విత్తనాల కోసం అసమర్థ ప్రభుత్వం రైతులను కాల్చుకు తింటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువులు, యూరియా కోసం ధర్నాలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నదన్నారు. తెలంగాణలో రైతు రాజ్యం ఎవరు తీసుకొచ్చారో? ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హర్యానాను తలదన్ని భారతదేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణను ఎవరు చేశారో తెలంగాణ ప్రజలకు తెలుసునన్నారు.

## ఎఐ టెక్నాలజీ

(మొదటి పేజీ తరువాయి)

యాప్‌ను తిర్చిదిద్దాలని మంత్రి సూచనల మేరకు పలు మార్పులు చేర్పుల చేసిన కృషివాస్ సంస్థ క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసింది. ఇదేక్రమంలో మంత్రితో సమావేశమైన కృషివాస్ సంస్థ ప్రతినిధులు యాప్ పనితీరును వివరించారు. ఏఐ టెక్నాలజీతో శాటిలైట్ ఇమెజింగ్ ద్వారా ముందస్తుగానే పంటలకు వచ్చే చీడ పురుగులు, రసం పీల్చే పురుగులను గుర్తించి, వాటిని మొదట్లోనే నిరోధించేవిధంగా టెక్నాలజీ ఉపయోగపడనుందని మంత్రికి వివరించారు. అంతేకాకుండా పంట బయటకు కనిపించే వాటినే కాకుండా పంట అంతర్గతంగా ఉన్న రోగాన్ని కూడా గుర్తించి దానికి నివారణ చర్యలు కూడా సిఫార్సు చేస్తుందని, దీని ద్వారా వాటికి కావాల్సిన నివారణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పొలంలో ఎక్కడ ఏ ప్రాంతంలో ఏ మొక్కకు తెగులు సోకిందో ముందు గానే గుర్తించి, దానికి పిచికారి చేయాల్సిన మందును కూడా మనకు సూచిస్తుందని చెప్పారు. దీంతో సంబందిత రైతు ఆ పంటకు పిచికారి చేసి పంటలను సరైన సమయానికి సంరక్షించుకోవచ్చుని, అసలు పొలం దగ్గరకి పోకుండా కూడా ఈ యాప్ ద్వారా పంట స్థితిగతులను తెలుసుకోవచ్చని మంత్రికి వివరించారు. రైతుపంట ఎంత వేశారు, ఎన్ని ఎకరాలలో వేశారు అన్న డేటా కూడా రియల్ టైంలో వ్యవసాయ అధికారులకు లభిస్తుందన్నారు. ఎక్కడైతే తెగుళ్ళు ఏర్పడుతుందో, దానినే ముందుగా గుర్తించి, నివారణ దిశగా చర్యలు తీసుకోవడం వలన రైతులకు మిగతా పొలానికి తెగులు ఏర్పడకుండా నివారించి, తక్కువ కూలీ ఖర్చుతో, అధిక దిగుబడి పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. అంతేకాకుండా ఈ ఏఐ యాప్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ముందస్తు సమాచారం,సమస్యను గుర్తించడం, సమస్య చోటులోనే స్ప్రే చేయడం, వాతావరణ హెచ్చరికలు, నేల ,ఆకు తేమ సమాచారం, ఆయిల్ పామ్ లో ప్రతి చెట్టు కు రియల్ టైం సమాచారం ఇస్తుందని తెలిపారు.ఈ యాప్ ద్వారా 60 కు పైగా పంటలను (పత్తి, మొక్క జొన్న, వరి, మిరప, కూరగాయలు, ఆయిల్ పామ్ మరియు ఇంకా ఎన్నో రకమైన పంటలు) పరీక్షించించే విధంగా అవకాశం ఉందని వెల్లడించారు ఈ యాప్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ కృషి వికాస్ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అంతేకాకుండా ఇక్రిశాట్ వారితో సమన్వయం చేసుకొంటూ ఈ సంస్థ వారికి సూచించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అర్హులైన కళాకారులకు పింఛన్లు: మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలకు కళారూపాలతో జీవంపోసి భావి తరాలకు అందిస్తున్న వృద్ధ కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని, కళాకారులు సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని పర్యాట క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రవీంద్రభారతిలో మాజీ ఎంఎల్‌సి మృత్యుంజయం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు శనివారం మంత్రి జూపల్లిని కలిసారు. అర్హులైన వృద్ధ కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలని, ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని, హెల్త్ కార్డులు అందించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అర్హులైన వృద్ధ కళాకారులందరికీ పెన్షన్ ఇచ్చే అంశాన్ని పరిశీస్తున్నామని, దీనిపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు తక్షణ చర్యలు

### మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను అదేశించారు. అదేవిధంగా ప్రజలందరూ తమ ఇళ్లను పరిసరా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణతో పాటు తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలపై మంత్రి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో శనివారం సమిక్షించారు.

ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, మెడికల్ కార్పొరేషన్ ఎండి ఫణీంద్ర రెడ్డి, జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, పబ్లిక్‌హెల్త్ అడిషనల్ డైరెక్టర్ అమర్ సింగ్ నాయల్, జాయిట్ డైరెక్టర్ శివబాలాజీ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులకు చికిత్స అందించేందుకు ఆసుపత్రుల్లో అవసరమైన అన్ని వసతులతో పాటు అవసరమైన అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలు, గ్రేటర్ హైదరాబాద్‌లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జిహెచ్ఎంసి జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో రివ్యూ చేయాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ట్రైబల్ ఏరియాలపై ఎక్కువగా దృష్టి సారించాలని ,ఐటిడిఎ పీవోలతో సమన్వయం చేసుకోవాలన్నారు.

క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పర్యటించాలని మంత్రి ఆదేశించారు. .

డెంగ్యూ, ప్లేట్‌లెట్స్ పేరిట పేషెంట్లను దోచుకునే ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్‌ను మంత్రి ఆదేశించారు.సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు. సీజనల్ వ్యాధుల బారిన పడితే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను ఉపయోగించుకోవాలని ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. అంతకు ముందు రాష్ట్రంలో మే నుంచే వర్షాలు ప్రారంభం కాగా, వాతవరణంలో వచ్చిన ఈ మార్పుల వల్ల మే, జూన్ నుంచే అక్కడక్కడ సీజనల్ వ్యాధులు మొదలయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు.గతేడాదితో పోలిస్తే ఈసారి చాలా జిల్లాల్లో డెంగీ కేసులు తక్కువగా నమోదయ్యాయని, గ్రేటర్ హైదరాబాద్‌లో స్వల్పంగా కేసులు పెరిగాయని తెలిపారు. 19 జిల్లాల్లో పది కంటే తక్కువ కేసులు నమోదవగా, మిగిలిన జిల్లాల్లో పదికంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయన్నారు.గతేడాదితో పోలిస్తే టైఫాయిడ్ కేసులు చాలా తక్కువగా నమోదయ్యాయని తెలిపారు.

## ఈ ఏడాది చివరినాటికి 'టిమ్స్' ఆసుపత్రులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరం నలుమూలాల నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రులను ఈ ఏడాది చివరినాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అధికారులను అదేశించారు. సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులపై ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి శాఖల ఉన్నతాధికారులతో మంత్రి శనివారం సచివాలయంలోసమిక్షించారు. ఈ ఏడాది చివరికల్లా హాస్పిటళ్లను ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచనల నేపథ్యంలో హాస్పిటళ్ల నిర్మాణ పనులు, ఎక్విప్‌మెంట్, డాక్టర్లు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై అధికారులకు మంత్రి దామోదర రాజ నర్సింహ దిశానిర్దేశం చేశారు. అధికారులందరూ సమన్వయంతో పని చేయడం ద్వారా నిర్ణీత సమయంలో అన్ని పనులూ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. హాస్పిటళ్లు ప్రారంభించిన రోజు నుండే వైద్య సేవలు అందుబాటులోకి రావాలని అధికారులను ఆదేశించారు.ఈ 4 ఆసుపత్రుల కోసం అధునాతన ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయాలని సూచించారు.ఎక్విప్‌మెంట్ కొనుగోలులో సంబంధిత డాక్టర్లు, టెక్నికల్ ఎక్స్‌పర్టుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# క్షేత్రస్థాయిలో సర్వే చేయించి సమస్యలు పరిష్కరించాలి

### అవినీతిపరులను విదేశాల నుంచి రప్పించకుండా కేంద్రం చేస్తున్నదేంటి?
### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** గత ప్రభుత్వంలో ధరణి పోర్టల్ పూర్తిగా వైరస్ సోకి అనేక భూసమస్యలకు కారణమైందని, అవినీతి, అక్రమాలకు తెరలేపారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చి భూసంబంధిత సమస్యలపై క్షేత్రస్థాయిలో గ్రామం యూనిట్‌గా సర్వేనెంబర్ల వారీగా సర్వే చేయించి రైతుల కష్టాలను తొలగించాల్సిన బాధ్యత నెరవేర్చాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సబ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి కోరారు. శనివారం కరీంనగర్‌లోని బద్దంఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వృత్తి సమస్యగా చెప్పుకునే భూసమస్యలు ఏళ్లుగా అనేక రూపాల్లో లొసుగులు, సమస్యలతో పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. మ్యానువల్ రిజిస్టర్ ఉండాలని చెప్పినా వినకపోవడంతో అధికారులు విచ్చలవిడిగా తప్పులు చేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. అటు అధికారులకు, ఇటు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారి కోట్లాది రూపాయలు చేతులు మారాయన్నారు. రైతుల కష్టాలు తీరుస్తామని చెబుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చట్టాల్లో ఉన్న లొసుగులను ప్రక్షాళన చేస్తూ మాటల్లోనే కాదు చేతల్లో చూపాలని కోరారు. తెలంగాణలో మెట్టప్రాంతాలకు సాగునీరం దించడానికి ఎత్తిపోతలే ఏకైక మార్గమని సిపిఐ యాభై ఏళ్లకు పైగా పోరాడుతుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ కాళేశ్వరంకు అంకురార్పణ చేసినప్పటికీ అందులో అవినీతి చోటు చేసుకుందని, పిల్లర్లు కుంగిపోయాయన్నారు. తెలంగాణకు అవసరమైన సాగు,త్రాగు నీరందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు, సలహాలతో తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. 17 ఏళ్లుగా 7500 కోట్లు ఎగ్గొట్టిన విజయ్ మాల్యా, లలిత్ మోడీలకు కేంద్రం వత్తాసు పలుకుతూ విదేశాల్లో విలాసవంతంగా గడుపుతుంటే నోటీసులు పంపినా ఇండియాకు రాకపోతే ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో సమాజం కోసం, ప్రజల కోసం, సమతా రాజ్యం కోసం పోరాడుతున్న వారిని హతమార్చడం అన్యాయమని, చత్తీస్ఘడ్, తెలంగాణ సరిహద్దులను చుట్టుముట్టి హతమారుస్తూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతుందన్నారు. శాంతి చర్చలకు సిద్దమైనప్పటికీ ఎందుకు స్పందించడం లేదన్నారు. సూర్యుడు, చంద్రుడు, దోపిడీ, అణచివేత ఉన్నంత కాలం మావోయిస్టుల సిద్ధాంతం ఉంటుందన్నారు.

**అర్హులకు పథకాల అమలుకై దశలవారీ పోరాటాలుః జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు దరిచేరడం లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ వంటి పథకాలలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. ఈ లోపాలు సవరించి అర్హులను ఎంపిక చేయాలని కోరుతూ అన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జిలకు సిపిఐ శ్రేణులు వినతి పత్రాలు అందజేయాలని జిల్లా కార్యవర్గ సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా అనర్హులను ఎంపిక చేసిన పక్షంలో ఈ నెల 15 నుంచి 20 తేదీలలో అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు, ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

విలేకరుల సమావేశంలో జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,సమ్మయ్య, పైడిపల్లి రాజు, బామండ్లపల్లి యుగేందర్ తదితరులున్నారు.

## గ్రామ పరిపాలన అధికారులను నియమిస్తాం : మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తే, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా, ప్రతి రెవెన్యూ గ్రామానికీ ఒక గ్రామ పరిపాలన అధికారిని (జిపిఒ) నియమిస్తుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకోసం గతంలో విఆర్‌ఒగా పనిచేసినవారికి జిపిఒలుగా అవకాశం కల్పించేందుకు ప్రత్యేక పరీక్ష నిర్వహించామని, ఇందులో 3,454 మంది అర్హత సాధించారని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు విఆర్ఒ, విఎఒలకు మరోసారి త్వరలోనే అర్హత పరీక్షను నిర్వహించనున్నట్టు మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్‌తో కలిసి రెవెన్యూ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పరిపాలన అధికారుల నియామకంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విఆర్ఒ,విఎఒ వ్యవస్థను రద్దు చేసి, సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేస్తే, తమ ప్రభుత్వం సామాన్య ప్రజలకు రెవెన్యూ సేవలను చేరువ చేయడానికి ప్రజా కోణంలో నిర్ణయాలు తీసుకుని, గ్రామ పాలనా అధికారుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని వివరించారు. అందరి సహకారంతో రెవెన్యూ సదస్సులు విజయవంతమయ్యాయని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. భూ భారతి ఫలితాలు ప్రతి పేదవాడికి చేరేలా చట్టం అమలుకు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాములు, తదితరులు పాల్గొన్నారు.




## సార్వత్రిక సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో వామపక్ష విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపడంతో పాటు ప్రత్యక్షంగా పాల్గొంటాయని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ నాగరాజులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సార్వత్రిక సమ్మె మద్దతుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్, మణికంఠ రెడ్డి, తాళ్ళ నాగరాజు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం దేశంలో గత 11 ఏళ్ల నుంచి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ఇప్పుడు కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసువచ్చిన నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మిక వర్గానికి అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. విద్యారంగంలో నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయడం ద్వారా దేశంలో ఉన్న పేద విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకే అప్పగించాలని, విభజన హామీ చట్ట ప్రకారం తెలంగాణాకి రావాల్సిన విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం పోరాటాలకు సిద్ధం కావాలని, జులై 9 న జరిగే సార్వత్రిక సమ్మెలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెహమాన్, రాష్ట్ర నాయకులు హరీష్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి విధానాలు నచ్చనోళ్లు పార్టీని వీడొచ్చు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి విధానాలు, నిర్ణయాలు నచ్చక ఎవరు పార్టీని వీడినా తమకు నష్టం లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. పార్టీని నమ్ముకున్నవారిని బిజెపి ఎప్పుడూ మోసం చేయదని, అందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీలో అందరూ ఒకటేనని, తమ మధ్య అభి ప్రాయ భేదాలు లేవన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను, మహిళలను మోసం చేశాయని విమర్శించారు. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి తన నిస్సహాయతను ఒప్పుకున్నారన్నారు.

రైతాంగాన్ని మోసం చేస్తే వాళ్ల ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత రేవంత్ రెడ్డికి కనబడటం లేదని, దీనిమీద బిజెపి చర్చకు సిద్ధమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బిజెపి మీద ఆరోపణలు చేసే ముందు వారు పునరాలోచన చేసుకోవాలన్నారు. రాబోయే ప్రభుత్వం బిజెపిదేనని, తెలంగాణలో బిజెపికి ప్రజలు 90 సీట్లు ఇవ్వబోతున్నారని రాంచందర్ రావు జోస్యం చెప్పారు.

ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత బిఆర్ఎస్, కాంగ్రెస్‌లదేనని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారన్నారు. 100 రోజుల్లో 6 గ్యారెంటీలు అమలు చేసి తీరుతామని చెప్పి, 600 రోజులైనా అమలు చేయలేదని విమర్శించారు.

# ఆధునిక సాంకేతికత పట్ల విద్యార్థుల్లో అవగాహన

### మంథని పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం/మంథనిః** ఆధునిక సాంకేతికత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు.శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ విద్య, వైద్యం రంగాల పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అన్నారు. పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని నమ్మకం కలిగిస్తూ బడి బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మంథని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 25 మంది కొత్త విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుంచి వచ్చి చేరడం చాలా సంతోషకరమని అన్నారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని అన్నారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు తన వంతు ప్రయత్నం చేస్తానని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహించి నూతనంగా 10 వేల పైగా ఉపాధ్యాయ పోస్టులను మనం భర్తీ చేశామని అన్నారు. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేశామని అన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఎక్కడ ఎటువంటి ఆరోపణలు రాకుండా పారదర్శకంగా పూర్తి చేసామని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నూతన సాంకేతికతను నేర్పించాలనే లక్ష్యంతో మంథని బాలికల పాఠశాలలో 58 లక్షలతో డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. మంథని నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో డిజిటల్ క్లాస్ లను ఏర్పాటు చేయాలని, దీని కోసం సిఎస్ఆర్ నిధులు వినియోగిస్తామని అన్నారు. రోబోటిక్స్, డ్రైవర్ లెస్ కార్లు వంటి సాంకేతిక అంశాలు పిల్లలకు నేర్పాలని అన్నారు. మంథని పట్టణంలో చిన్న సాఫ్ట్ వేర్ కంపెనీ ఏర్పాటు చేశామని, 30 మంది యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు.

పాఠశాలలో ఉన్న మిగిలిన క్లాస్ రూమ్ లను కూడా డిజిటల్ చేయాలని,డిజిటల్ పాఠశాలగా మంథని జడ్పీహెచ్ ఎస్ ను తీర్చిదిద్దాలని మంత్రి ఆదేశించారు. పిల్లలు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలని, పెరుగుతున్న సాంకేతికతను ఉపయోగించాలని, దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్,ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్, ఎంపిడిఓ,సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## యశోద హాస్పిటల్ నుండి కెసిఆర్ డిశ్చార్జ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వల్ప అస్వస్థత కారణంగా గురువారం యశోద దవాఖానాలో చేరిన బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు వైద్యుల సలహామేరకు శనివారం డిశ్చార్జ్ అయ్యారు. రెండు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో సాధారణ వైద్య పరీక్షల నిర్వహణ అనంతరం, ఆరోగ్యం మెరుగ్గానే వుందని, సోడియం లెవల్స్ కొద్దిగా పెరిగాయని, యశోద వైద్యులు నిర్ధారించిన సంగతి తెలిసిందే. కాగా, వైద్య పరీక్షల్లో భాగంగా, ఒక వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి వుంటుందని, ఆ తర్వాత, మరోసారి కొన్ని వైద్యపరీక్షలు నిర్వహించాల్సి వుంటుందని యశోద వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో రానున్న గురు, శుక్ర వారాల్లో వైద్య పరీక్షల నిమిత్తం మరోసారి యశోద హాస్పటల్ కు అధినేత కెసిఆర్ వెల్లనున్నారు. పూర్తి ఆరోగ్యంతో వున్న కెసిఆర్ వైద్య పరీక్షల నడుమ విరామ సమయంలో, రాష్ట్రంలో సాగునీరు, రైతులు, వ్యవసాయం, తదితర ప్రజా సమస్యల మీద, గత రెండు రోజులుగా పార్టీ సీనియర్లతో చర్చిస్తూ సమాచారం తీసుకుంటూ తదనుగుణంగా సూచనలిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# మేడారం మాస్టర్ ప్లాన్‌పై మంత్రి సీతక్క దిశానిర్దేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మేడారం మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలో శనివారం మేడారం మాస్టర్ ప్లాన్‌పై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకటరావు, ములుగు కలెక్టర్ దివాకర్ టిఎస్, సమ్మక్క సారలమ్మ జాతర పూజారుల సంఘం అధ్యక్షులు సిద్దబోయిన జగ్గారావు, పూజారి సిద్దబోయిన అరుణ్ కుమార్ మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. మేడారం ఆల య ప్రాంగణాన్ని ఆదివాసుల ఆచార సంప్రదాయాలను మరింత చాటి చెప్పేలాతీర్చిదిద్దాలని ఆదేశించారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర పూజారుల సలహా సూచనలతో మేడారంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఆదివాసీల విశ్వాసాలు, సమ్మక్క సారలమ్మల జీవిత గాథలను ప్రతిబింబించేలా అభివృద్ధి కార్యక్రమాలు ఉండాలన్నారు. సమ్మక్క సారలమ్మల గద్దెలు, ఎంట్రెన్స్, క్యూలైన్ల డిజైన్‌ను సిద్ధంచేసి సమ్మక్క సారలమ్మ పూజారులకు అందజేయాలన్నారు.

ఆదివాసీల ఆచారం ప్రకారం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులు వరుసలో ఉండేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ సంస్కృతిక శాఖ పరిశోధన గ్రంథాల ఆధారంగా డిజైన్ చేయాలని సూచించారు. జనవరిలో వచ్చే మేడారం జాతర వరకు మేడారం మాస్టర్ ప్లాన్‌లోని ఫస్ట్ ఫేస్ ను పూర్తి చేయాలని అన్నారు.

**ప్రతిష్టాత్మకంగా 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం**

వర్షాకాలం ప్రారంభమైనందున ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కార్యదర్శి శ్రీధర్, డైరెక్టర్ సృజన, ఈఎన్‌సి కృపాకర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు, డిపిఓ, డిఆర్‌డిఓ, సిఈఓలు పాల్గొన్నా రు. గత ఏడాది 6 కోట్ల 90 లక్షల మొక్క లు నాటినట్టు నివేదించారు. నాటిన మొక్కల్లో ఎన్ని బతికాయో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈసారి గత ఏడాది లక్ష్యానికి మించి ఏడు కోట్ల మొక్కలను నాటాలని నిర్ణయించామన్నారు. నర్సరీలలో దాదాపు తొమ్మిది కోట్ల మొక్కల వరకు సిద్ధం చేశామన్నారు.

తాటి, ఈత, పండ్ల మొక్కలను నాటాలని మంత్రి సూచించారు. చెట్లను ప్రజలకు ఆదాయంగా మారిస్తే వాళ్లే వాటిని సాదుకుంటారని మంత్రి అన్నారు. గ్రామస్థాయిలో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. దోమలు, అంటు రోగాలు రాకుండా నీటి నిలువ నివారణకు డ్రైడేను నిర్వహించాలని అధికారులకు మంత్రి సూచించారు. ఫాగింగ్, బ్లీచింగ్ నిత్యం జరగాలన్నారు. తాగునీరు ట్యాంకులను ప్రతి 10 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం నివేదికను రోజువారీగా నివేదించాలని ఆదేశించారు. మొక్కలు నాటేందుకు గుంతలను సిద్ధం చేయాలని, ఇప్పటివరకు 50 శాతం గుంతల నే పూర్తిచేశారని, యుద్ధ ప్రాతిపదికన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. స్వచ్ఛతనం పచ్చదనంపై అధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు. .

## దామోదర్ లొంగిపోతాడని బూటకపు ప్రచారం

### మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి:** తెలంగాణ మావోయిస్టు రాష్ట్ర కమిటీకి చెందిన దామోదర్ లొంగిపోతాడనే వార్తల్లో ఏమాత్రం నిజం లేదని అది బూటకపు ప్రచారం అని మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాకు ఓ లేఖను విడుదల చేసారు.దామోదర్ లొంగుబాటు అని జూన్ 1 నుంచి వివిధ పత్రికల్లో,సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నిజం కాదని కొట్టిపారేశారు.అలాగే సీతక్కను హెచ్చరిస్తూ తాము లేఖ విడుదల చేసినట్లు వచ్చిన లేఖ తాము విడుదల చేసింది కాదని జగన్ తేల్చారు. జూన్ 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర కమిటీ దామోదర్ లొంగిపోతున్నట్లు దిన పత్రికలలో, సోషల్ మీడియాలలో విస్తృత ప్రచారం చేసారని, మీడియా చేసిన ఈ ప్రకటనలలో ఎలాంటి వాస్తవం లేదని, పోలీసులే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా దామోదర్ ఎన్కౌంటర్‌లలో చనిపోయినట్లు లేదా లొంగిపోతున్నట్లు అనేక సార్లు ప్రచారం చేశారని, విప్లవ ప్రజలను గందరగోళ పరచడానికి ఈ దుష్ప్రచారం కొనసాగుతోందని తెలిపారు. ఇటీవల మా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో జూన్ 26న మంత్రి సీతక్కపై వచ్చిన పత్రిక ప్రకటనకు మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఇది ఇలా ఉంటే తెలంగాణాలో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు లేకపోయినప్పటికీ పోలీసులు మాత్రం మావోయిస్టు పార్టీకి ప్రజలు ఎలాంటి సహకారాన్ని అందించకూడని, సహకరించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, మావోయిస్టు పార్టీ వస్తే వెంట నే సమాచారం ఇవ్వాలని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాలలో అమాయక ఆదివాసి ప్రజలను పోలీస్ స్టేషన్‌లకు పిలిచి బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇది తెలంగాణ ప్రజలు గమనించాలని మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: అయిజ**
**జోగులాంబ గద్వాల జిల్లా, తెలంగాణ రాష్ట్రం.**

టెండర్ నోటీస్ నెం. E/01-05/WORKS/2025-26 (ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన) తేది: 04.07.2025

**పనుల మొత్తం సంఖ్య:** 5 పనులు, **అంచనా కాంట్రాక్ట్ విలువ:** రూ.24.999 లక్షలు, **బిడ్ దాఖలుకు ప్రారంభ తేదీ & సమయం:** 04.07.2025న సా.04.30గం.లకు, **బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం:** 14.07.2025న సా.04.30గం.ల వరకు, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. బిడ్స్ ఆహ్వాన అధికారి, కమిషనర్, అయిజ మున్సిపాలిటీ, జోగులాంబ గద్వాల జిల్లా, తెలంగాణ. ఫోన్ నెం. 9000863096, 8897509127.

సం/- సిహెచ్.సైదులు, కమిషనర్, అయిజ మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 4657-PP/CL/ADVT/1/2025-26, Date: 05-07-2025




## ప్రకృతి గీసిన అద్భుత చిత్రం..




పోర్చుగల్‌లోని ఫిగెరా డాఫోజ్, బ్యుర్కాస్ బీచ్‌లో ఆవిష్కృతమైన అద్భుత దృశ్యం ఇప్పుడు అన్ని మాధ్యమాల్లోనూ వైరల్ అవుతున్నది. సముద్రంపై ఎవరో ఒక మేఘాన్ని అమర్చినట్టు కనిపించిన ఆ దృశ్యాన్ని చూసి అక్కడికి వచ్చిన వారు తొలుత సునామీ సంకేతంగా భావించి భయపడ్డారు. అది కాదని తెలుసుకొని, ఆ అద్భుతాన్ని ఆస్వాదించారు. దీనినే సైన్స్‌లో 'రోల్ క్లౌడ్' అంటారు. ఈ ఫెనామినా వాతావరణంలో కనిపించే అరుదైన, శోభాయమానమైన, గాలి పరిస్థితులకు సంబంధించి ఏర్పడే ఒక ప్రత్యేక మేఘ ఆకృతి. ఇది నలుపు లేదా ముదురు గోధుమ రంగులో ఉండే, సిలిండర్ ఆకారంలో గిరగిర తిరిగే మేఘ సమూహం. సాధారణంగా ఇది భూమికి అతి సమీపంగా ఏర్పడుతుంది. ఇది ఇతర మేఘాలతో కలవని, స్వతంత్ర మేఘం. కొన్నిసార్లు ఇది కిలోమీటర్ల దూరం వరకూ విస్తరిస్తుంది. ఇదిగాలిలో తేలుతూ తిరుగుతుంది కాబట్టే 'రోల్ క్లౌడ్' అన్న పేరు స్థిరపడింది. ఇది వర్షం లేదా తుఫాను తెచ్చే మేఘం కాకపోవచ్చు, కానీ ఈ మేఘం ఏర్పడే సమయంలో వాతావరణంలో మార్పులు తలెత్తుతాయి. సాధారణంగా మానవుని చూపుకు దొరకని మేఘాకృతి. కానీ అది కనిపించినప్పుడు ఆ దృశ్యం ఓ మాయాజాలంలా ఉంటుంది. ఈ మేఘం భూమికి చాలా దగ్గరగా, సుమారుగా 200 నుంచి 1000 మీటర్ల ఎత్తులో ఏర్పడుతుంది. శీతల గాలి ఒకవైపు, వేడి గాలి మరోవైపు ఉధృతంగా ఉన్నప్పుడు, వీటి మధ్య ఏర్పడే గాలుల తారతమ్యం రోల్ క్లౌడ్‌గా ఏర్పడుతుంది. ఉదాహరణకు, ఒక తుఫాను తర్వాత, చల్లని గాలి మట్టికి దగ్గరగా పైకి నెట్టబడుతుంది. అదే సమయంలో, వెనుకవైపు వేడి గాలి పైకి లేచే ప్రయత్నం చేస్తుంది. ఈ రెండింటి మధ్య ఏర్పడే గాలి ప్రవాహం వక్రత, గిరగిర తిరుగుతూ ఉండే మేఘాన్ని సృష్టిస్తుంది. గాలి వివిధ ఎత్తుల్లో వేగం లేదా దిశ మారుతూ ఉంటే, దాన్ని విండ్ షీర్ అంటారు. ఇది రోల్ క్లౌడ్ ఏర్పడటానికి మరో ముఖ్యమైన కారణం. సాధారణ మేఘం త్రికోణాకృతిలో ఉంటే, రోల్ క్లౌడ్ సిలిండర్ ఆకారంలో ఉంటుంది. సాధారణ మేఘం కదులుతుందిగానీ తిరగదు. రోల్ క్లౌడ్ సుడిగాలి మాదిరి గిరిగిర తిరుగుతూ కదులుతుంది. మేఘాలు వర్షానికి సంకేతాలు. కానీ, రోల్ క్లౌడ్‌ను వర్షానికి సూచనగా భావించడానికి వీల్లేదు. రోల్ క్లౌడ్ ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కనిపించినట్టు వార్తలు ఉన్నా యి. అయితే, ఆస్ట్రేలియాలోని బుర్కెటౌన్ ప్రాంతంలో ప్రతి ఏడాది సెప్టెంబర్–అక్టోబర్ మధ్య 'మార్నింగ్ క్లౌడ్' ఏర్పడుతుంది. ఇది అత్యంత ప్రసిద్ధమైన రోల్ క్లౌడ ఫార్మేషన్. దీని పొడవు 1000 కి.మీ.లకు పైగా ఉండవచ్చు.

## ఎగిరే రోబోట్..



ఇటలీ శాస్త్రవేత్తలు రూపొందించిన 'ఐరాన్ క్యూబ్3' అనే ఫ్లయింగ్ హ్యూమనాయిడ్ రోబోట్ అందరినీ ఆకట్టుకుంటున్నది. దీని వీడియోలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రపంచంలో మొదటి జెట్‌పవర్డ్ ఫ్లయింగ్ హ్యూమనాయిడ్ ఇది. నాలుగు చిన్న జెట్ ఇంజన్లను దీనికి అమర్చారు. సుమారు 3 గడుగుల ఎత్తు, 22 కిలోల బరువుగల ఈ రోబోట్‌ను చిన్న పిల్లవాడిని పోలిన ముఖంతో రూపొందించడం మరింత ఆకర్షణీయంగా ఉంది. పొలిటెక్నిక్ ఆఫ్ మిలాన్‌లో విండ టన్నెల్ పరీక్షలు, స్టాన్‌ఫోర్డ్‌లో డీప్‌లెర్నింగ్ ఆధారిత నియంత్రణతో ఇది పని చేస్తుంది. అయితే, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఎఐ) దీనిని నియంత్రించదు. మానవ నియంత్రణతో కూడిన ప్రయోగాలు పూర్తయ్యాయి. జనోవా ఎయిర్‌పోర్ట్‌లో భవిష్యత్తులో పెద్ద ఎత్తున క్లిష్ట ప్రయోగాలు జరగనున్నాయి. ఏవైనా ప్రమాదాలు సంభవించినప్పుడు లేదా ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు ఉపయోగించడానికి వీలుగా 'ఐరాన్ క్యూబ్3'ను ఇటలీ శాస్త్రవేత్తలు సిద్ధం చేస్తున్నారు. ప్రమాదకరమైన ప్రాంతాలను పరిశీలించడం, అవసరమైతే అక్కడికి వెళ్లడం, అణువాయి లేదా రసాయన లీకేజీ ఉన్న ప్రదేశాల్లో సేవలు అందించడం వంటి పనులకు దీనిని ఉపయోగిస్తారు. ఇప్పటి వరకూ హ్యూమనాయిడ్ రోబోట్ నెమ్మదిగా నిడిచేవిగానే ఉన్నాయి. ఇటీవల గంతులు పెట్టగల రోబోట్‌లను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఇప్పుడు ఏకంగా ఎగిరే రోబోట్‌ను సిద్ధం చేస్తున్నారు. శరీర భాగాల కదలిక, బరువు కేంద్రం మార్పులు, వాతావరణ అల్పశక్తి వంటి అనేక సవాళ్లను అధిగమించి ఇది ప్రయోగం విజయవంతం కావడం విశేషం.

## ఏది నిజం?



హత్యానేరం ఎదుర్కొంటున్న ఇద్దరు పిల్లల తల్లి ఎరిన్ పాటర్సన్ కేసుపై ఇప్పుడు ఆస్ట్రేలియాలో జోరుగా చర్చ కొనసాగుతున్నది. ఆమె ఉద్దేశపూర్వకంగానే ముగ్గురిని చంపేసిందని కొంత మంది ఆరోపిస్తుంటే, ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఉంటుందని మరికొందరు భావిస్తున్నారు. కేసు వివరాల్లోకి వెళితే, 2023 జులై 29న ముగ్గురి మృతికి కారణమైందంటూ ఎరిన్‌పై కేసు నమోదైంది. అంతకు ముందు, తన ఇంట్లో విందుకు మాజీ భర్త సైమన్, అతని తల్లిదండ్రులు డాన్ పాటర్సన్, గెయిల్ పాటర్సన్‌లను ఆహ్వానించింది. సైమన్ ఈ ఆహ్వానాన్ని మన్నించలేదు. కాగా, అతని తల్లిదండ్రులతోపాటు, చిన్నమ్మ హీథర్ విల్కిన్సన్ కూడా విందుకు వెళ్లింది. విందులో ప్రత్యేక డిష్‌గా ఆమె మష్రూమ్స్ (పుట్టగొడుగులు) కూరను వడ్డించింది. దానిని తిన్న వెంటనే అస్వస్తతకు గురైన డాన్, గెయిల్, హీథర్, ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందారు. మాజీ భర్తను, అతని తల్లిదండ్రులను కూడా చంపాలనే ఉద్దేశంతోనే ఆమె విషపూరితమైన పుట్టగొడుగులతో వంటకాన్ని తయారుచేసిందని ప్రాసిక్యూషన్ అభియోగం. కానీ, ఎంతో ఖర్చుపెట్టి తాను విందు ఇచ్చానని, తాను ఉపయోగించిన మష్రూమ్స్‌లో విషం ఉందని ఊహించలేదని ఎరిన్ వాదిస్తున్నది. ఏది నిజమో కోర్టే తేల్చాలి.

## కర్నాటకలో 'జంపింగ్ స్పైడర్'



కర్నాటకలో అత్యంత అరుదైన 'జంపింగ్ స్పైడర్' జాతిని కనుగొన్నారు. దీనికి స్పార్టేయస్ కరిగిరిగా పేరు పెట్టారు. మన దేశంలో స్పార్టేయస్, సోనోయిటా సాలీడు జాతులు ఉంటాయి. స్టాల్టిసిడే కుటుంబానికి చెందిన స్టార్టేనే ఉపకుటుంబంలో ఒక భాగం. కాగా, గతంలో ఆగ్నేయాసియా, ఆఫ్రికా ఖండాల్లో మాత్రమే స్టార్టేయస్ జాతి కనిపించేది. అయితే, క్రమంగా ఇతర ప్రాంతాలకు విస్తరించిందని శాస్త్రవేత్తలు అంటున్నారు. వారి వాదనకు భారత్‌లో ఆ జాతి ఆనవాళ్లు ఉండడం బలాన్ని చేకూరుస్తున్నది. కర్నాటకలో గుర్తించిన 'జంపింగ్ స్పైడర్' జాతికి అది కనిపించిన కరిగిరి (ఎలిఫెంట్ హిల్) పేరుమీద 'స్పార్టేయస్ కరిగిరి' పేరు ఖరారు చేశారు. వివిధ రకాల సాలెపురుగు జాతులు అమెరికా, యూరప్, ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా అంతటా, ఉష్ణమండల ప్రాంతాలలో సమృద్ధిగా కనిపిస్తాయి. కాగా, సాల్టిసిడే అనేది ఆర్డర్ అరానియా, క్లాస్ అరాక్నిడా కింద 5,000లకుపైగా గల జాతులతో అతిపెద్ద సాలీడు కుటుంబం. ఇవి చిన్న, అస్పష్టమైన సాలెపురుగులు. సాధారణంగా వీటి పరిమాణం 0.5 అంగుళాల కంటే తక్కువే. వేటాడడానికి, వెళ్లాల్సిన దిశను నిర్ధారించుకోవడానికి వీటికి తలకు ముందు, వెనుక భాగాల్లో మొత్తం ఎనిమిది కళ్లు ఉంటాయి. ఈ జాతి స్పైడర్లకు పరిగెత్తడం, ఎక్కడం, దూకడం చేయగల సామర్థ్యం ఉంటుంది. ఇది సురక్షితమైన ల్యాండింగ్ కోసం సిల్క్ డ్రాగ్‌లైన్‌ను ఉపయోగిస్తుంది. ఇవి చీమలు, కీటకాలను వేటాడతాయి. సాధారణంగా ఇవి మాంసాహార జీవులు. కొన్ని జాతులు మాత్రం పుప్పొడి, తేనె కూడా ఆహారంగా గ్రహిస్తాయి. ఇవి కండరాల ద్వారా కాకుండా హైడ్రాలిక్ లెగ్ ప్రెజర్ ద్వారా శరీర పొడవుకు 50 రెట్లు ఎక్కువ దూకగలుతాయి. మన దేశంలో జంపింగ్ స్పైడర్స్‌లో 'యూయోఫ్రిన్ ఓమ్నిసుపర్టెస్ భూమికి సుమారు 22,000 అడుగుల ఎత్తులో, ఎవరెస్టు శిఖరంపై కనిపించింది. అంత ఎత్తయిన ప్రాంతాల్లో కనిపించిన సాలీడు జాతి అది ఒక్కటే.

— బిఎస్ఎస్ మైత్రేయి

# ట్రంప్ కలల బిల్లు నెగ్గింది

## సంపన్నులకు మోదం.. సామాన్యులకు ఖేదం

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పచ్ఛిమితవాద ఎజెండాతో కూడిన బిల్లుకు శుక్రవారం అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం లభించింది. దాని ముద్దుపేరు "బిగ్ బ్యూటిఫుల్ బిల్లు" (బిబిబి). 900 పేజీలున్నందున అది పెద్ద బిల్లు కిందే లెక్క. ఎవరికి అందమైనది? వచ్చే 10 సంవత్సరాల్లో 4.5 ట్రిలియన్ డాలర్ల పన్నుల తగ్గింపు ఈ బిల్లులో ప్రధానాంశం. ఇది ట్రంప్ సంపన్న తరగతులకు తలపెట్టిన మేలు. రెండోవైపున, 118 లక్షలమంది ఒబామా కేర్‌గా ప్రసిద్ధి పొందిన వైద్య బీమా– మెడికైడ్‌ను కోల్పోతారు. చట్టవిరుద్ధ వలసలు నిరోధించేందుకు కెనడా, మెక్సికో సరిహద్దు వెంట గోడ నిర్మాణం, అక్రమ వలసదారులను బలవంతంగా బయటకు నెట్టివేసే కార్యక్రమాలకు పుష్కలంగా నిధులు లభ్యమవుతాయి. అలాగే అమెరికన్ అన్నార్థులకు ఇచ్చే ఫుడ్ స్టాంప్స్ కోత పడతాయి. ట్రంప్ నిర్ణయించిన పన్ను రేట్లను శాశ్వతం చేయటం ఈ బిల్లులోని చిత్రం. మెడికైడ్ కోత వల్ల ఆరోగ్య బీమా ఆదాయంపై ఆధారపడిన గ్రామీణ ఆసుపత్రులు వేలసంఖ్యలో మూతపడతాయి. ప్రజలు కూడా బీమా మొత్తాన్ని పంచుకునే పద్ధతిలో మెడికైడ్ వర్తింపజేయబడుతుంది. రక్షణ వ్యయ భారీగా పెరుగుతుంది. ఈ బిల్లువల్ల బడ్జెట్‌లోటు 3.3 లక్షల కోట్ల డాలర్లు పెరుగుతుందని అంచనా. అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) సమర్థకులు అనగా ట్రంప్ భజనపరులు కేరింతలు కొడుతున్నారు.

ట్రంప్ ఒకరకంగా రిపబ్లికన్ సెనేటర్లను, ప్రతినిధులు సభ సభ్యులను బెదిరించి రెండు సభల్లోనూ అతి స్వల్ప ఆధిక్యతతో బిబిబికి ఆమోదం పొందారు. అమెరికా స్వాతంత్ర దినోత్సవ వేళ ట్రంప్ దానిపై సంతకం చేసి రాజముద్ర వేశారు.

ప్రజాపక్షం
06-07-2025, ఆదివారం

బిల్లును గతవారమే ప్రతినిధుల సభ ఆమోదించింది. అక్కడ నుండి సెనేట్‌కు వెళ్లింది. ఉపాధ్యక్షుడు వాన్స్ ఓటుతో తప్ప బిల్లుకు ఆమోదం లభించదా అనే ఊహాగానాల మధ్య 100 మంది సభ్యులు గల సెనేట్ 51–49ఓట్లతో ఆమోదముద్ర వేసింది. ట్రంప్ ఊపిరి పీల్చుకున్నారు. కాంగ్రెస్‌కు తిరిగి వచ్చిన బిల్లును 218–214ఓట్లతో సభ ఆమోదించింది. బిల్లును వ్యతిరేకిస్తే మీ సీట్లకు గ్యారంటీ లేదని ట్రంప్ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ రిపబ్లికన్ పార్టీ సభ్యులిరువురు బిల్లుకు వ్యతిరేకంగా డెమొక్రటిక్ పార్టీ సభ్యులతోపాటు ఓటు చేశారు.

ట్రంప్‌కు అధ్యక్ష ఎన్నికల్లో భారీగా డబ్బు ఖర్చుపెట్టిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ను ట్రంప్ అధ్యక్ష భవనంలో కూర్చొబెట్టి ప్రభుత్వ వృధా వ్యయాన్ని తగ్గించే ఆలోచనలు చేయటానికి ఒక డిపార్టుమెంటునే సృష్టించాడు. ఆయన ప్రభుత్వ వ్యయంలో పలు విధాల కోతలు పెట్టి ప్రపంచానికి, అమెరికన్ ఉన్నత విద్యాలయాలకు, పలు డిపార్టుమెంటులకు తీవ్రమైన చేటు చేశాడు. వేలాది ఉద్యోగాలు ఊడగొట్టాడు. అయితే ప్రభుత్వ వ్యయాన్ని భారీగా పెంచే 'బిబిబి'ని మస్క్ వ్యతిరేకించాడు. డోజ్‌కు రాజీనామా చేసి వెళ్లిపోయాడు. ట్రంప్, మస్క్ గుత్త పెట్టుబడిదారీ తెగకు చెందినవారే అయినప్పటికీ వారిద్దరి అహంభావాలు ఘర్షణ పడ్డాయి. బిబిబిని ఓడించేందుకు ఎంతదూరమైనా వెళతానని మస్క్ అనగా, మస్క్ ను దేశం నుంచి వెళ్లగొడతానని (అతను దక్షిణాఫ్రికా దేశం నుండి వలస వచ్చిన వ్యక్తి) ట్రంప్ హెచ్చరించాడు. బిల్లు పాసైంది. ట్రంప్ కల చట్టమైంది. మస్క్‌ను ఏమి చేస్తాడో చూద్దాం.

ఈ బిల్లును డెమొక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికవర్గాన్ని, బలహీనులను దోచుకుని సంపన్నుల బొక్కసాలు నింపే ఈ బిల్లు డెమొక్రాట్లను ఏకం చేసింది. "ట్రికిల్ డౌన్ క్రూరత్వం"గా అభివర్ణించారు. ట్రంప్ బిల్లును "బిగ్ అగ్లీ బిల్లు"గా పేర్కొన్న సెనేటర్ జెఫ్రీన్ బిల్లును వ్యతిరేకిస్తూ 8 గంటల 44నిమిషాలపాటు ప్రసంగించి రికార్డు నెలకొల్పారు. ప్రస్తుతం సామాన్య అమెరికన్‌లు అనుభవిస్తున్న అనేక సౌకర్యాలను తొలగిస్తున్న ట్రంప్ బిల్లు పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, 2026లో జరిగే మధ్యంతర ఎన్నికలపై దీని ప్రభావం ఉంటుందని డెమొక్రాట్‌లు అంటున్నారు. ఈ బిల్లు ఆర్వాత ట్రంప్ మరింత నిరంకుశుడిగా మారతాడా లేక వచ్చే ఎన్నికల పోరాటంలో జాతీయ స్థాయిలో డెమొక్రాట్లను ఎదుర్కొనేందుకు తనను తాను సంస్కరించుకుంటాడా? డెమొక్రాటిక్ పార్టీ, సరైన నాయకత్వంతో ఇప్పటినుంచే ఎన్నికలకు సిద్ధం కాకపోతే ట్రంప్ పట్ల ఉన్న ప్రజావ్యతిరేకను సైతం వారు ఉపయోగించుకోలేరు.

# మత వ్యవస్థ విధించే ఉద్దేశ్యపూర్వక వ్యూహం



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం ముంగిట రాజ్యాంగ పీఠికలో "సెక్యులర్", "సోషలిస్టు" పదాల చేర్పును సమర్థిస్తూ భారతీయ గణతంత్ర మౌలిక స్వభావాన్ని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఇందిరాగాంధీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎమర్జెన్సీ కాలంలో రాజ్యాంగ (42వ సవరణ) చట్టం, 1976 ద్వారా ఈ పదాలను రాజ్యాంగంలో ప్రవేశపెట్టింది. ఈ పదాలు పదే పదే మితవాద శక్తుల రాజకీయ, న్యాయపరమైన దాడులకు గురవుతున్నాయి. ఈ చేర్పులను సవాలు చేస్తూ వేసిన అనేక పిటిషన్‌లను ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరిస్తూ, ఆ పదాల చేర్పును సమర్థిస్తూ, 1949 నవంబర్ 26న ఆమోదింపబడిన అసలు ప్రవేశికలో లేనంత మాత్రాన వాటి చేర్పును చెల్లుబాటు కాకుండా చేయలేమని స్పష్టం చేసింది.

ఈ న్యాయపరమైన పునరుద్ఘాటన న్యాయవ్యవస్థ నుంచి వెలువడిన శక్తివంతమైన సంకేతం. కానీ, భారతీయ జనతా పార్టీ (బిజెపి) సైద్ధాంతిక మాతృక రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) మరోసారి భారత రాజ్యాంగంలో పొందుపరిచిన భావనపైనే తాజా దాడిని ప్రారంభించింది. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ప్రవేశిక నుంచి 'సెక్యులర్', 'సోషలిస్టు' పదాలను తొలగించాలని బహిరంగంగానే డిమాండ్ చేశారు. ఆయన ఆలోచన ప్రకారం అవి డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ దృక్కోణానికి వ్యతిరేకం.

భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ మరో అడుగు ముందుకేసి ఆ పదాల చేర్పును "సనాతన స్ఫూర్తిని అవిపత్రం" చేయడమేనని పేర్కొన్నారు. దేశంలోని కొన్ని అత్యున్నత స్థానాల నుంచి వచ్చిన ఇలాంటి ప్రకటనలు యాదృచ్ఛికమేమి కాదు. ఇది మేధోపరమైన చర్చ కాదు. ఇది భారతదేశ ఆధునిక, బహుళ, ప్రజాస్వామిక గణతంత్రానికి చట్టబద్ధతను ఉపసంహరించుకునే ఉద్దేశ్యపూర్వక రాజకీయ వ్యూహం. మతతత్వ, నిమ్నోన్నత వ్యవస్థను ప్రవేశపెట్టే చర్య.

### ప్రధాన స్రవంతికి తీసుకువచ్చే ఎజెండా

రాజ్యాంగ రూపకల్పన సందర్భంలో లౌకిక రాజ్యాన్ని రాజ్యాంగ పరిషత్తు దృఢంగా, ఏకగ్రీవంగా సమర్థించింది. ఏ ఒక్క సభ్యుడు సైతం మతరాజ్యం కోసం వాదించలేదు. భారతదేశం అనే భావన, వలసవాద విభజించు – పాలించు అనే మతతత్వ రాజకీయాలను తిరస్కరిస్తూ భిన్నత్వంలో ఏకత్వమనే పునాదులపై నిర్మితమైంది. నేడు ఆర్ఎస్ఎస్ – బిజెపి ప్రభుత్వం ఆ ఏకాభిప్రాయాన్ని ధ్వంసం చేసి, హిందూ రాజ్యం అనే భావనను రుద్దేందుకు నిర్విరామంగా పని చేస్తోంది. ఈ ఎజెండాను బహుకొద్ది మంది వాదన నుంచి రాజకీయ ప్రధాన స్రవంతిలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాముడిని రాజ్యంతో, దేవుడిని దేశంతో ముడిపెడుతూ రెచ్చగొట్టే ప్రకటన చేశారు. ఈ రకమైన మతం, రాజ్యం కలయికకు వ్యతిరేకంగా రాజ్యాంగ నిర్మాతలు కచ్చితమైన హెచ్చరికలు చేశారు. రాజ్యాంగ మౌలిక వ్యవస్థలో లౌకికవాదం భాగమని సుప్రీం కోర్టు రూలింగ్‌కు ఇది ప్రత్యక్షంగా విరుద్ధమైనది.

> భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ మరో అడుగు ముందుకేసి ఆ పదాల చేర్పును "సనాతన స్ఫూర్తిని అవిపత్రం" చేయడమేనని పేర్కొన్నారు. దేశంలోని కొన్ని అత్యున్నత స్థానాల నుంచి వచ్చిన ఇలాంటి ప్రకటనలు యాదృచ్ఛికమేమి కాదు. ఇది మేధోపరమైన చర్చ కాదు. ఇది భారతదేశ ఆధునిక, బహుళ, ప్రజాస్వామిక గణతంత్రానికి చట్టబద్ధతను ఉపసంహరించుకునే ఉద్దేశ్యపూర్వక రాజకీయ వ్యూహం. మతతత్వ, నిమ్నోన్నత వ్యవస్థను ప్రవేశపెట్టే చర్య.

### నాయకులు, వారి హెచ్చరికలు

జాతీయ నాయకుల హెచ్చరికలు నేడు మరింత శక్తిమంతంగా ప్రతిధ్వనిస్తున్నాయి. 1931లో ప్రాథమిక హక్కులపై మహాత్మాగాంధీ ప్రవేశపెట్టిన తీర్మానంలో మతపరమైన అంశాలలో రాజ్యం తటస్థంగా ఉండాలని నొక్కి చెప్పారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సైతం ఇదే వైఖరిని ప్రతిబింబిస్తూ "రాజ్యము ఏ మతాన్ని రాజ్య మతంగా గుర్తించరాదు" అని పేర్కొన్నారు. ప్రత్యేకించి గమ్మత్తయిన విషయమేమిటంటే స్వాతంత్ర్యోద్యమాన్ని బహిష్కరించిన, లౌకిక జాతీయవాదాన్ని వ్యతిరేకించిన హిందూ మహాసభ కూడా 1944లో హిందుస్థాన్ ఫ్రీ స్టేట్ చట్టంలో ఇలాంటి నిబంధనను చేర్చింది.

రాజ్యాంగ సభ చర్చల్లో భారతదేశ వ్యవస్థాపక తరం ఉద్దేశ్యాలు మరింత స్పష్టంగా ఉన్నాయి. 1947 ఆగస్టు 27న గోవింద్ వల్లభ్ పంత్ సూటి ప్రశ్నను ఇలా సంధించారు – "మీకు నిజమైన జాతీయ లౌకిక రాజ్యం కావాలా లేదా మతత్వ రాజ్యం కావాలా?" అని. భారతదేశం మతరాజ్యమైతే, అది హిందూ రాజ్యమే అవుతుందని, అప్పుడు అలాంటి రాజకీయాల నుంచి మినహాయించబడిన వారి స్థితి, భద్రతపై ప్రశ్నలు తలెత్తుతాయని ఆయన హెచ్చరించారు. 1949 నవంబర్ 21న జస్పాత్ రాయ్ కపూర్ మతం వ్యక్తిగతమైన అంశంగా ఉండాలని గాంధీ స్పష్టం చేసినట్లు చెప్పారు. 1949 నవంబర్ 22న బేగం ఐజాజ్ రసూల్ మాట్లాడుతూ సెక్యూలరిజం అనేది రాజ్యాంగంలోని "అత్యంత విశిష్ట అంశం" అని , అది "స్వచ్ఛంగా, రక్షింపబడుతుందని" ఆకాంక్ష వ్యక్తం చేశారు. 1949 అక్టోబర్ 14న సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ స్వేచ్ఛా భారత రాజ్యాంగం 'ఎలాంటి మత ఆధారిత నిబంధనతోనైనా స్వరూపం కోల్పోకుండా" చేస్తామని జాతికి మరోసారి విశ్వాసాన్ని కల్పించారు. నవంబర్ 23న టి.జె.ఎం. విల్సన్ భారత లౌకిక స్వభావంపై బెదిరింపు మేఘాలు ఇప్పటికే ఏర్పడుతున్నట్లు హెచ్చరించారు. ఈ హెచ్చరికలు భయకంపితాలు కావు, కానీ మనకాలంలో లోతుగా ఆలోచించాల్సిన, మాట్లాడాల్సిన అత్యవసరాన్ని సూచిస్తున్నాయి.

సోషలిస్టు ధోరణిలోని రాజ్యాంగాన్ని అపకీర్తి పాలు చేసి, నిర్మూలించే విధంగా ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో ప్రచారం సాగుతున్నది. రాజ్యాంగ సభలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలోని నాలుగవ భాగంలో పొందుపరిచిన దేశ విధానాలకు సంబంధించిన ఆదేశిక సూత్రాలకు సోషలిస్టు ఆదర్శాలే మూలమని స్పష్టంగా చెప్పారు.

సుప్రీంకోర్టు తాజా తీర్పు కూడా ప్రవేశికలోని "సోషలిస్టు" పదాన్ని సంక్షేమ రాజ్యం పర్యాయ పదమని సరైన రీతిలో వ్యాఖ్యానించింది. ఈ దృష్టి కోణం కుల దోపిడి, భూమి రాహిత్యం, పేదరికం, వివక్షల నిర్మూలనకు సామాజిక, ఆర్థిక రూపాంతరం జరగాలనే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బలమైన వాదనను ప్రతిధ్వనిస్తుంది. సోషలిజం అంటే సమానత్వం, న్యాయం కోసం పరిస్థితులను సృష్టించడమే తప్ప విదేశీ సిద్ధాంతాన్ని దిగుమతి చేసుకోవడం కాదు. అది స్వాతంత్ర్య పోరాట వాగ్దానాలను సాకారం చేసుకోవడం. 'ఒకవేళ హిందూ రాజ్యం వాస్తవరూపం దాల్చితే, అది ఈ దేశానికి ఘోరమైన విపత్తు అనడంలో సందేహం లేదు.. హిందూరాజ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నివారించాలి" అని బి.ఆర్.అంబేద్కర్ తన రచన "పాకిస్థాన్ లేదా భారత విభజన"లో అత్యంత సందేహాతీత హెచ్చరిక చేశారు.

ఆ పరిస్థితి ఇప్పుడు మనపై పొంచి ఉంది. ఆధునిక భారతీయ గణతంత్ర నిర్మాణం విధ్వంసం చేయాలనే దీర్ఘకాలిక పథకంలో భాగంగానే రాజ్యాంగం నుంచి "సెక్యులర్", "సోషలిస్టు" పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ డిమాండ్ చేస్తున్నది. దానిపై వ్యవస్థీకృతమైన మతాధిపత్య, నిమ్నోన్నత కుల వ్యవస్థ, మార్కెట్ చాందసం, రాజకీయ నిరకుశవాద నూతన వ్యవస్థను నిర్మించాలని భావిస్తున్నది.

### ప్రతిఘటించాల్సిన అవసరం

దీనిని ప్రజా చైతన్యం, న్యాయ సవాలు, రాజకీయ సమీకరణ, ప్రజల ప్రజాతంత్ర ఉద్యమాల ద్వారా తప్పనిసరిగా ప్రతిఘటించాలి. రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం కాదు. అది స్వాతంత్ర్య పోరాట కఠోర పరీక్ష నుండి ఉద్భవించిన రాజకీయ, సామాజిక, నైతిక ఒడంబడిక. అది భారతదేశం అందరికీ చెందుతుందనే లెక్కకు అందని అమరుల, విప్లవకారుల, రాజ్యాంగకనిబద్ధుల కలల నుంచి నిర్మితమైంది. నేడు లౌకికవాదం, సామ్యవాదాన్ని పరిరక్షించడమంటే, స్వయంగా ప్రజాస్వామ్యాన్ని దానంతట అదే రక్షించుకోవడం. ఇది విశ్వాసం, కులం, వర్గం, లింగంతో సంబంధం లేకుండా గౌరవం, సమానత్వం, స్వాతంత్ర్యంతో జీవించేందు కోసం ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షించడం కోసం. గణతంత్రాన్ని తప్పనిసరిగా రక్షించుకోవాలి. పోషించాలి. అవసరమైతే దానిని అంతర్గతంగా వినాశనం చేయాలనుకునే వారిని నుంచి కాపాడుకోవాలి. ఈ బాధ్యత నెరవేర్చేందుకు ధైర్యంతో, స్పష్టతతో, సామూహిక నిబద్ధతతో మనమంతా నిలబడదాం.

(ది హిందూ సౌజన్యంతో..)

# హైదరాబాద్ సే ఖర్గే సవాల్

హైదరాబాద్ నగరంలో శనివారం జరిగిన కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో అఖిల భారత కాంగ్రెస్ సమితి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అనేక సైద్ధాంతిక విషయాలకు, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించి ప్రస్తావించిన అంశాలు ఆలోచనలను రేకెత్తించాయి. అందులో ఆర్ఎస్ఎస్, బిజెపి నేతలను ఇబ్బంది పెట్టే కీలకమైన అంశం కూడా ఉంది. మేధావులారా నాలుగు మాటలు చెబుతానని అంటూ బిజెపి పార్టీ రాజ్యాంగం (నిబంధనావళి)లోని అంశాలను సభలో ఖర్గే వినిపిస్తూ – "భారతదేశ రాజ్యాంగం పట్ల, చట్టం ద్వారా స్థాపించబడిన విధంగా, సోషలిజం, సెక్యులరిజం, ప్రజాస్వామ్యం సిద్ధాంతాల పట్ల నిజమైన విశ్వాసం, విధేయతను పార్టీ (బిజెపి) కలిగి ఉంటుంది" అని అన్నారు. సోషలిజం, సెక్యులరిజం పదాలపై మీకు(బిజెపికి) ద్వేషమే ఉంటే, మీ పార్టీ రాజ్యాంగంలో ఆ పదాలను ఎందుకు రాసుకున్నారంటూ హైదరాబాద్ వేదికగా ఖర్గే చేసిన విమర్శ బిజెపిని ఇరకాటంలో పెట్టేదే. చేసేదొకటి, చెప్పేదొకటి అనే కాషాయ పార్టీ తీరును ఆయన ఎండగట్టిన తీరు వివేచనాపరులను ఆలోచింపజేసేలా ఉన్నది.

సెక్యులరిజం, సోషలిజం సిద్ధాంతాల పట్ల నిజమైన విశ్వాసం, విధేయత కలిగి ఉంటామని స్వయంగా బిజెపి నిబంధనావళిలో ఉండడం సభలో కూర్చున్న వారిని ఒకింత ఆశ్చర్యపరిచింది. ఇది బిజెపి నిబంధనవాళి పుస్తకంలోని రెండవ అధికరణలో పార్టీ లక్ష్యాలు అనే అంశం కింద పేర్కొనబడింది. అది పార్టీ పేరు, ఉద్దేశ్యాలు, లక్ష్యాలు, నియమాలు, సంస్థాగత నిర్మాణం, కమిటీలు వగైరా వగైరాలను వివరించే 24 పేజీల పుస్తకం. ఖర్గే ఈ అంశాన్ని ఇప్పుడు ప్రస్తావించడానికి కారణం ఉన్నది. సోషలిజం, సెక్యులరిజం పదాల చెల్లుబాటుపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఏడెనిమిది నెలల క్రితమే స్పష్టత ఇచ్చినప్పటికీ, ఆర్ఎస్ఎస్, బిజెపి నేతలు పదే పదే ఆ అంశాన్నే ఉద్దేశ్యపూర్వకంగా రేకెత్తిస్తున్నారు. వారం, పది రోజుల క్రితం ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే ఆ పదాలు తొలగించాలనడం ద్వారా చర్చను తిరిగి మొదటికి తీసుకువచ్చినట్లయింది. బిజెపి సీనియర్ నాయకులు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రెండు రోజుల క్రితం మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆ రెండు పదాలు లేవని, ఎమర్జెన్సీ సమయంలోనే 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చబడినవని చర్చను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. ఆయన గతంలో కూడా ఈ వ్యాఖ్యలు చేసిన వారే.


ఇటీవల కాలంలో ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావడం వ్యూహాత్మకమేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 25న ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బిజెపి ఆ ఘట్టాన్ని 'సంవిధాన్ హత్యా దివస్' పేరిట దేశవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించింది. దీని వెనుక ప్రధాన లక్ష్యం ఎమర్జెన్సీ విధించిన మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ నిరంకుశ పాత్రను గుర్తు చేయడమే. అంతకుమించిన ఉద్దేశం కూడా అందు లో దాగుంది. ఇటీవల పాకిస్థాన్‌పై పై చేయి సాధించిన తరువాత, ఆకస్మికంగా కాల్పుల విరమణ చేసి 'ఆపరేషన్ సిందూర్'కు విరామాన్ని ప్రకటించింది ప్రభుత్వం. ఈ చర్య కరుడుగట్టిన బిజెపివాదులనే కాకుండా, భారతీయులందరినీ తీవ్ర నిరాశకు గురి



రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

చేసింది. అదే సమయంలో 1971లో యుద్ధంలో పాకిస్థాన్‌ను ఓడించి, తూర్పు భాగాన్ని బంగ్లాదేశ్‌గా స్థాపించడంలో నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ పాత్ర సోషల్ మీడియాలో విస్తృత ప్రచారమైంది. నాటి అమెరికా బెదిరింపులకు లొంగని ఆమె ధీరత్వానికి సంబంధించిన వీడియోలు కూడా వైరలయ్యాయి. దీంతో చరిత్ర అం తంతగా తెలిసిన నేటి తరానికి అకస్మాత్తుగా ఇందిరాగాంధీ వీరోచిత గాథ పరిచయమవడంతో, ఆమె పట్ల మునుపెన్నడూ లేని సానుకూలత వ్యక్తమైంది. దీనికి కౌంటర్‌గానే అన్నట్లుగా ఈసారి ఎమర్జెన్సీ వార్షికోత్సవం సందర్భంగా నాటి ఘట్టాలకు బిజెపి భారీ ప్రచారమే కల్పించినట్లు విశ్లేషణలు వెలువడ్డాయి. ప్రత్యర్థి శిబిరం నుంచి వచ్చిన రాజకీయ దాడికి మల్లిఖార్జున ఖర్గే దీటైన ప్రతిదాడి చేసినట్లే. కాంగ్రెస్ మాజీ ప్రధానమంత్రులు నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల ప్రతిష్ట మసకబార్చే యత్నాలను గట్టిగానే తిప్పికొట్టారు. తమ నిబంధనావళిలో ఉన్న సెక్యులరిజం, సోషలిజం పదాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ ముఖ్య నేతలు, కేంద్రమంత్రుల పదే పదే ఎందుకు మాట్లాడుతున్నారనే ప్రశ్నకు జవాబిచ్చుకోవాల్సిన పరిస్థితికి బిజెపిని నెట్టివేశారు ఖర్గే.

కాంగ్రెస్ పార్టీ అధికారం కాలంలో హైదరాబాద్‌లో సుమారు 50 ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మోదీ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి, హైదరాబాద్‌కు ఏమిచ్చిందని వేసిన ప్రశ్న కూడా విలువైనదే. కాంగ్రెస్ నేతృత్వంలో పదకొండేళ్ళ క్రితం తెలంగాణను ఏర్పాటు చేయడమే కాదు, గతంలో సైతం అభివృద్ధిలో భాగంగా అనేక సంస్థలను ఇక్కడ ఏర్పాటు చేసామని కాంగ్రెస్ ఘనతను స్థిరపరిచే ప్రయత్నం చేశారాయన. కేంద్రంలో మోదీ ప్రభుత్వంపై ఎదురుదాడిలో భాగంగా ఇరుగు పొరుగు దేశాల మధ్య భారతదేశం ఒంటరైన విదేశాంగ విధానం వైఫల్యాన్ని సాకల్యంగా వివరించారు. పార్టీ అంతర్గత సమావేశాలలో కూడా క్రమశిక్షణ రేఖను దాటకూడదనే హెచ్చరికను గట్టిగానే చేసారు. మొత్తానికి పంచాయతీ ఎన్నికలకు ముందు ఖర్గే హైదరాబాద్ పర్యటన కాంగ్రెస్ దిగువ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, బిజెపిని బోనులో నిలబెట్టడంలో విజయవంతం అయినట్లేననే అభిప్రాయం కాంగ్రెస్‌లో వ్యక్తమవుతోంది.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఉగ్రవాదుల రహస్య స్థావరం ధ్వంసం

**న్యూఢిల్లీ :** పూంచ్ సురాన్‌కోట్ తహసీల్ దార్ ప్రాంతంలో పోలీసులు, సైన్యం సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్‌లో భద్రతా దళాలు పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ రహస్య స్థావరం నుంచి మూడు హ్యాండ గ్రెనేడ్‌లు, బుల్లెట్లు, ఛార్జ్ లీడ్ ఇనుప రాడ్ వైర్ కట్టర్, కత్తి, పెన్సిల్ సెల్, లైటర్ సహా ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు తెలిపాయి. ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఉగ్రవాదుల కార్యకలాపాలను నిశితంగా పరిశీలించిన అనంతరం సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఇదిలా ఉండగా.. ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య ఇటీవల ఉధంపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బంసత్‌గఢ్‌లో పారిపోయిన ఉగ్రవాదుల కోసం పోలీసులు, బలగాలు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ఈ ప్రాంతంలో దట్టమైన అటవీ ప్రాంతం, సహజంగా ఏర్పడిన గుహలు ఉండడంతో ఉగ్రవాదులు ఇక్కడే దాక్కొని ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. దాంతో ఉగ్రవాదుల ఏరివేత భద్రతా బలగాలకు సవాల్‌గా మారుతున్నది.

### అమెరికాలో నీరవ్‌మోదీ సోదరుడు
## నేహల్ మోదీ అరెస్ట్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13,000 కోట్ల మోసం కేసులో నిందితుడు



**న్యూఢిల్లీ :** పరారీలో ఉన్న వజ్రాల దొంగ వ్యాపారి నీరవ్ మోదీ సోదరుడు నేహల్ మోదీని అమెరికా అధికారులు అరెస్ట్ చేసినట్లు శనివారం అధికారులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి), కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) నుంచి వచ్చిన అప్పగింత అభ్యర్థనలను పరిగణనలోనికి తీసుకుని అమెరికా అధికారులు ఈ అరెస్ట్ చేసినట్లు చెప్పారు. శుక్రవారం నాడు నేహల్ మోదీని కస్టడీకి తీసుకుని భారత్‌కు సమాచారం అందించారని వారు చెప్పారు. ఈ కేసు విచారణకు సంబంధించి జులై 17 తదుపరి తేదీగా ఉన్న నేపథ్యంలో నేహల్ బెయిల్ కోరే అవకాశం ఉంది కానీ అమెరికా ప్రాసిక్యూటర్లు దీనిని వ్యతిరేకిస్తారని వారు వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సంయుక్తంగా నేహల్ మోదీ విషయమై అప్పగింత అభ్యర్థన చేశాయి. 2002 మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఏ) లోని సెక్షన్ 3 కింద మనీల్యాండరింగ్ అభియోగం, భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 120మ (నేరపూరిత కుట్ర), 201 (అదృశ్యం) కింద నేహల్ మోదీపై అమెరికా అధికారులచే అభియోగాలు మోపబడ్డాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ.13,000కోట్ల మోసం కేసులో 46 ఏళ్ల నేహల్ మోదీ నిందితుడని అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. ఈ మోసానికి ఇద్దరు సోదరులు, వారి మామ మెహుల్ చోక్సీ కుట్రపన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. బెల్జియంలోని అంట్వెర్ప్‌లో పుట్టి పెరిగిన నేహల్ దీపక్ మోదీ ఇంగ్లీషు, గుజరాతీ, హిందీ భాషల్లో నిష్ణాతుడు. ఆయన భారత్‌కు వాంటెడ్‌గా ఉన్నాడు. లండన్‌లోని జైలులో ఉన్న తన సోదరుడు నీరవ్ మోదీ తరపున నేరాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని అక్రమంగా బదిలీలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలున్నాయి. భారతదేశం అభ్యర్థన మేరకు యుకె నుంచి అప్పగించే ప్రక్రియలను ఎదుర్కొంటున్నాడు. భారత చట్టాలను ఉల్లంఘించి, షెల్ కంపెనీలు, విదేశీ లావాదేవీల ద్వారా పెద్దమొత్తంలో అక్రమ నిధులను దాచిపెట్టడానికి, బదిలీ చేయడానికి నేహల్ సహాయం చేశాడని అధికారులు తెలిపారు.ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లో నేహల్ పేరును చేర్చారు. తెలిసి మరీ సాక్ష్యాలను ఉద్దేశపూర్వకంగా నాశనం చేశాడని, నీరవ్ మోదీ అక్రమ కార్యకలాపాలకు సహాయపడ్డాడని నేహల్‌పై ఇడి చార్జిషీట్ దాఖలు చేసింది.పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) మోసం వెలుగులోకి వచ్చిన తర్వాత నీరవ్ సన్నిహితుడు, ఎగ్జిక్యూటివ్ మిహిర్ ఆర్.భన్సాలీతో కలిసి నేహల్ దుబాయ్ నుండి 50కిలోల బంగారం, గణనీయమైన నగదును దొంగిలించాడని, అధికారుల ముందు తన పేరును వెల్లడించొద్దని డమ్మీ డైరెక్టర్‌ను ఆదేశించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది.

## 'ఎజెఎల్ సంస్థ'ను ఎఐసిసి రక్షించేందుకే ప్రయత్నించింది



నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ న్యాయవాది ఆర్‌ఎస్. చీమా వాదన

ఆస్తులను విక్రయించే ప్రయత్నం చేయలేదని ఈడి అభియోగాలపై స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ ముఖ్య నేత రాహుల్‌గాంధీ తరపున ప్రాతినిధ్యం వహించిన సీనియర్ న్యాయమూర్తి ఆర్‌ఎస్. చీమా శనివారం తన వాదనలు వినిపిస్తూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యమైన అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్ (ఎజెఎల్) ఆస్తులను ఎఐసిసి విక్రయించే ప్రయత్నం చేయలేదని, ఆ సంస్థను కాపాడే ప్రయత్నం మాత్రమే ఎఐసిసి చేసిందని వాదించారు. ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ముందు చీమా తన వాదనను ప్రారంభిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) దాఖలు చేసిన అభియోగాలను ఆక్షేపించారు. కాంగ్రెస్ ముఖ్యనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, దివంగత కాంగ్రెస్ నేతలు మోతీలాల్ ఓరా, ఆస్కార్ ఫెర్నాండేజ్, సుమన్ దూబే, శామ్ పిట్రోడా, ఒక ప్రైవేట్ కంపెనీ, యంగ్ ఇండియన్ నేషనల్ హెరాల్డ్ న్యూస్ పేపర్‌ను పబ్లిష్ చేస్తున్న అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్‌కు చెందిన రూ.2,000 కోట్లకు పైగా ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కుట్ర , మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఈడి వారందరినీ నిందించింది. 'అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్ యొక్క మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎంఒఎ)ను ఇవ్వడానికి వారు ఎందుకు సిగ్గుపడ్డారో నా స్నేహితుడు (ఈడి తరపు న్యాయవాది) నాకు చెప్పగలరా ?' అని న్యాయవాది చీమా ప్రశ్నించారు. ఎజెఎల్ 1937లో జవహర్‌లాల్ నెహ్రూ, జెబి.కృపలానీ, రఫీ అహ్మద్ కిద్వాయి, ఇతరులచే స్థాపించబడిందని తెలియజేశారు. 'భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సి) విధానమే అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్ (ఎజెఎల్) విధానం అని ఎజెఎల్ యొక్క ఎంఒఎ చెప్పింది. స్వాతంత్ర్య కాలానికి ముందు అది ఎప్పుడూ ఒక కమర్షియల్ సంస్థగా లేదు. మేం (ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ) కూడా ఆ సంస్థను స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించాం. ఎజెఎల్‌కు ఇవ్వబడిన రుణాన్ని స్వాధీనం చేసుకోవడం అనేది సమస్యకాదు. సమస్యల్లా స్వాతంత్ర్య ఉద్యమ వారసత్వాన్ని పునరుద్ధరించడమనేదే. అది పట్టాలపైకి వచ్చేలా చూడటమే. అమ్మకాల నుంచి లాభాలు పొందడం కోసం ఎఐసిసి ఏనాడూ ఎదురు చూడలేదు. ఇది గర్భస్థ శిశువును మెల్లకన్నుతో చూడటం లాంటిది' అని చీమా చెప్పారు. యంగ్ ఇండియన్‌లో గాంధీలకు 76శాతం షేర్ ఉన్నదని, రూ.90 కోట్ల రుణానికి బదులుగా ఎజెఎల్ ఆస్తులను మోసపూరితంగా ఆక్రమించిందని ఈ కేసులో ఇడి అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. అంతకుముందు శుక్రవారం సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ సోనియాగాంధీ తరపున తన వాదనలను వినిపించారు. జులై 3న రాజు చార్జిషీట్‌లోని అభియోగాల అంశంపై వాదనలు వినిపిస్తూ గాంధీలే యంగ్ ఇండియన్ యొక్క 'ప్రయోజనకర యజమానులు'అని చెప్పారు. ఇతర షేర్‌హోల్డర్లు మరణం తర్వాత పూర్తి నియంత్రణను పొందిందన్నారు. గాంధీలు,ఇ తరులకు వ్యతిరేకంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఏ) లోని సెక్షన్లు 3 (మనీ ల్యాండరింగ్), 4 (మనీల్యాండరింగ్‌కు శిక్ష)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలుచేసిన చార్జిషీట్‌లో నమోదు చేశారు. చార్జిషీట్‌లో సుమన్ దూబే, శామ్ పిట్రోడా, సునీల్ భండారీ,యంగ్ ఇండియన్, డోటెక్స్ మెర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ పేర్లను కూడా పేర్కొన్నారు.

### 20 ఏళ్ల తరువాత ఒకే వేదికపై...
## కలిసొచ్చిన ఉద్ధవ్, రాజ్ థాక్రేలు

ప్రతిపక్షాల విజయోత్సవ ర్యాలీలో ప్రసంగాలు



**ముంబయి :** మహారాష్ట్రలో ఆశ్చర్యకరమైన దృశ్యం ఆవిష్కృతమైంది. రెండు దశాబ్దాల క్రితం విడిపోయిన ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలు తొలిసారిగా ఒకే వేదికను పంచుకున్నారు. రాష్ట్రంలో త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఇది ప్రతిపక్షాల విజయంగా భావిస్తూ శనివారం ముంబయి వేదికగా 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలతో పాటు వారి కుటుంబాలు కూడా పాల్గొన్నాయి. కాగా, విజయోత్సవ ర్యాలీలో ఉద్ధవ్ థాక్రే ప్రసంగిస్తూ తామంతా ఐక్యంగా ఉండేందుకే ఒకే వేదికను పంచుకున్నామని చెప్పారు. రానున్న పురపాలక ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నట్లు ఉద్ధవ్ సంకేతాలిచ్చారు. తాము ఐక్యంగా ఉండి మున్సిపల్ ఎన్నికలు విజయం సాధిస్తామని, అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలిచి అధికారాన్ని చేజిక్కించుకుంటామని పేర్కొన్నారు. దీంతో సభికులంతా హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. అయితే వేదికపై ఉద్ధవ్ ఒక్కరే కూర్చుని ఉండగా, రాజ్ థాక్రే మాట్లాడుతూ శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే, ఇంకా ఇతరులు బంధువులను ఒకచోట చేర్చడం చేయలేక పోయిన పనిని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చేయగలిగారని రాజ్ వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన త్రిభాషా సూత్రం మహారాష్ట్ర నుండి ముంబయిని వేరు చేసే యత్నమేనని ఎంఎన్‌ఎస్ అధ్యక్షుడు అన్నారు. ప్రతిపాదిత నిరసన ప్రదర్శన గురించి ఆలోచించడం వల్లే ప్రభుత్వం వివాదాస్పద జిఆర్‌లను ఉపసంహరించుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో మనం విజయోత్సవ ర్యాలీ నిర్వహించుకుంటున్నామని చెప్పారు. భాషా వివాదం తర్వాత రాజకీయాల్లో ప్రభుత్వ తదుపరి చర్య ప్రజలను కులం ఆధారంగా విభజించడమేనని రాజ్ అన్నారు. 'విభజించి పాలించడమే బిజెపి కుట్ర' అని ఆయన అన్నారు. తన కొడుకుపై ప్రతిపక్షాలు 'కాన్వెంట్ విద్య' అంటూ చేసిన విమర్శలను తోసిపుచ్చిన రాజ్, దక్షిణ భారతదేశంలోని చాలా మంది రాజకీయ నాయకులు, సినీ తారలు ఇంగ్లీష్ పాఠశాలల్లో చదువుకున్నారని, కానీ తమిళం, తెలుగు భాషల పట్ల గర్వంగా ఉన్నారని అన్నారు. 'బాలాసాహెబ్ థాక్రే ఇంగ్లీష్ పాఠశాలలో చదువుకున్నారు, ఒక ఇంగ్లీష్ వార్తాపత్రికలో పనిచేశారు, కానీ అతను మరాఠీ హోదా విషయంలో ఎప్పుడూ రాజీపడలేదు' అని రాజ్ థాక్రే స్పష్టం చేశారు. బిజెపి పితామహుడు ఎల్ కె అద్వానీ కూడా కాన్వెంట్ పాఠశాలలో చదివారు, కాబట్టి అతని హిందూత్వాన్ని ప్రశ్నించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం ప్రజలపై హిందీని రుద్దడానికి వారు అనుమతించరని ఉద్ధవ్ అన్నారు. మరాఠీ, మహారాష్ట్రపై ఎవరూ చెడు దృష్టి పెట్టకూడదని ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపి రూపొందించిన 'బతింగే తో కతింగే' (విభజించబడిన మనం పడిపోతాం) నినాదం హిందువులను, ముస్లింలను విభజించడానికి ఉద్దేశించబడిందని ఆయన అన్నారు. అయితే, వాస్తవానికి బిజెపి దీనిని మహారాష్ట్రీయులను విభజించడానికి ఉపయోగించిందని, బిజెపిని 'రాజకీయాల్లో వ్యాపారులు' అని ఆయన పేర్కొన్నారు. 'మరాఠీ మనుష్యులు (ప్రజలు) తమలో తాము పోట్లాడుకుంటే... ఢిల్లీ బానిసలు మమ్మల్ని పాలించడం ప్రారంభించారు' అని ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరైన కార్యక్రమంలో 'జై గుజరాత్' నినాదం చేసినందుకు షిండేను కూడా ఆయన తీవ్రంగా విమర్శిస్తూ, నిరాశావాద చర్యగా అభివర్ణించారు. ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే, ఇతర నాయకులు ఈ కార్యక్రమానికి హాజరైనప్పటికీ, రాజ్, ఉద్ధవ్ మాత్రమే వేదికపై ఆశీనులపై ప్రసంగించారు. వేదిక వెలుపల ఉత్తేజకరమైన వాతావరణంలో వేలాది మంది ఎంఎన్‌ఎస్, శివసేన (యుబిటి) కార్మికులు జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ఉమ్మడి ర్యాలీ వేదికకు ఉత్సాహంగా కవాతు చేశారు.

## బిహార్‌లో ప్రముఖ వ్యాపారి కాల్చివేత..



**పాట్నా:** ప్రముఖ బీహార్ వ్యాపారి గోపాల్ ఖేమ్కాను అతని నివాసం వద్ద గుర్తుతెలియని వ్యక్తి కాల్చిచంపడం కలకలం సృష్టించింది. బైక్ మీద వచ్చిన దుండగుడు ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసులు శనివారంనాడు తెలిపారు. శుక్రవారం రాత్రి 11.40 గంటలకు గాంధీ మైదాన్ ప్రాంతంలో ఈ హత్య జరిగినట్టు చెప్పారు. ఘటన అనంతరం స్థానిక పోలీస్, పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. బైక్‌పై వచ్చిన అగంతకుడు ఈ కాల్పులు జరిపినట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పాట్నా సెంట్రల్ ఎస్పీ దీక్ష తెలిపారు. ఘటనా స్థలిలో బుల్లెట్ స్వాధీనం చేసుకున్నామని, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని చెప్పారు. కాగా, ఆరేళ్ల క్రితం ఖేమ్కా కుమారుడిని కూడా హాజీపూర్‌లో క్రిమినల్స్ పొట్టనపెట్టుకున్నారని ఆయన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శనివారంనాడు సమీక్షించారు. డిజిపి వినయ్ కుమార్, ఇతర పోలీసు సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఖేమ్కా కాల్చివేత ఘటన కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమాల్లో శాంతి భద్రతల పరిరక్షణ అనేది చాలా కీలకమని, నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని నితీష్ హెచ్చరించారు. ఖేమ్కా హత్య ఘటనపై సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖేమ్కాపై కాల్పులు జరిపిన 2 గంటల తర్వాత పోలీసులు ఘటనా స్థలికి వచ్చారని ఆయన కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయి తే ఈ ఆరోపణలు డిజిపి విజయ్‌కుమార్ తోసిపుచ్చారు. రాత్రి 11.40 గంటలకు కాల్పులు జరిగాయని, ఖేమ్కాను కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేర్చడానికి 30–35 ని మిషాలు పట్టిందని, ఆసుపత్రి అధికారులు సమాచారం ఇవ్వగానే 12.30 గంటలకు ఘటనా స్థలికి పోలీసు సిబ్బంది చేరుకున్నారని చెప్పారు. ఖేమ్కా హత్యకు వ్యాపారపరమైన శత్రుత్వం కారణం కావచ్చన్నారు. కాగా, పాట్నాలోని పోలీస్ స్టేషన్‌కు కొద్ది దూరంలోనే ఖేమ్కాను దుండగులు కాల్చిచంపారని, బిహార్‌లో ప్రతినెలా వందలాది మంది వ్యాపారులు హత్యకు గురవుతున్నారని ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తీవ్ర విమర్శలు చేశారు. ఇంత జరుగుతున్నా దీనిని ఆటవిక రాజ్యం అని ఎవరూ అనకుండా మీడియాను తమ వైపు తిప్పుకుని ప్రభుత్వ ఇమేజ్ పెంచుకునేందుకు తహతహలాడుతున్నారంటూ నితీష్ సర్కార్‌ను తప్పుపట్టారు.

## ఒకదానికొకటి ఢీ కొన్న ఐదు బస్సులు..
### 36 మంది అమర్‌నాథ్ యాత్రికులకు గాయాలు



**న్యూఢిల్లీ :** జమ్ము కశ్మీర్ రాంబన్ జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అమర్‌నాథ్ యాత్రికులతో వెళ్తున్న ఐదు బస్సులు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అమర్‌నాథ్ యాత్రికులతో శనివారం ఉదయం జమ్ములోని భగవతి నగర్ నుంచి దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాం బేస్ క్యాంప్‌కు దాదాపు ఐదు బస్సులు బయల్దేరాయి. ఈ క్రమంలో జమ్ముశ్రీనగర్ జాతీయ రహదారి వెంబడి చందర్‌కూట్ సమీపంలోకి రాగానే బస్సులు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కనీసం 36 మంది అమర్‌నాథ్ యాత్రికులు గాయపడ్డారు. ఓ బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితి పరిశీలించారు. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం రాంబన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## యుపిలో ఘోర రోడ్డు ప్రమాదం
### 8 మంది మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



**సంభల్ :** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సంభల్ జిల్లాలో ఓ కారు అదుపుతప్పి గోడను ఢీకొట్టింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కారులో వరుడు, అతనితో పాటు మరో 9 మంది హర్ గోవిందాపూర్ గ్రామం నుంచి సిర్టౌల్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు అదనపు ఎస్‌పి అంకూర్తి శర్మ తెలిపారు. అయితే జాన్వాయి ప్రాంతంలో ఉన్న జనతా ఇంటర్ కాలేజీ వద్ద వారి వాహనం అదుపుతప్పి గోడను ఢీకొట్టిందన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారన్నారు. క్షతగాత్రులైన ఐదుగురిని జాన్వాయి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారని అదనపు ఎస్‌పి చెప్పారు. గాయాలైన ఇద్దరు అలీగఢ్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. దేవా అనే వ్యక్తి పరిస్థితి తీవ్రంగా ఉండగా, హిమాన్షికి ప్రమాదం తప్పిందన్నారు. కాగా, అతివేగం వల్లే కారు అదుపుతప్పిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ప్రమాద సమయంలో కారులో పది మంది ఉన్నారన్నారు. ఘటన పట్ల ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ తీవ్ర విచారం వ్యక్తం చేసినట్లు సిఎంఒ ఒక ప్రకటన విడుదల చేసింది. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

## ట్రంపునకు మోదీ తలవంచుతారు



భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాలపై రాహుల్‌గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ :** భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. గడువులోపు భారత్ ఒప్పందం కుదుర్చుకోదని వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటంచిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ స్పందించారు. భారతదేశం అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందాన్ని పూర్తిగా ఖరారు చేసిన తర్వాత, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా మాత్రమే అంగీకరిస్తుందని గోయల్ పేర్కొన్నారు. అయితే పియూష్ గోయల్ తన గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని, ట్రంప్ సుంకాల గడువుకు మోదీ చాలా సునాయాసంగా తలవంచుకుంటారని, తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని రాహుల్‌గాంధీ శనివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య శత్రుత్వాలను ఆపుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేసిన వాదనలను ఎదుర్కోకుండా మౌనంగా ఉండటం పట్ల కాంగ్రెస్ ప్రధానమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఉభయపక్షాలు ప్రయోజనం పొందినప్పుడు, గెలుపు ఒప్పందంలో ఉన్నప్పుడు మాత్రమే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు సాధ్యమవుతాయని, అమెరికాతో ప్రతిపాదిత తాత్కాలిక వాణిజ్య ఒప్పందం గురించి అడిగినప్పుడు గోయల్ విలేకరులతో అన్నారు. జాతీయ ప్రయోజనం ఎల్లప్పుడూ అత్యున్నతంగా ఉండాలని, దానిని దృష్టిలో ఉంచుకుని ఒప్పందం కుదుర్చుకుం టే, భారతదేశం ఎల్లప్పుడూ అభివృద్ధి చెందిన దేశాలతో వ్యవహరించడానికి సిద్ధంగా ఉం టుందన్నారు. భారతదేశంతో వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ట్రంప్ జూలై 9 వరకు గడువు విధించారు.

## దయచేసి న్యాయవ్యవస్థ ఖ్యాతిని కాపాడండి

కొందరు జడ్జీల మొరటు ప్రవర్తనపై ఫిర్యాదులు

సత్యానికి కట్టుబడాలని సిజెఐ పిలుపు

**ముంబయి :** రాజ్యాంగానికి, చట్టానికి చెప్పే భాష్యం సమాజానికి అనుగుణంగా, ఆచరణాత్మకంగా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ అన్నారు. బోంబే హైకోర్టు ముంబయిలో శనివారం నిర్వహించిన అభినందనసభలో గవాయ్ మాట్లాడారు. ఇటీవల కొంతమంది తోటి న్యాయమూర్తుల మొరటు ప్రవర్తనపై తనకు ఫిర్యాదులు అందాయని చెపుతూ, న్యాయమూర్తులు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కాపాడేవిధంగా ప్రవర్తించాలని కోరారు. ''దయచేసి ఇంత సర్వోన్నతమైన వ్యవస్థకు భంగం కలిగించేవిధంగా, అపఖ్యాతి కలిగించే విధంగా వ్యవహరించకండి, అనేక తరాల న్యాయమూర్తులు, న్యాయవాదులు అంకితభావంతో, చిత్తశుద్ధితో, సత్యానికి కట్టుబడి పని చేసి కఠోరశ్రమతో నిర్మించిన న్యాయవ్యవస్థ ఖ్యాతిని కాపాడండి'' అని విజ్ఞప్తి చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పును ఆయన ప్రస్తావిస్తూ, ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న సమస్యల పూర్వరంగంలో సందర్భానుసారంగా రాజ్యాంగానికి లేదా ఏ చట్టానికైనా భాష్యం చెప్పాలని న్యాయమూర్తులకు హితబోధ చేశారు. 'న్యాయమూర్తులు చెప్పే భాష్యం సమాజానికి తగినట్టుగా ఉండాలి, ప్రసుత సమాజానికి అనుగుణంగా ఆచరణాత్మకంగా ఉండాలి'' అన్నారు. న్యాయమూర్తులు తమ వివేకజ్ఞానాలకు, తమ వృత్తిపై చేసిన ప్రమాణాలకు చట్టానికి అనుగుణంగా పనిచేయాలని అంచనావేస్తారు తప్ప ఒక విషయాన్ని చూసి చలించిపోయి ఎప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదు'' అని చెప్పారు. ఒన న్యాయమూర్తి సంబంధిత అంశం నుండి తన ఆలోచనలను వేరు చేయాలి. తర్వాత జరిగే పరిణామాలను విస్మరించాలి, చట్టానికి, విచక్షణకు అనుగుణంగా ప్రస్తుత సమాజానికి అనుగుణంగా ప్రవర్తించాలి'' అని చెప్పారు. కొందరు తోటి న్యాయమూర్తుల మొరటు ప్రవర్తనపై ఫిర్యాదువు ఇటీవల వచ్చాయని చెప్పారు. ఒక న్యాయమూర్తిగా ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటలవరకూ పనిచేయడం సమాజానికి సేవ చేయడానికి ఒక మంచి అవకాశం, దేశానికి సేవ చేయడానికి ఒక అవకాశం అన్నారు. న్యాయమూర్తిగా ప్రమాణం చేసినప్పటి ప్రమాణాలకు, సత్యానికి కట్టుబడి చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. న్యాయమూర్తుల నియామకాల గురించి ఆయన ప్రస్తావిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయవ్యవస్థ తన స్వతంత్రతతో రాజీపడబోదని ప్రధాన న్యాయమూర్తి గవాయ్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులోగానీ, హైకోర్టులలోగానీ నియామకాలు చేసేటప్పుడు కొలీజియం న్యాయమూర్తులుగా నియమితులు కావడానికి కావాల్సిన యోగ్యతలను, గుణగణాలను పరిగణనలోకి తీసుకుంటుందని అందుకు పూర్తి భరోసాను పాటిస్తుందని, దేశ భిన్నత్వాన్ని, సమ్మిళిత తత్వాన్ని దృష్టిలో పెట్టుకుంటుందన్నారు. ఒక న్యాయవాదిగా, మొదటిసారి న్యాయమూర్తిగా తాను ఒకప్పుడు పనిచేసిన బోంబే హైకోర్టుపై ప్రశంసలు కురిపించారు. ప్రజలు బోంబే హైకోర్టు ఇచ్చే తీర్పులపై ప్రశంసలు కురిపించినప్పుడు తనకు ఎంతో గర్వంగా ఉంటుందన్నారు.

## 12 దేశాలకు రేపు ట్రంప్ టారిఫ్ లేఖలు

**వాషింగ్టన్ :** అమెరికా విధించిన టారిఫ్‌ల వాయిదా గడువు ముగింపు దశకు రావడంతో దాదాపు 12 దేశాలకు టారిఫ్ లేఖలు పంపేందుకు వైట్‌హౌస్ యంత్రాం గం సన్నాహాలు పూర్తిచేసింది. లేఖలపై సంతకం చేశాననీ, సోమవారంనాడు ఈ లేఖలను పంపుతామని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో పాత్రికేయులతో మాట్లాడుతూ చెప్పారు. ఐతే ఏ దేశాలకు ఈ లేఖలు పంపుతారన్న విషయం సోమవారంనాడే ప్రకటిస్తారు. అమెరికాతో వాణిజ్య వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై గడచిన ఏప్రిల్ నెలలో సార్వత్రికంగా పెంచిన 10 శాతం టారిఫ్‌లను సంప్రదింపు చర్యలకు వీలుగా జులై 10వ తేదీ వరకూ వాయిదా వేశారు. ఈ గడువు దగ్గర పడటంతో టారిఫ్ లేఖలను ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం చేస్తున్నది. తైవాన్ నుండి యూరప్ వరకూ ఉన్న పలు దేశాలపై పది నుండి 70 శాతం మేరకు ట్రంప్ వాణిజ్య సుంకాలను అదనంగా విధించారు. దీంతో ఇప్పటికే పాకిస్థాన్ వాణిజ్య కార్యదర్శి జవద్ పాల్ నాయకత్వాన ఒక ప్రతినిధి బృందం వాషింగ్టన్ చేరుకుంది. గార్మెంట్స్, వ్యవసాయ ఉత్పత్తులపై ప్రధానంగా 29 శాతం టారిఫ్‌లను తిరిగి విధించకుండా నివారించేందుకు ఈ బృందం చర్చలు ప్రారంభించింది. భారతదేశం కూడా ఈ నిర్ణీత గడువులోపు ఆదరాబాదరాగా వాణిజ్య ఒప్పందం చేసుకునేందుకు చర్చలు ముమ్మరంగా కొనసాగుతుండగా, రైతులకు తీవ్రనష్టం జరగే ప్రమాదం ఉన్నందువల్ల ఒప్పందం చేసుకోకూడదని దేశంలో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

టారిఫ్‌ల అమలుకు పొడిగించిన గడువుతేదీ ముగిసే జులై తొమ్మిదోతేదీన భారత్‌లో సార్వత్రిక సమ్మెకు ప్రతిపక్షాలు కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చాయి. కాగా ట్రంప్ టారిఫ్‌లు పెంచినవెంటనే గడచిన ఏప్రిల్ నెలలో భారత్ సహా దాదాపు 50 దేశాలు టారిఫ్‌లపై సమీక్షకు అమెరికాను ఆశ్రయించాయని అమెరికా జాతీయ ఆర్థిక మండలి డైరెక్టర్ కెవిన్ హాస్సెట్ చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవని సమర్థించుకున్నారు.


**CHANGE OF NAME**

I, **GANDRATHI SRINIVAS,** S/o Yadagiri, H.No: 1-8-440/1, Balasamudram, LIC office, Hanamkonda town, Dist : Hanamakonda,TG. I have changed my Son name from **GANDRATHI ROMIK** (old name) to **GANDRATHI AADHVIK** (New name) for all purpose

**డాక్యుమెంట్స్ పోయినవి**

హనుమకొండ జిల్లా వేలేరు మండలములోని పీచర గ్రామ శివారులోని వేములపల్లికి చెందిన **గాలి శ్రీకాంత్, గాలి కుమార్**ల తండ్రి గాలి ఐలయ్య గారికి సంబంధించిన పట్టాపాస్ బుక్కు గత మే నెలలో శ్రీకాంత్, కుమార్‌లు పీచర నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఖాతా నెంబర్ : 552. పట్టా పాసు బుక్కు నెం: **T21100030359**కు సంబందించిన డాక్యుమెంట్స్ పోయినవి. సంబంధిత డాక్యుమెంట్స్ దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు
**గాలి శ్రీకాంత్, గాలి కుమార్,**
తండ్రి ఐలయ్య,
ఇ.నెం. 7142, గ్రామం పీచర, వేములపల్లి,
వేలేరు మండలం, హనుమకొండ జిల్లా,
పిన్: 506145,
ఫోన్ నెం. **8790557229, 9959919653.**

## నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంతో పాటు సర్వేలు గురుకుల పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యతమైన భోజనాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. సర్వేలు గురుకుల పాఠశాలలో శానిటేషన్ మౌలిక వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, ఎంపీఓ నరసింహారావు ఉన్నారు.



## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్ : విద్యార్థులకి మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శనివారం సూర్యాపేట మండలం బాలెంలలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని, బియ్యం నాణ్యతను పరిశీలించారు. అలాగే స్టాక్ వివరాలు, కూరగాయలు, వంట సామాగ్రిని పరిశీలించారు.





## జూరాలకు కొనసాగుతున్న వరద

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి : కర్ణాటక జలశయాల నుంచి జూరాల ప్రాజెక్టు జలశయంలోకి శనివారం సాయంత్రం 1,20,000 క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో డ్యాం అధికారులు 14 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. స్పిల్ వే ద్వారా 92,890 క్యూసెక్కులు బయటకు వెళ్తుండగా, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,571 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొత్తంగా 1,24,710 క్యూసెక్కుల వరద నీరు ప్రవ హిస్తోంది. కాగా, జురాల డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 318.518 మీటర్లు ఉండగా ప్రస్తుతం నీటిమట్టం 317.390 మీటర్ల వద్ద ఉన్నది. మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 7.444 టీఎంసీలు నీటి నిల్వ ఉంది.

## విపత్తుల నిర్వహణకు సంసిద్ధం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: విపత్తుల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అధికారులకు తెలిపారు.శనివారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ అధికారుల బృందం జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాష్, అండర్ సెక్రెటరీ అభిషేక్ బీస్వాల్ , వసీం ఇక్బాల్‌ల బృందం రాష్ట్ర విపత్తుల నిర్వహణ అధికారి గౌతమ్ ఆధ్వర్యంలో ఒక రోజు నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ ను జిల్లా కలెక్టర్ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయస్థాయిలో విపత్తుల నిర్వహణ అథారిటీ ఉన్నట్లుగానే జిల్లా స్థాయిలో జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేశామని,ఇందులో అన్ని శాఖల అధికారులను భాగస్వామ్యం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పవర్ మాట్లాడుతూ పోలీస్ తరపున జిల్లాలో 12 వ పోలీస్ బెటాలియన్ ఉందని ,ఒక కంపెనీ దళాలు (సుమారు 80 నుండి 100 మంది) కి విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ జాయింట్ అడ్వైజర్ నావెల్ ప్రకాష్ మాట్లాడుతూ జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ కింద 2021 లో ఆపదమిత్ర వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని జిల్లాలలో ఆపదమిత్రలను ఏర్పాటు చేస్తున్నామని, అంతేకాక విపత్తుల సమయంలో అవసరమైన రిసోర్సెస్ ఏర్పాటు చేస్తున్నామని, ఆపద మిత్రుల శిక్షణ, విపత్తుల్లో వారు తీసుకోబోయే చర్యలపై అవసరమైన సహాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## కోర్టులను తనిఖీ చేసిన జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నాగరాజు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: జిల్లా ప్రిన్సిపల్ జడ్జి నాగరాజు శనివారం పట్టణంలోని కోర్టులను తనిఖీ చేశారు. తొలిసారి మిర్యాలగూడకు వచ్చిన ఆయనకు ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌తేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎ.భూపతిరెడ్డి, కోశాధికారి సాయికుమార్‌లు మొక్క అందించి స్వాగతం పలికారు. సముదాయంలోని కోర్టులను, రికార్డులను, న్యాయమూర్తుల నివాస గృహాలను పరిశీలించారు. కోర్టులో పెండింగ్ కేసులను పరిష్కరించాలన్నారు. కోర్టులో పెండెన్సీ తగ్గించాలన్నారు. బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో జరిగిన సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ మాట్లాడుతూ కోర్టు ఆవరణలో మహిళాశక్తి క్యాంటీన్, జీరాక్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరణం లింగయ్య, శ్రీనివాస్, బాలు, నాయుడు, ఎల్లయ్య, ప్రసాద్, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

## సాగర్ సందర్శించిన విపత్తు నిర్వహణ పర్యవేక్షణ బృందం

ప్రజాపక్షం/నందికొండ: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను కేంద్ర విపత్తు నిర్వహణ పర్యవేక్షణ బృందం సభ్యులు సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా నాగార్జునసాగర్ ప్రధాన డ్యాము ను సందర్శించి పరిశీలించారు అనంతరం బుద్ధ వనమును చేరుకొన్న ఈ బృందం బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి ఆపైన బుద్ధ చరితవనం, జాతక వనం, ధ్యానవనం,స్థూప వనాలను సందర్శించి మహాస్తుపంలోని ధ్యాన మందిరంలో కొద్దిసేపు గడిపారు. ధ్యాన మందిరంలోని బుద్ధ భగవానుని వద్ద బుద్ధ వనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన ఈ బృందంచే బుద్ధ జ్యోతిని వెలిగించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలను, బుద్ధవనం విశేషాలను వివరించారు ఈ బృందంలో నావెల్ ప్రకాష్ అభిషేక్ విశ్వాన్ బి పి యాదవ్, సలీం ఉన్నారు.



# కార్మిక వర్గానికి అన్యాయం

## పెట్టుబడీదారులకు కొమ్ముకాస్తూ

### 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

### పల్లా దేవేందర్ రెడ్డి

ప్రజాపక్షం/ నల్లగొండ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపైన రైతుల పైన దాడి తీవ్రతరం చేసిందని , కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకువచ్చి పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక వర్గాన్ని తీవ్రమైన అన్యాయానికి గురి చేస్తున్నారని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పజెబుతున్నారని ఆరోపించారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశానికి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యక్షత వహించగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కేవస్ రెడ్డి ఎండి సయీద్, పి వెంకట్ రావు, దోటి వెంకన్న జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, బరిగల వెంకటేష్ జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు ,వి లెనిన్‌పాల్గొన్నారు.

### కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు




ప్రజాపక్షం/కోదాడ: ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని కార్పెంటర్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వతంత్రం వచ్చిన కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని, భారతదేశంలో 50 కోట్లమందికి పైగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు నాడు సాధించుకున్న హక్కులను కాలరాస్తూ నాలుగు కోడ్‌లుగా విభజిస్తున్న చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అసంఘటితనంగా కార్మికులకు సమగ్ర కార్మిక విధానాలను రూపొందించాలని, కార్మికులకు భద్రత సౌకర్యం కల్పించాలని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ఇన్సూరెన్స్ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రక్రియ ఆలోచనను విరమించుకోవాలని, 12 గంటల పని విధానాన్ని రద్దు చేసుకుని గతంలో 8గంటల పని విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు విద్యాచారి, యూనియన్ అధ్యక్షులు రేవుల సత్యం, గౌరవ అధ్యక్షులు శ్రీధర్, సమన్వయ చైర్మన్ అంజి, వీరచారి, సత్యనారాయణ, వెంకటచారి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/నేరేడుచర్ల(గరిడేపల్లి): కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి సార్వత్రిక సమ్మెను గరిడేపల్లి మండలంలో విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు షేక్ యాకుబ్ లు కార్మికులకు, రైతులకు అన్ని వర్గాల ప్రజలను కోరారు. శనివారం గరిడేపల్లి మండలం కేంద్రంలోని ఎంఎస్ భవన్‌లో మండల టిడిపి అధ్యక్షులు కీసర నాగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఎం నాయకులు దోసపాటి బిక్షం, బేల్లేపల్లి శ్రీనివాస్, మండల ఏఐటియుసి నాయకులు బెజ్జం రమేష్, నాయకులు పంగ సైదులు, వెంకటరెడ్డి,ప్రతాని సైదులు పాల్గొన్నారు.







## బాలసదనం పనుల్లో వేగం పెంచండి

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని పానగల్ రహదారిలో కోటి 34 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బాలసదనం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు.శనివారం ఆమె బాలసదనం నిర్మాణ పనులను పరిశీలించారు. బాలసదనం ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని అన్నారు.బాల సదనం పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాగా ఈ బాలసదనంలో అదనపు బ్లాకులనిర్మాణానికి గాను 60 లక్షల రూపాయల అదనపు బడ్జెట్ కావాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి జిల్లా కలెక్టర్ ను కోరగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆమె ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముజాబ్ అహ్మద్ జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధం

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: చేపల ప్రత్యుత్పత్తి కారణంగా నాగార్జునసాగర్ రిజర్వాయర్, దిగువ ప్రాంతం, వాడపల్లి వరకు ఈనెల 1 నుండి ఆగస్టు 31 వరకు చేపల వేటను నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖ సహాయ సంచాలకులు చరిత తెలిపారు.అందువల్ల మత్స్యకారులు ఈ నెల 1 నుండి ఆగస్టు 31 వరకు పైన పేర్కొన్న నిర్దేశిత ప్రాంతంలో చేపల వేట చేయరాదని, ఒకవేళ ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి చే పల వేట కొనసాగించినట్లయితే చట్టపరమైన చ ర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# ఇద్దరు గంజాయి నిందితులు అరెస్టు

### రూ.2.8 లక్షల విలువైన 11కేజీల గంజాయి సీజ్

### జిల్లా ఎస్పి కె.నర్సింహ్మా వెల్లడి

ప్రజాపక్షం/సూర్యాపేట: నిషేధిత గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సూర్యాపేట జిల్లా సిసిఎస్ పోలీసులు, కోదాడ రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి రూ.2.8 లక్షల విలువైన 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె.నర్సింహా దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కోదాడ మండలంలోని దొరకుంట గ్రామశివారులో ఉన్న ఇండ్రస్టియల్ ఏరియాలో ఐషర్ ట్రాక్టర్ వెనుకాల ఉన్న ఖాళీ స్థలంలోని పొదల్లో నమ్మదగిన సమాచారం ప్రకారం సూర్యాపేట జిల్లా సిసిఎస్, కోదాడ రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఇద్దరు నిందితులను పట్టుకుని, 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. అనంతరం వారిని విచారించగా కోదాడ మండలం దొరకుంట గ్రామానికి చెందిన అడప రాజేష్, కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురకు చెందిన వనపర్తి సాయి, అలియాస్ సాయికుమార్ లుగా గుర్తించారు. అడప రాజేష్ ఇంటర్ చదివే సమయంలోనే తన స్నేహితుల గంజాయి సేవించే అలవాటు ఉందని, అనంతరం ఆర్థిక పరిస్థితులు బాగోలేక చదువు మానేసి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2023లో కోదాడ రూరల్‌పోలీస్ స్టేషన్‌లో పోలీసులు అతని గంజాయితో పట్టుకుని కేసు నమోదు చేసి జైలుకు పంపారు. జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత కొద్ది రోజులు గంజాయి సేవించడం మానేశాడు. గత పదిరోజుల క్రితం కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసులో హాజరుకావడానికి అక్కడకి ఓరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి అతనికి పరిచయమయ్యాడు. రాజేష్



తనకు గంజాయి తాగడానికి, అమ్మడానికి కావాలని అడగ్గ గత నెల 29వతేదీన ఓరిస్సా రాష్ట్రంలోని కళిమేళలో శివమందిర్ గుడివద్దకు రమ్మని చెప్పగా అక్కడకు వెళ్లి 11 కేజీల గంజాయిని 11వేల రూపాయలకు కొనుగోలు చేసి అక్కడనుండి పట్టుబడకుండా తన స్వగ్రామం దొరకుంటకు తీసుకవచ్చారు. తన ఇంట్లో పెడితే పోలీసులు పట్టుకుంటారని గ్రామ శివారులోని ఇండ్రస్టియల్‌లోకి వెళ్లే దారిలో ఐషర్ ట్రాక్టర్ షోరూం వెనుక ఖాళీస్థలంలోని చెట్ల పొదల్లో దానిని దాచిపెట్టాడు. మరో నిందితుడు వనపర్తి సాయికుమార్ కూడా ఇతనికి జంటగా కలిశాడు. దీనికి ప్యాకెట్లుగా చేసి అమ్మేదుకు సిద్ధం చేయడంతో నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా చేధించిన కోదాడ రూరల్ సిఐ రజితారెడ్డి, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్ రెడ్డి, సిసిఎస్ ఎస్‌ఐ హరికృష్ణ తో పాటు సిబ్బందిని ఎస్పి అభినందించారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

## ప్రభుత్వం నాణ్యమైన విద్యపై దృష్టి

### జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉత్తమమైన భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం మౌలిక వసతులు నాణ్యమైన విద్య వాతావరణంపై దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. శనివారం గద్వాల్ మండలంలోని దౌదర్‌పల్లి, పరుమాల సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి బాలికల పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో ఎంతమంది విద్యార్థినిలు ఉన్నా రు? వారికి సరిపడా బెడ్స్ (మంచాలు), మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయా?లేదా? అని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు. ఫలితాలు ఎలా వస్తున్నాయి అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు నిద్రించే గదుల్లోకి వెళ్లి బెడ్స్, ఆహార పదార్థాలు వంట గదులు, మరుగుదొడ్లు, పాఠ్యపుస్తకాలు తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని, అట్టి విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ప్రిన్సిపాల్‌కి సూచించారు. పాఠశాలలో నాణ్యమైన క్రీడా సామాగ్రి, అవసరమైన సౌకర్యాలు, అన్ని క్రీడలకు అనుకూలమైన మైదాన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. హాస్టల్లో డైట్ ప్లాన్ అమలును పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అలివేలు, అనిల, పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే ప్రభుత్వం భర్తీ చేయాలి

### విశ్రాంత ఐఎఎస్ చిరంజీవులు

ప్రజాపక్షం/సూర్యాపేట: నిరుద్యోగులు సంఘటితమై శాంతియుతమైన పోరాటం ద్వారానే నిరుద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని బిసి ఇంటలెక్స్‌వల్ ఫోరం వ్యవస్థాపకులు, విశ్రాంత ఐఎఎస్ చిరంజీవులు, తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపకులు, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ పృధ్వీరాజ్ యాదవ్, అశోక్ అకాడమి కోచింగ్ సెంటర్ నిర్వాహకులు పాలకూరి అశోక్ లు అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల సాధనకై అనుములపూరి జనార్ధన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిననిరుద్యోగ విద్యార్థి మహాసభకు వారు ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. నిరుద్యోగులు సంఘటితం కావాలని, తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు నిరుద్యోగ సమస్య తాండవిస్తుందని,రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపే అన్ని ఖాళీలను భర్తీ చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. భవిష్యత్‌లో బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వాలు వచ్చినప్పుడే న్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని, మండల్ కమిషన్ ఓబిసిలకు 27శాతం రిజర్వేషన్లు కాకుండా కేవలం 22 శాతం రిజర్వేషన్ అమలు చేస్తుందని దుయ్యబట్టారు. సేవాలాల్ సేన వ్యవస్థాపకులు సంజీవ్‌నాయక్, ఓయు జెఏసి నాయకులు వేణుకుమార్, చామకూరి రాజు, జివిగౌడ్, ఇంద్రనాయక్, అర్జున్, దామోదర్‌రెడ్డి, నర్సింహనాయక్, ఎల్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.



# జానకినగర్ తండాలో ఉద్రిక్తత

### తమ భూముల్లో నుండి రోడ్డును పోనివ్వమని తండావాసుల ఆగ్రహం

### పెట్రోల్ పోసుకుని తహసీల్దార్ కారును అడ్డగించిన తండావాసి

ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు): చిలుకూరు మండలంలోని జానకినగర్ తండా గ్రామంలో గత కొన్ని రోజులుగా వివాదస్పదంగా మారిన డొంకదారి భూమి సర్వే శనివారం రెండోసారి కూడా నిలిచిపోయింది. డొంక దారిని సర్వే చేసేందుకు సర్వే అధికారులు ముందస్తుగా రైతులకు నోటీసులు జారీ చేశారు. ఇరువర్గాలకు చెందిన రైతులు సర్వేకు వచ్చారు. కలెక్టర్ అదేశాల మేరకు ఉదయం 11 గంటలకు పోలీస్ బందోబస్తుతో డొంక భూమిని సర్వే చేసేందుకు రెవిన్యూ, సర్వే అధికారులు స్థలం వద్దకు వచ్చారు. సర్వేకు వచ్చిన అధికారులు ఇరు వర్గాల రైతులతో మాట్లాడారు. ఒక వర్గం వారు ఇచ్చిన దరఖాస్తు మేరకు డొంకదారి ఒక్కటే సర్వేచేస్తామంటే ఒప్పుకొమని, గ్రామంలో అక్రమణలు ఇంకా ఉన్నాయని వాటికి కూడా దరఖాస్తులు ఇచ్చామని, మొత్తం ఒకేసారి సర్వే చేయాలని సర్వే అధికారులతో వాగ్వివాదంకు దిగారు. ఇరువర్గాల రైతులతో అధికారులు చాలా సేపు చర్చలు జరిపారు. ఆ తర్వాత ఇరువర్గాల మధ్య సమన్వయం లేకపోవడంతో సర్వేను అధికారులు నిలిపివేశారు. సర్వే చేసేందుకు ఇరు వర్గాల వారు సహకరిస్తేనే చేస్తామని లేకపోతే సాధ్యం కాదని సర్వే అధికారులు ఘటన స్థలం నుండి వెళ్లిపోయారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకుని గిరిజనవాసి ఆందోళన

సర్వే అధికారులు వెళ్లిపోతుండటంతో ఘటన స్థలం నుండి రెవిన్యూ అధికారులు వెళ్లిపోయేందుకు సిద్ధం కాగా సర్వే చేయకుండా ఇక్కడ నుండి వెళ్లిపోవడానికి వీలు లేదంటూ ఒక వర్గంకు చెందిన బట్టు అమృనాయక్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని తమ వర్గం వారితో తహసిల్దార్ కారు ముందు కూర్చోని నిరసన తెలిపారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. జిల్లా అధికారులతో మాట్లాడి మరోమారు పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని రెవిన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో సమస్య తాత్కలికంగా సద్దుమణిగింది. సర్వే వివాదస్పదంగా ఉండటంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు చిలుకూరు ఎ స్‌ఐ రాంబాబుగౌడ్ భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దృవకుమార్, డిఐవోలు వంశీధర్, మంచ్యానాయక్, మండల సర్వేయర్ నాగార్జునరెడ్డి, ఆర్‌ఐ లు శ్వేత, మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, సర్వే అధికారులు, రైతులు పాల్గొన్నారు.





## సీతారామ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం

**ప్రజాపక్షం/కల్లూరు:** సీతారామ ప్రాజెక్టుతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలంగా మారబోతుందని గృహ నిర్మాణ శాఖ చైర్మన్ మువ్వా విజయబాబు తెలిపారు. నిలిచిపోయిన సీతారామ ప్రాజెక్టు ను పాత బిల్లులను చెల్లించి నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్నామని అన్నారు. కల్లూరు మండలం లింగాల గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వచ్చే సీజన్ కల్లా సీతారామ ప్రాజెక్టు పూర్తవుతుందని, ప్రతి ఎకరాకు నీరు అందించి రైతుల కలలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని వివరించారు. అదేవిధంగా పెండింగ్లో ఉన్న నీటిపారుదల శాఖ ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం లింగాలలోని కాలు ఆపరేషన్ అయిన మంగపతిని అదేవిధంగా చెన్నూరులో చంటి కుటుంబంలో అనారోగ్యంతో ఉన్న వారిని రావికంపాడు లో ఉన్న ఉపేంద్ర కుటుంబాన్ని పరామర్శించి పలకరించారు. ఆయన వెంట జనార్దన్, చంటి, ఉపేంద్ర, బొజ్జ లోకేష్, కట్ల గోపాలరావు, మాజీ సర్పంచ్ పసుమర్తి మోహన్ రావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



**ప్రజాపక్షం/ మధిర:** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మధిర శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క ఆదివారం మధిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా మధిర మండలం వంగవీడు గ్రామంలో సుమారు రూ.600 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా మధిర, బోనకల్ మండలాల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేయనున్నారు. అలాగే ముదిగొండ మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, చింతకాని మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులు పిలుపునిచ్చారు.




## వ్యవసాయ కార్మికుల పట్ల పాలకుల వివక్ష

-పేదలకు భరోసా ఇవ్వాలి

-వ్య.కా.స జిల్లా కార్యదర్శి కర్ణకుమార్

**ప్రజాపక్షం/ఖమ్మం :** వ్యవసాయ కూలీల పట్ల పాలకులు వివక్ష ప్రదర్శిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధినేని కర్ణకుమార్ ఆరోపించారు. కలిసి రాని కాలం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మంజిల్లా కమిటీ సమావేశం శనివారం గిరిప్రసాద్ భవన్లో జరిగింది. జిల్లా అధ్యక్షులు తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కర్ణకుమార్ మాట్లాడుతూ కేంద్రం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుందని అందుకే వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేస్తుందన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించే వారి కోసం రూపొందించిన జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పోడుస్తుందని కర్ణకుమార్ ఆరోపించారు.ఈ పథకాన్ని కొనసాగిస్తూ నిధుల కేటాయింపు పెంచి రోజు రూ. 800 కూలీ గిట్టుబాటు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కర్ణకుమార్ కోరారు. ఆరు హామీల అమలు చేయడంతో పాటు రైతు భరోసా రీతిలో ఇందిరమ్మ భరోసా క్రింద ప్రతి కుటుంబానికి రూ. 12వేలు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఈ సమావేశంలో పగిడిపల్లి ఏసు, పిట్టల రాంబాబు, మేళ్లచెరువు వీరబాబు, బత్తిని సీతారాములు, బానోత్ చీనా, గోగుల ఆది, అయోధ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**వ్య.కా.స అధ్యక్ష, కార్యదర్శిగా తాటి, సిద్ధినేని**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా తాటి వెంకటేశ్వరరావు, సిద్ధినేని కర్ణకుమార్లు ఎన్నికయ్యారు. జిల్లా మహాసభలో వీరిద్దరితో పాటు 19 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. తాటి వెంకటేశ్వరరావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యునిగా పనిచేస్తూ గతంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా పని చేశారు. సిద్ధినేని కర్ణకుమార్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర అధ్యక్షునిగా పని చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతామన్నారు.


## సిపిఐ సీనియర్ నేత సంగిపు నర్సింహారావు మృతి

నివాళులర్పించిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లికి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త సంగిపు నర్సింహారావు(70) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న స్థానిక సిపిఐ నేతలు నర్సింహారావు పార్థివ దేహాన్ని సందర్శించి పార్టీ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు మాట్లాడుతూ నర్సింహారావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. సిపిఐ నిర్వహించిన అనేక ప్రజా పోరాట ఉద్యమాల్లో నర్సింహారావు ఉద్యమానికి ముందు నడిచే వారన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తని కోల్పోవడం బాధాకరమని, నర్సింహారావు కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పంగా శేషగిరిరావు, జల్లా బ్రహ్మం, రంగు నాగకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, సిలువేరు శ్రీనివాసరావు, నర్సింహారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు మున్సిపల్ కార్మికుల మద్దతు




**ప్రజాపక్షం/ఖమ్మం :** మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై తొమ్మిదిన జరిగే సార్వత్రిక సమ్మెకు మున్సిపల్ కార్మిక సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల జేఏసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పదేళ్లుగా పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల కోసమే మోడీ ప్రభుత్వం పని చేస్తుందన వారు ఆరోపించారు. ఎనిమిది గంటల స్థానే 12 గంటల పని విధానాన్ని తెచ్చేందుకు మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు గాదె లక్ష్మినారాయణ, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మందా వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు కళ్యాణం వెంకటేశ్వర్లు, తుమ్మ విష్ణువర్ధన్, టియుసిఐ నాయకులు జి.రామయ్య, బిఆర్టియు నాయకులు ఎండివై పాషా, ఐఎన్టియుసి నాయకులు ఎం. జయరాజు తదితరులు ప్రసంగించగా కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగమణి, జనక శ్రీను, నర్సింహారావు, సుజాత, హేమలత, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

## బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఖమ్మం :** పరీక్షల్లో ఫెయిల్ అవడంతో ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన ముదిగొండ మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... వల్లాపురం గ్రామానికి చెందిన యశ్వంత్ (19) బిటెక్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. పరీక్షల అనంతరం కిష్టాపురంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని తెలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అడ్మిషన్లు తెలంగాణలో చదువులు ఆంధ్రాలో

ప్రభుత్వాన్ని బురిడీ కొట్టిస్తున్న ఇంటర్ కాలేజీలు

- తోటి విద్యార్థులకు ద్రోహం
- పర్యవేక్షణ కరువు



**ప్రజాపక్షం/భద్రాచలం :** కొన్ని ప్రైవేటు ఇంటర్మీడియట్ కాలేజీలు కాసుల కక్కుర్తితో వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నాయి. అడ్మీషన్లు ఇక్కడ చేర్చుకుని ఆంధ్రా కాలేజీలతో కుమ్మక్కై అక్కడ చదువులు చెప్పిస్తున్నారు. కొసమెరుపు ఏంటంటే ఇందు కోసం కూడా అదనపు ఫీజు గుంజుతుంటారు. దీంతో కొందరు విద్యార్థులకు స్వరాష్ట్రంలోనే తీరని అన్యాయం జరుగుతోంది. ఆంధ్రా కాలేజీల్లో చదివితే తప్పకుండా నీట్, ఎంసెట్ ర్యాంకులు వచ్చి సీట్లు వస్తాయనే ఉద్దేశ్యంతో ఈ కథకు తెరలేపారు.

**ప్రభుత్వాన్ని బురిడీ :** తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఇప్పటికే అడ్మీషన్ల ప్రక్రియ దాదాపుగా పూర్తియ్యింది. ఐతే నీట్లో పాటు పలు సెట్లో సీట్లు సాధించేందుకు విద్యార్థులను మొదటి నుండే రుద్దుతుంటారు. ఇందు కోసం ప్రత్యేకమైన ఫీజులు కూడా వసూళ్లు చేస్తున్నారు. కానీ కొన్ని స్వార్థ పూరిత కాలేజీలు ప్రభుత్వాన్ని బురిడీ కొట్టిస్తున్నాయి. ఇక్కడే చదువుతున్నట్లు రిజిష్ట్రర్లో ఆయా విద్యార్థుల పేర్లు నమోదు చేసి ఉంటాయి. వారు ప్రతి రోజూ కాలేజీకి వచ్చి పాఠాలు వింటున్నట్లుగా కూడా చూపుతారు. కానీ ఆ విద్యార్థులు మాత్రం ఆంధ్రాలోని కొన్ని ప్రైవేటు కాలేజీల్లో హాజరవుతూ పాఠాలు వింటుంటారు. కేవలం పరీక్షల సమయంలో మాత్రమే అక్కడి నుండి ఇక్కడికి వచ్చి పరీక్షలు రాస్తుంటారు. అంటే తెలంగాణ చదువులపై విద్యార్థులు తల్లిదండ్రులకు గానీ వారిని ప్రోత్సహించే యాజమాన్యాలకు గానీ నమ్మకం లేదనే వాస్తవం అర్థమవుతోంది. ఆంధ్రాలో చదివే ఇక్కడి విద్యార్థుల్లో పలువురికి ఫీజు రీయింబర్స్మెంట్ సదుపాయం కూడా ఉండటం గమనార్హం అంటు చర్చించుకుంటున్నారు. ఇక్కడి ప్రభుత్వం నుండి ఫీజురీయింబర్స్మెంట్ పొందుతూ ప్రక్క రాష్ట్రంలో చదువులు సాగించే వారు ముమ్మాటికీ ప్రభుత్వాన్ని బురిడీ కొట్టిస్తున్నట్లే అంటూ పలువురు వాదిస్తున్నారు.

**విద్యార్థులకు ద్రోహం :** మంచి ర్యాంకులు రావాలంటే ఆంధ్రా చదువులే కరెక్ట్ అంటూ ఇక్కడి విద్యార్థులను ర్యాంకులు, కాసుల కోసం అక్కడికి పంపిస్తున్న కాలేజీల యాజమాన్యాలు తోటి విద్యార్థులకు ద్రోహం చేస్తున్నాయి. కేవలం ర్యాంకులు సాధించి సీట్లు తెచ్చుకునేందుకే అక్కడికి పోవడం వల్ల ఇక్కడే ఉండి చదివే వారు తీవ్ర నష్టపోతున్నారు. ప్రధానంగా తెలంగాణలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అధికంగా ఉండటంతో మెడిసిన్లో గవర్నమెంట్ సీటు సాధించాలనే ఉద్దేశ్యంతో ఈ ద్రోహానికి తెరలేపినట్లు తేటతెల్లమవుతోంది. పర్యవేక్షణా లోపాల వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ద్రోహానికి తెరలేపుతున్న కళాశాలలపై చర్యలు తీసుకుని ఇక్కడి విద్యార్థులకు మేలు చేయాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

**నాదృష్టికి రాలేదు – వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ విద్యాధికారి :** తెలంగాణ కాలేజీల్లో అడ్మీషన్లు పొంది ఆంధ్రాలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. పెద్ద పెద్ద పట్టణాల్లో ఇలాంటి తంతు సాగుతున్నట్లు విన్నాం, కానీ ఈ జిల్లాలో అలా వినలేదు. ఫిర్యాదులు అందితే తనిఖీ నిర్వహించి వాస్తమని తేలితే ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకుంటాం.



## ఉద్యోగ విరమణ బకాయిలు సత్వరమే చెల్లించాలి

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పరిశ పుల్లయ్య

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను సత్వరమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం కృషి భవన్లో పెన్షనర్ల సమావేశం పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసి సంవత్సరం గడిచినా ప్రభుత్వం బకాయిలు చెల్లించడంలో వైఫల్యం చెందిందన్నారు. పలువురు పెన్షనర్లు మరణించారని ఆయన తెలిపా రు. ఇప్పటికైనా పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను సత్వరమే చెల్లించాలని కో రా రు. ప్రభుత్వం స్పందించకపోతే పెన్షనర్లు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పి లుపునిచ్చారు. ఉపాధ్యాయ సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి వి. మనోహర్ రాజు మా ట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు పెన్షనర్లను ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. ఐక్యతతో సాధించిన హక్కులకు ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చే యత్నాలను తి ప్పికొట్టాలన్నారు.ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో రా ష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సంఘం చేస్తున్న కృషితో పలువురు పెన్షనర్లు సకాలంలో పెన్ష న్ తీసుకుంటున్నారన్నారు. పెన్షనర్లను ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తున్నామన్నారు. ఈ సమావేశంలో భాస్కరాచారి, పి. వీరభద్రరావు, మేరీ ఏసుపాదం, పివిఆర్కె ప్రసా ద్, లక్ష్మి సుజాత, అంజలి, వెంకటేశ్వర్లు, హుస్సేన్, రవీంద్ర, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో వసతుల కల్పన

రెసిడెన్షియల్ విద్యా సంస్థలను కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఖమ్మం నగరం దానవాయిగూడెంలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల, డా॥ బిఆర్ అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల (బాలికల), కోయచలక క్రాస్ రోడ్డులోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల, మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలను సందర్శించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ గురుకులంలో రూ. 1.50 కోట్లతో మంజూరు చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ప్రహరీ గోడ నిర్మాణం, వాటర్ ట్యాంకుకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను అందించి నీటి సమస్య రాకుండా పరిష్కరించాలన్నారు.గురుకులంలోని డార్మెంటరీ, టాయిలెట్ బ్లాక్స్ పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో చేపట్టాల్సిన మైనర్ మరమ్మతు పనులపై నివేదిక అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డైనింగ్ హాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త బస్టాండ్ వద్ద ఉన్న డా॥ బిఆర్ అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలికలు)లో పది లక్షలతో చేపట్టిన పనులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా రెండు డార్మెంటరీ బ్లాక్ల ఏర్పాటు, పై అంతస్తులో మరో ఆరు గదులను నిర్మించేందుకు ప్రతిపాదనలు అందించాలన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో కోతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో అవసరమైన గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. కమ్యూనిటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జోనల్ అధికారి స్వరూపరాణి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డా॥ పురందర్, ప్రిన్సిపాళ్లు విజయదుర్గ, శైలజ, రాజ్యలక్ష్మి, ఆర్ఎలసి అరుణకుమారి, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెలోకి ఆటో కార్మికులు:జెఎసి




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ జులై తొమ్మిదిన జరిగే సార్వత్రిక సమ్మెలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని జేఏసి నేతలు పిలుపునిచ్చారు. మోడీ సర్కార్ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె జరుగుతుందని జేఏసి నేతలు తెలిపారు. పదేళ్ల జైలు శిక్ష, ఏడు లక్షల జరిమానా విధించే భారత న్యాయ సంహితలోని సెక్షన్ 106/1/2లను రద్దు చేయాలని జేఏసి నేతలు డి మాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివా రం జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు పేరబోయిన మోహన్రావు, జాకీర్, సిఐటియు నాయకులు జిల్లా ఉపేందర్, రాందాస్, టి ఎన్టియుసి నాయకులు రవీందర్, టియుసిఐ నాయకులు శ్రీను, లక్ష్మినారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్బిఐటిలో ముగిసిన శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రపంచంలో అన్ని రంగాలు అకౌంటింగ్తో ముడిపడి ఉన్నాయని ఎస్బిఐటి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఎస్బిఐటి కళాశాలలో ఎంబిఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ట్యాలీ విత్ జిఎస్టి శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గుండాల కృష్ణ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్కు దీటుగా అకౌంటింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ట్యాలీ వంటి సాఫ్ట్వేర్పై అవగాహన కలిగి ఉండడం ప్రతి మేనేజ్మెంట్ విద్యార్థికి అవసరమన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్ ) సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణా తరగతులు విద్యార్థులకు అకౌంట్స్ పై ఆసక్తిని పెంపొందించాయన్నారు. విద్యార్థులకు ట్యాలీ సాఫ్ట్వేర్పై ల్యాబ్లో శిక్షణ అందించడం ద్వారా లెడ్జర్స్ ఎంట్రీ, కొత్త కంపెనీల అకౌంట్ల తయారీలపై ప్రాక్టీకల్స్తో అనుభవం సాధించారని ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్కుమార్ మాట్లాడుతూ జిఎస్టి వల్ల ఆర్థిక రంగంలో ఎన్నో మార్పులు సంభవించాయన్నారు. మేనేజ్మెంట్ విద్యార్థులు మారిన అకౌంటింగ్ విధానాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఇటువంటి శిక్షణలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. చివరి రోజు ఆన్లైన్ ద్వారా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు ఉత్తీర్ణులైన వారికి టాస్క్ ద్వారా సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ట్రైనర్ రామకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె.రవీంద్ర బాబు, ఎన్. శ్రీనివాసరావు, ఎంబిఏ విభాగాధిపతి పి. రామకృష్ణ, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా తెలిపారు. శనివారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని కొత్తగూడెం సిపిఐ కార్యాలయంలో 14, 15 డివిజన్ కొత్తగూడెం సిపిఐ మహాసభ జంగాల వలరాజు, చింతకాయల లక్ష్మినారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ఎస్కె జానిమియా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజల పక్షాన సిపిఐ నిరంతరం పోరాటాలు సాగించి పేదల పక్షపాతిగా నిలిచిందన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఖమ్మం కార్పోరేషన్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని ఆయన కోరారు. డివిజన్లలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్యదర్శి జొన్నల గడ్డ వెంకటేశ్వర్లు, బుడిగె వెంకన్న, రావుల సంజీవరావు, కోలా ఎల్లయ్య, రాపోలు ఏడుకొండలు, మేడా చిన్ని, భూమా రామ్మూర్తి, లక్కా వీరయ్య, ఎస్కె రజబ్అలీ, దుగ్యాల వెంకన్న, పొట్ట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడెం శాఖ కార్యదర్శిగా రావుల హన్మంతరావు :** మహాసభలను పురస్కరించుకుని ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని కొత్తగూడెం సిపిఐ శాఖ కార్యదర్శిగా రావుల హన్మంతరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రావుల హన్మంతరావుతో పాటు సహాయ కార్యదర్శులుగా మాకనబోయిన నాగేశ్వరరావు, పకీర్ సాహెబ్లతో పాటు 21 మందితో కౌన్సిల్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రావుల హన్మంతరావు మాట్లాడుతూ సిపిఐ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కొత్తగూడెం శాఖ పరిధిలోని ప్రాంతాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజీనామా



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** చిమ్మపుడి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజీనామా చేశారు. శనివారం చిమ్మపుడి గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు పి. నరేష్, ఎల్. వెంకటరెడ్డి, కె. నరేష్, ఎస్కె మీరాంబీ లు తమ రాజీనామా పత్రాన్ని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు జోనేబోయిన పాపయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో పార్టీలో జరుగుతున్న పరిణామాల వల్ల తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయించారని వారు తెలిపారు. ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు ఎటువంటి ప్రమేయం లేదని వారు తెలిపారు. కానీ ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తుది జాబితా తయారైందన్న విమర్శలు గ్రామంలో వినిపిస్తున్నాయన్నారు. అర్హులకు కాకుండా అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారని గ్రామంలో ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలు, అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించకపోవడంతో తాము ఇందిరమ్మ కమిటీకి రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన అర్హులై ఉన్న కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో తీవ్ర అన్యాయం జరిగిందని వారు తెలిపారు.

## పెరుగుతున్న దాబాల వ్యాపారం



ఆసక్తి చూపుతున్న ఆహార ప్రియులు

మద్యంతో తప్పని ఘర్షణలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒకప్పుడు పెద్ద పెద్ద నగరాల శివార్లకే పరిమితమైన దాబాల సంస్కృతి ఇప్పుడు పల్లెలకు పాకింది. ప్రధాన రహదారులు, మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల చుట్టూ దాబాలు వెలుస్తున్నాయి. దాబాలలోని ఆహార పదార్థాల పట్ల ఆహార ప్రియులు ఆసక్తి చూపుతుండడంతో దాబాలలో వ్యాపారం మూడు క్రరీలు, ఆరు రోటీలు అన్నట్లుగా వర్ధిల్లుతుంది. మద్యం ప్రియులకు దాబాలు వరంగా మారాయి. కొన్ని దాబాలలో మద్యాన్ని కూడా అనుమతిస్తున్నారు. దీనతో మద్యం మత్తులో ఘర్షణలకు దాబాలు వేదికవుతున్నాయి. కొన్ని దాబా హోటళ్ల వ్యాపారం స్టార్ హోటళ్లను తలదన్నే రీతిలో సాగుతుందంటే ఆశ్చర్యం కలుగక మానదు. దశాబ్ద కాలంలో ఆహార వ్యాపారం గణనీయంగా పెరిగింది. ఇంటి వంటల కంటే బయట ఆహార పదార్థాలను ఆరగించేందుకు మక్కువ చూపుతున్నారు. దీనితో ఆహార వ్యాపారం నిర్వహించే హోటళ్లు విపరీతంగా వెలిశాయి. వారాంతంలో కుటుంబంతో సహా బయట భోజనం చేయడం ఈ మధ్య ఒక అలవాటుగా మారింది. కొందరు దీనిని స్టేటస్ సింబల్గా భావిస్తున్నారు. ఈ క్రమంలోనే శివారు ప్రాంతాల్లో విశాలమైన ప్రదేశాలల్లో సరికొత్త పద్దతుల్లో దాబాలను ఏర్పాటు చేశారు. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఒడిశా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన వారు దాబాలు నిర్వహించే వారు. ఇటీవల దాబాల వ్యాపారం లాభసాటిగా ఉండడంతో స్థానికులు సైతం దాబా నిర్వహణలోకి వచ్చి రాజస్థాన్, ఒడిశా, పంజాబ్ల నుంచి మనుషులను తెప్పించి వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు కేవలం రోటీ, చపాతి లకే పరిమితమైన దాబాలలో ఇప్పుడు అన్ని రకాల తెలుగు వంటకాలు లభిస్తున్నాయి. పట్టణాలు, నగరాల్లోని స్టార్ హోటళ్లకు లభించిన ఆదరణ దాబా హోటళ్లకు లభిస్తుంది. ఇక ప్రయాణంలో ఉన్న వారు దాబా హోటళ్లలో ఆహార పదార్థాలను తినేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. శాఖహార, మాంసాహార పదార్థాలను నచ్చిన రీతిలో వండి వడ్డిస్తున్నారు. అన్నింటికి మించి దాబాల వద్ద పార్కింగ్ ఇబ్బందులు లేకపోవడం గమనార్హం. పెరిగిన వ్యాపారంతో పాటు అపరిశుభ్రత, నాణ్యతలేమి చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి ఘటనల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. చాలా దాబాల్లో మద్యం సేవించేందుకు అనుమతులు ఇవ్వడంతో మద్యం ప్రియులు దాబాలకు చేరుకుని కిక్కు ఎక్కేదాకా మద్యం సేవిస్తున్నారు. ఈ మత్తులో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కాలంలో ఘర్షణలతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు కొన్ని దాబాలు వేదికలవుతున్నాయి. కొన్ని దాబాలు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. ఇటీవల ఓ దాబా యాజమాని రోజుకు మూడువేలు చెల్లిస్తే తిన్నంత తిండి తాగినంత మందు అని పబ్లిసిటీ చేశాడు. ఇలాంటివి మరికొన్ని పబ్లిసిటీలు ఉన్నాయి. మొత్తం మారిన ఆహారపు అలవాట్లు దాబా హోటళ్లకు వరంగా మారాయి. అత్యాశకు పోయి కల్తీ చేయకుండా రుచికరమైన ఆహారం అందించి అందుకు తగిన ప్రతిఫలం ఆశిస్తే దాబాల వ్యాపారం నాలుగు కాలాల పాటు వర్ధిల్లుతుంది. లేదంటే సిమెంటు గోడ తడి ఆరకముందే మూతపడుతుంది.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

**ప్రజాపక్షం/చిట్యాల:** మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి పచ్చని చెట్లు ప్రగతికి మెట్లుగా పర్యావరణాన్ని పరిరక్షించాలని భూపాలపల్లి నియోజకవర్గ ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని డిసిసిబి బ్యాంక్ ఆవరణంలో బ్యాంక్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై బ్యాంకు అధికారులతో,మండలంలోని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మొక్కలు నాటి నీరు పోసి అనంతరం స్థానిక ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని నాటిన మొక్కలకు నీరు పోసి కాపాడుకొని సంరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శ్రీ వాణి, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్,అసిస్టెంట్ మేనేజర్ రాజేష్, ఎఎంసి చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎండి రఫీ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, జిల్లా నాయకులు చిలుకల రాయకొమురు, బుర్ర లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాసు, దబ్బేట అనిల్, కాంగ్రెస్ శ్రేణులు,తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలి

### వరంగల్ పోలీస్‌కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏఎస్ఐ లుగా పదోన్నతి పొందిన పి. శ్యాం సుందర్, ఎస్. ప్రభాకర్, టి. కట్ట స్వామి, వి. శంకర్, ఎ. అర్జున్ లు శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందజేశారు. పోలీస్‌కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలియజేసారు అనంతరం సిపి మాట్లాడుతూ పోలీ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా పోలీస్‌కమిషనర్ పదోన్నతి పొందిన ఎఎస్ఐలకు సూచించారు.

## డిసెంబర్ 13న నవోదయ ఎంపిక పరీక్ష



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026..27 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు 13 డిసెంబర్ 2025 రోజున ఎంపిక పరీక్ష నిర్వహించబడుతుందని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జీ తెలిపారు. శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తన ఛాంబర్లో ప్రిన్సిపాల్ బి పూర్ణిమతో కలిసి జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ మే 1, 2024 నుండి జులై 31, 2016 మధ్య జన్మించిన విద్యార్థులు ఎంపిక పరీక్షకు అర్హులన్నారు. విద్యార్థులు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4వ తరగతులు చదివి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు జులై 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ 9110782213, 7993263431 నంబర్లను సంప్రదించాలన్నారు.

# వర్షాకాలంలో ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తం

### తక్షణ సహాయం కోసం కంట్రోల్ రూం

### ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** రానున్న రోజులలో గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, జిల్లా ప్రజలు, జిల్లా అధికారిక వాట్సాప్ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకొని సూచనలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా తక్షణ సహాయం కొరకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్ 180042571 09 ల్యాండ్ లైన్ నెంబర్‌లకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా అందుబాటులో ఉంటూ, వర్షానికి, జలమయమైయ్యే ప్రాంతాల సమస్యకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాకాలంలో ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. అత్యవసర సేవలకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్న ట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ సమయంలో వర్షం వస్తుందో తెలియదు కాబట్టి ఏ సమయంలో అయినా ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొంగి పొర్లే నదిని దాటకుండా గ్రామాలలో టాం టాం ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పొంగి పొర్లే వాగులు, రహదారుల్లో ప్రజ లు రవాణా చేయకుండా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అత్యవసర సేవలకు తహసీల్దారు, ఎంపిడిఓ, గ్రామ కార్యదర్శులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

### ఏఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి



**ప్రజాపక్షం/కాజీపేట :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ శనివారం రాంపూర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట జులై 9న దేశవ్యాప్తంగా జరుగనున్న సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించడం జరిగింది. అలాగే హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లోనూ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ కార్మికులు దశాబ్ద కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను అమలు చేయకపోగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్మికుల హక్కులను, చట్టాలను బడా పెట్టుబడుదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్నదన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐటీయుసి నాయకులు మునిగాల భిక్షపతి, మేకల శంకర్, వేణు కుమార్ ,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ మండల ద్వితీయ మహాసభ



**ప్రజాపక్షం/రేగొండ :** గోరి కొత్తపల్లి లో సిపిఐ మండల ద్వితీయ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా పార్టీ ప్రతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు మార్క రామన్న ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా రైతు సంఘం గౌరవ జిల్లా అధ్యక్షులు మామిడాల సమ్మిరెడ్డి సిపిఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహాయ కార్యదర్శి పైల్ల శాంతికుమార్ మాట్లాడుతూ, పేద ప్రజల పక్షాన పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని దున్నేవాడికి భూమి కావాలని పెద్ద ఎత్తున పోరాటాలు చేసి లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ దేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరుతో అమాయకుల్ని దేశ పౌరుల్ని ఆదివాసుల్ని మావోయిస్టు పార్టీ నాయకుల్ని హతమారుస్తుందని, ఇది కేవలం అటవీ సంపదను కార్పొరేట్ శక్తులైన ఆదాని అంబానీలకు అప్పచెప్పడం కోసం మాత్రమే చేస్తున్న చర్య అని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న మారణకాండాన్ని ఆపివేయాలని మావోయిస్టులతో చర్చలు జరపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కొత్తపల్లి గోరి మండల కార్యదర్శి బొమ్మరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు గుంటి చంద్రమౌళి, సిపిఐ రేగొండ మండల కార్యదర్శి పెంట రవి, పరమాండ్ల పద్మ, బోట్ల చంద్రమౌళి, యాద బుచ్చయ్య, గుండు సమ్మయ్య, సదానందం జాలిగపు రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని మరొక వ్యక్తికి పునర్జన్మను ఇవ్వడానికి జీవన్ దాన్ మహాదానమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని ఆబున్స్ ఫంక్షన్ హాల్ లో నేత్ర అవయవ శరీర దానం పై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ అవయవదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచన కలగాలని, అవయవ దానంతో మరికొందరి జీవితాలలో వెలుగు నింపవచ్చునని, దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన కలగాలని చెప్పారు. కొన్ని మత ఆచారాలు అవయవ దానం చేస్తే జీవుడు దైవంలో ఐక్యం కాదన్నా అపోహ ఉందని, కానీ మనిషి ప్రాణం నిలబడితే ఆ దైవం కూడా అనుగ్రహిస్తాడని తెలిపారు. అవయవదానం చేసిన వారు మహాత్ములని, చిరంజీవులుగా మిగిలిపోతారని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు, కేఎంసీ, ఎంజీఎం, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ లు డాక్టర్ రామ్ కుమార్ రెడ్డి, డాక్టర్ చిలుక మురళి, డాక్టర్ మోహన్ దాస్, డాక్టర్ కూరపాటి రమేష్, ప్రభుత్వ సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ కుమార్, మైదం రాజు, తహసీల్దార్ ఇక్బాల్, నిర్వాహకులు, వాలంటీర్లు, ప్రజ లు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

### సిపిఐ జిల్లా నాయకులు సమ్మిరెడ్డి, శాంతి కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికే ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను కిరాతకంగా బిజెపి ప్రభుత్వం ఎన్కౌంటర్ చేసి చంపేస్తుందని సిపిఐ జిల్లా నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, పైల్ల శాంతి కుమార్ అన్నారు. శనివారం జయశంకర్ భూపాల పల్లి జిల్లా గోరి కొత్తపల్లి సిపిఐ మండల ద్వితీయ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపల్లి గోరి మండల కార్యదర్శి బొమ్మరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా పార్టీ ప్రతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు మార్క రామన్న ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా రైతు సంఘం గౌరవ జిల్లా అధ్యక్షులు మామిడాల సమ్మిరెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పైల్ల శాంతికుమార్ పాల్గొని మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. దున్నేవాడికి భూమి కావాలని పెద్ద ఎత్తున పోరాటాలు చేసి లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీ దేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరుతో అమాయకుల్ని దేశ పౌరుల్ని ఆదివాసుల్ని మావోయిస్టు పార్టీ నాయకుల్ని హతమారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అటవీ సంపదను కార్పొరేట్ శక్తులైన ఆదాని, అంబానీలకు అప్పచెప్పడం కోసం మాత్రమే చేస్తున్న చర్య అని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న మారణకాండని ఆపివేయాలని మావోయిస్టులతో చర్చలు జరపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు గుంటి చంద్రమౌళి సిపిఐ రేగొండ మండల కార్యదర్శి పెంట రవి, పరమాండ్ల పద్మ బోట్ల చంద్రమౌళి, యాద బుచ్చయ్య, గుండు సమ్మయ్య, సదానందం జాలిగపు, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల పేరుతో వసూళ్లకు వస్తే కేసులు పెట్టండి

### ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రభుత్వ హాస్టల్స్‌లలో విద్యార్థి సంఘాల పేరుతో చందాలకు గాని, వసూళ్లకు గాని పాల్పడితే కేసులు నమోదు చేయండి అని అధికారులను సూచించారు. సంఘాల వారికి మామూలు ఇవ్వడం వల్ల హాస్టల్లో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం కరువైందని ఘాటుగా విమర్శించారు. హాస్టల్లో హెడ్మాస్టర్లు, వార్డెన్లు తప్పు చేయొద్దని, మధ్య దళారులకు భయపడి వారికి మామూలు ఇవ్వకూడదని సూచించారు. శనివారం హనుమకొండ నగరంలోని జులైవాడలో బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులైవాడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు సరిగా లేవని, 400 మంది ఇప్పటికి పై గా ఉండే విద్యార్థుల కొరకు కనిస సౌకర్యాలు కరువయ్యాయని వాపోయా రు. పాఠశాల అంటే మంచి విద్యాబోధన, ప్రభుత్వ మెను ప్రకారం ఆహారం అందేలా చూడాలన్నారు. విద్యార్థి సంఘాల పేరుతో వసూళ్లకు పాల్పడే వారిని గుర్తించి వారిపై ఫిర్యాదులు చేయాలని అధికారులను సూచించారు. విద్యార్థులకు కేటాయించే నిధులలో విద్యార్థి సంఘాలు వసూళ్లకు పాల్పడే బ్యాచులు ఉన్నన్ని రోజులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఉండదని పేర్కొన్నారు. అలాగని వార్డెన్ హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాల్ లు తప్పు చేస్తే విడిచి పెట్టే ప్రసక్తే లేదని అధికారులను హెచ్చరించారు. ప్రతి ఆదివారం నాడు పండగ వాతావరణంను తలపించలా కల్చరల్ ప్రోగ్రామ్లు ఏర్పాటు తో హాస్టల్ వాతావరణ ఉండాలని, ప్రతిరోజు గుడ్డుతోపాటు, చికెన్, మటన్ పండ్లు అందించాలని, విద్యార్థినులకు హాస్టల్కు వచ్చిన తర్వాత ఇల్లు గుర్తు రాకుండా ఉపాధ్యాయులు, వార్డెన్లు తల్లిదండ్రుల మాదిరిగా వారిని చూసుకోవాలని, వారి సొమ్మును దోచుకోవాలని చూస్తే ఎస్టీ కమిషన్ ఊరుకోదని హెచ్చరించారు. జులైవాడ హాస్టల్ ఎన్నో సంవత్సరాలుగా వేలాదిమంది విద్యార్థులకు బోధన అందించారని కానీ వారిని ఉన్నత స్థానంలో నిలపడంలో ఉపాధ్యాయుల బృందం విఫలమైందని అన్నారు. త్వరలోనే హాస్టల్ కు కావలసినటువంటి మౌలిక సదుపాయాలు ఏమైతే ఉన్నాయోతనకు పంపించాలని అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే దిశలో.. ఎస్టి కమిషన్ చొరవ తీసుకుంటుందన్నారు.

**విద్యార్థులతో ఎస్‌టి కమిషన్ సభ్యులు ముఖాముఖి:** విద్యార్థినులతో జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు ముఖాముఖి నిర్వహించారు. ఒక్కో విద్యార్థిని హాస్టల్లో ఉన్న సమస్యలపై మాట్లాడాలని కోరగా.. హాస్టల్లో క్రీడస్థలం లేదని, వాటర్ ప్లాంట్ లేదని, క్లాసులు చెప్పేందుకు ప్రొజెక్టర్లు లే వని.. విద్యార్థులు కోరగా అన్ని ఏర్పాట్లు తానే దగ్గర ఉండే చేపిస్తానని.. అలాగే క్రీడల కోసం .. హాస్టల్ లో క్రీడా మైదానం ఏర్పాటు చేద్దామన్నారు. రానున్న రోజుల్లో ఎస్సీ ఎస్టీలు ఉన్నత స్థాయిలో ఉండేలా మొదటినుండి ఇంగ్లీష్ ,హిందీ బాగా నేర్చుకోవాలని.. తెలుగు మాట్లాడితే తెలంగాణలోనే ఉంటారని, హిందీ మాట్లాడితే ఇండియా అంతా తిరుగుతారని, ఇంగ్లీష్ మాట్లాడితే ఇతర దేశాల్లో సైతం వెళ్తుంటారని ఆయన పేర్కొన్నారు. హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకటరెడ్డి, ఆర్‌డిఓ రమేష్ రాథోడ్, ఐటిడిఎ ఎపిఓ వసంత్ జాదవ్, హనుమకొండ డిటిడిఓ ప్రేమ కళ, వరంగల్ డిటిడిఓ సౌజన్య, హెడ్మాస్టర్ రమాదేవి, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వినోద్ లోక్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు మునావత్ నరసింహ నాయక్, స్టేషన్ఘన్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడీదారుల ప్రయోజనాల కోసమే లేబర్ కోడ్‌లు



**ప్రజాపక్షం / హనుమకొండ టౌన్ :** పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే కొత్తగా నాలుగు కార్మిక కోడులను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జక్కుల రాజుగౌడ్, సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి దయాకర్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మామిడి శ్యాంసుందర్ అన్నారు. శనివారం హనుమకొండ రామ్‌నగర్‌లోని సుందరయ్య భవన్‌లో సి ఐటియు జిల్లా అధ్యక్షులు టి ఉప్పలయ్య, ఐఎన్‌టియు సి జిల్లా అధ్యక్షులు కూర వెంకట్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, అధ్యక్షతన జాతీయ కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాగుల రమేష్, రాజు గౌడ్, గంగుల దయాకర్, మామిడి శ్యాంసుందర్ మాట్లాడుతూ కార్మికుల శ్ర మను దోచుకొని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను సులభతరం చేసి కార్మికులను కట్టు బానిసలుగా తయారు చేయడం కోసమే నాలుగు లేబ ర్ కోడులను తీసుకువచ్చారని వాటిని తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. 9న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బిజెపి ప్రభు త్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 29 పాత కా ర్మిక చట్టాలను పునరుద్ధరించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు వర్తింపజేసి 210 దినాలు 800 రూపాయల కూలీని పెంచాలని, ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. జాతీయ సమ్మెను జయప్రదం చేయడంలో భాగంగా జులై ఏడవ తేదీ సోమవారం వె య్యిస్తంభాల గుడి నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జులై 9న సమ్మెలో భాగంగా హనుమకొండ ఏక శిలా పార్కు నుండి కలెక్టరేట్ వరకు వేలాది మందితో కార్మిక మహా ప్రదర్శన నిర్వహిస్తున్నామని వేలాది మంది కార్మికులు ప్రజలు పాల్గొనాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆలకుంట యాకయ్య బానోతు వెంకన్న, ఎన్ ఓదెలు, మైమొద్ ఖాన్, డి భాను నాయక్ లు పాల్గొన్నారు.

# మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సోతుకు ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఈ నెల 13, 14న నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 5వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమల మండల కేంద్రంలో సిపిఐ నాయకులతో కలిసి వాల్ మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, నిరంత రం ప్రజా సమస్యలపై పోరాడుతు 99 వసంతాలను పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా మహాసభలను ఈ నెల జులై 13, 14న రేగొండ ఎస్ ఎల్ ఎన్ గార్డెన్ లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ జిల్లా మ హాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్ రావు ముఖ్యఅతిథిలుగా హాజరవుతున్నారని తెలిపారు. మహాసభలో జిల్లా సమగ్ర అభివృద్ధికై చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజ్ సతీష్, మండల నాయకులు మట్టి సర్వేష్, మట్టి కృష్ణ, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్ అమీలే శ్రీనాథ్, శ్రీకాంత్, అంజి బాబు, మారవేణి వెంకట్, పోడెం సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

### కార్మిక సంఘాల జెఏసి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కార్మికులకు నష్టాన్ని కలిగించే నాలుగు నల్ల చట్టాలను కేంద్రం వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల జెఏసి నాయకులు ఎఐటియుసి మధుగాని విజయేందర్, ఐఎన్‌టియుసి జోగబుచ్చయ్య, సిఐటియు కంపేటి రాజయ్య, టిబిజికెఎస్ బడితల సమ్మయ్యలు డిమాండ్ చేశారు. కెటికె ఓసి3 యూజీ గని లో పిట్ సెక్రటరీ ఎల్ శంకర్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్లో జాతీయ సంఘాల జెఏసి నాయకులు పాల్గొని మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లు విభజించి కార్మిక హక్కులను కాలరాసిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుంత్వ బిజెపి చట్టాలు సవరణ చేసి 4 నల్ల చట్టాలను తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేయబోతుందని వాపోయారు. ఈ నాలుగు నల్ల కోడ్ లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను భూపాలపల్లి ఏరియాలోని అన్ని మైన్స్, డిపార్ట్మెంట్లలో పనిచేసే కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని జెఏసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఏసి సంఘాల నాయకులు నూకల చంద్రమౌళి, కార్మికులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి అర్హత సాధించిన 49మంది విద్యార్థులు

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ జిల్లా నుండి ట్రిపుల్ ఐటికి 49 మంది విద్యార్థులు అర్హత సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. వారిని శనివారం ఆయన అభినందించారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ ట్రిపుల్ ఐటి ఆరు సంవత్సరాల కోర్సుకు ఎంపిక కావడం జిల్లా కీర్తిని పెంచిందన్నారు. జిల్లాలోని కొడకండ్ల మండలం నుండి 15మంది విద్యార్థిని విద్యార్థులు ప్రవేశం పొందగా రఘునాథపల్లి మండలం నుండి 8 మంది, లింగాలఘనపురం, చిల్పూరు, జనగామ నుండి ముగ్గురు చొప్పున ప్రవేశం పొందారన్నారు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ కొండకండ్ల నుండి అత్యధికంగా ఎనమిది మంది విద్యార్థులు ఎంపిక కావడం తెలంగాణ ఆదర్శ పాఠశాల నుండి ఐదుగురు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఎక్కువ మంది విద్యార్థులు సాంకేతిక విద్య పొందడానికి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని, ప్రణాళిక బద్ధంగా చదివి పదో తరగతి ఫలితాల్లో మంచిఫలితాలుసాధించిరాష్ట్రంలోఅగ్రస్థానంలోనిలవాలన్నారు.

## జాతీయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం




**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఈనెల 09న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐఎఫ్‌టియు న్యూ రాష్ట్ర అధ్యక్షుడు మూడెం మల్లేశం, బిఆర్‌టియు రాష్ట్ర నాయకురాలు నల్ల భారతి, జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జి. మునీశ్వర్, సిఐటియు జిల్లా నాయకులు హన్మకొండ శ్రీధర్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ కోరారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నోటీసులను వ్యవసాయ మార్కెట్ అధికారికి, మున్సిపల్ కమిషనర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో హమాలి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీ నారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్, హమాలి యూనియన్ డిజైనర్ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, అన్నం రాజు, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు సారయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం సమ్మయ్య, అల్వాల రాజు, గజ్జల మహేందర్, హమాలి పెద్దమనుషులు జనార్ధన్, మంద మల్లయ్య, గాండ్ల రాములు, ఎడ్ల నాగులు తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ ఆస్పత్రి వైద్యుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

### నిర్వహణ సరిగా లేదని మండిపాటు

### కలెక్టర్ ఆకస్మిక తనిఖీలో వెల్లడైన డొల్లతనం



**ప్రజాపక్షం/పరకాల :** హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి వైద్యుల పనితీరు సరిగా లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. శనివారం కలెక్టర్ సివిల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సివిల్ ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి తనిఖీ చేశారు. సివిల్ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలతో పాటుగా అన్ని రకాల పరీక్షలను సక్రమంగా నాణ్యమైన రీతులు నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు ఓపి నిర్వహణ, రిజిస్టర్లో నమోదు ఆన్లైన్ రిపోర్టులు నమోదు లాంటి వివిధ ప్రక్రియలపై ఆమె ఆసుపత్రి సూపర్డెంట్ తో పాటు ఇతర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్ నిర్వహించకపోవడం ఆన్లైన్లో రోగుల సమాచారాన్ని నిక్షిప్తం చేయకపోవడం లాంటి ఎన్నో విషయాల పట్ల ఆమె క్షుణ్ణంగా పరీక్షించి నిర్వహణ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో నిర్వహించబడుతున్న వివిధ విభాగాల గదులను సందర్శించి పరిశీలించారు. అక్కడ లోపాలు ఎత్తిచూపుతోనే పనితీరు మెరుగుపరచుకోవాలని తీవ్రంగా మందలించారు. సివిల్ ఆస్పత్రిలో సేవలందిస్తున్న వైద్యులతో పాటు ఇతర సిబ్బంది పనితీరు లో బోయిష్టంగా ఉందని కలెక్టర్ ఈ పద్ధతి మార్చుకోవాల ని హెచ్చరించారు. పరకాల పట్టణంలోని సివిల్ ఆస్పత్రిలో నిర్వహణ సక్రమంగా లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్ మండిపడ్డారు ఆసుపత్రి చెట్టు పరిసరాలతో పాటు గదులలో పరిశుభ్రత రోగులకు అందుతున్న అందిస్తున్న వైద్య సేవలు మందులు ఇతర పరీక్షల పనితీరును ఆమె వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు వివిధ వార్డులలో సేవలు పొందుతున్న రోగులను ఆస్పత్రి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ క్రమంలో సివిల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం నుండి అందుతున్న అన్ని రకాల నాణ్యమైన సేవలను సివిలాస్పత్రి వైద్యులు సిబ్బంది ఇక్కడికి వస్తున్న రోగులకు అందించడంలో నిర్లక్ష్యం ఉన్నట్లుగా ఆమె గుర్తించినట్లు తెలిసింది. పరకాల పట్టణంలోని సివిల్ ఆస్పత్రిలో ఉన్న డొల్లతనం జిల్లా కలెక్టర్ పర్యటనతో బయటపడిందన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ తన పర్యటనలో భాగంగా పరకాల పట్టణంలోని సివిలాస్పత్రిని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీలు ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది పండితేరు నిర్వహణ సక్రమంగా లేదన్నారు. వివిధ శాఖలకు చెందిన సిబ్బందితో విడివిడిగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల పనితీరు పై ఆమె ఆరా తీశారు. గర్భిణీలు బాలింతలు ఇతర రోగులకు పౌషాలతో అందుతున్న సేవలపై ఆమె సివిలాస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట పరకాల ఆర్డిఓ నారాయణ, తహసీల్దార్ విజయ లక్ష్మి , పరకాల మున్సిపాలిటీ కమిషనర్ సుష్మ ప్రభుత్వ సివిలాస్పత్రి సూపర్డెంట్ గౌతమ్ పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాంలను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఈవిఎం గోదాంలను జనగామ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాష షేక్ శనివారం పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవిఎం గోదాంలను పరివీలించి సిబ్బందికి పలు సూచనలు చేవారు. భద్రత నమోదు పుస్తకం, సిసి కెమెరాల పనితీరు, నియంత్రణ పద్ధతులను పరిశీలించి భద్రతా ప్రమాణాలకు కట్టుదిట్టంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట జనగామ తహశీల్దార్ హుస్సెన్, సహాయ కార్యాలయ అధికారి, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

# క్రీడ

## గిల్ మరో సెంచరీ

### ఆ ఘనత సాధించిన తొలి ఇండియన్ క్రికెటర్..

తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో అలరించిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటాడు. మరో అద్భుత శతకం సాధించాడు. ఇప్పటివరకు జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో గిల్‌కు ఇది మూడో సెంచరీ. ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులకు ఆలౌట్ అయిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో గిల్ శతకంతో భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఎంతో ఓర్పు, సంయమనంతో చూడ చక్కని ఇన్నింగ్స్ ఆడిన గిల్ రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం వేగంగా పరుగులు చేశాడు. మరో సెంచరీ చేశాడు. 127 బంతుల్లో 100 పరుగులు చేశాడు. ఈ క్రమంలో అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన తొలి ఇండియన్ క్రికెటర్‌గా నిలిచాడు. తాజా మ్యాచ్‌లో గిల్ 369 పరుగులు చేశాడు. ఇంతకు ముందు ఈ రికార్డు సునీల్ గవాస్కర్ (344 వెస్టిండీస్‌పై) పేరిట ఉండేది. అలాగే ఒకే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ, సెంచరీ సాధించిన రెండో భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా తొమ్మిదో అంతర్జాతీయ క్రికెటర్‌గా నిలిచాడు. ప్రస్తుతానికి టీమిండియా 4 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. ప్రస్తుతానికి టీమిండియా ఇంగ్లండ్‌పై 484 పరుగుల ఆధిక్యంలో ఉంది.



## చరిత్ర సృష్టించిన వైభవ్..!

భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ మరోసారి చరిత్ర లిఖించాడు. పద్నాలుగేళ్లకే ఐపిఎల్‌లో 35 బంతుల్లోనే శతకంతో రికార్డులు నెలకొల్పిన ఈ చిచ్చరపిడుగు.. ఈసారి ఇంగ్లాండ్‌పై తన ప్రతాపం చూపించాడు. అండర్ 19 జట్టు తరఫున ఆడుతున్న ఈ కుర్రాడు శుక్రవారం 52 బంతుల్లోనే సెంచరీతో చెలరేగాడు. నాలుగో వన్డే మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు బౌలర్లపై ఎడాపెడా బౌండరీలతో విరుచుకుపడిన వైభవ్ మూడంకెల స్కోర్‌తో గర్జించాడు. ఐపిఎల్ 18వ సీజన్‌లో వేగవంతమైన సెంచరీతో వార్తల్లో నిలిచిన వైభవ్.. విదేశీ గడ్డపై కూడా పరుగుల వరద పారిస్తున్నాడు. ఇంగ్లాండ్ అండర్ 19 జట్టుతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగుతున్న ఈ హిట్టర్ శుక్రవారం తన విధ్వంసాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాడు. ఇంగ్లాండ్ బౌలర్లను ఊచకోత కోస్తూ 52 బంతుల్లోనే శతకంతో తన సత్తా ఏంటో మరోసారి ప్రపంచానికి చాటాడు. కేవలం 78 బంతుల్లోనే 143 రన్స్‌తో భారత్‌కు భారీ స్కోర్ అందించాడీ యువకెరటం. అతడి విధ్వంసానికి పాకిస్థాన్ బ్యాటర్ కమ్రాన్ గులామ్ పేరిట ఉన్న రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. పన్నెండు ఏళ్లకే రంజీల్లో అరంగేట్రం చేసిన వైభవ్‌ను మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. రూ.1.5 కోట్లకు రాజస్థాన్ శిబిరంలో చేరిన ఈ కుర్రాడు తన బ్యాటింగ్‌ను సాన బెట్టుకున్నాడు. కెప్టెన్ సంజూ శాంసన్ గాయపడడంతో లక్నోతో మ్యాచ్‌లో వైభవ్‌కు ఓపెనర్‌గా అవకాశం వచ్చింది.




తొలి పోరులోనే 35 పరుగులతో ఆకట్టుకున్న ఈ చిచ్చరపిడుగు.. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీతో గర్జించాడు. ఐపిఎల్ హిస్టరీలోనే రెండో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్స్‌లోకే అన్నట్టు చెలరేగిన వైభవ్.. 35 బంతుల్లోనే వందతో జైపూర్ ప్రేక్షకులకు సెల్యూట్ చేశాడు. అతడి విధ్వంసక ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 11 సిక్సర్లు ఉండడం విశేషం. ఐఎల్‌లో వేగవంతమైన సెంచరీ బాదిన వాళ్లలో క్రిస్ గేల్ అగ్రస్థానంలో ఉన్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆడుతున్న రోజుల్లో గేల్ 30 బంతుల్లోనే శతకగర్జన చేశాడు. 35 బంతుల్లోనే వంద కొట్టేసిన వైభవ్ రెండో స్థానం సొంతం చేసుకున్నాడు. యూసుఫ్ పఠాన్, డేవిడ్ మిల్లర్‌లు కూడా ఫాస్టెస్ట్ సెంచరీ వీరుల జాబితాలో ఉన్నారు.

## బంగ్లాలో భారత్ పర్యటన వాయిదా..!



బంగ్లాదేశ్–భారత్ మధ్య జరగాల్సిన వన్డే సిరీస్ 2026 సెప్టెంబర్‌కు వాయిదా పడింది. ఈ విషయాన్ని బిసిసిఐ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. వాస్తవానికి ఈ సిరీస్ వచ్చే ఆగస్టులోనే జరగాల్సి ఉంది. ప్రస్తుతం బంగ్లాలోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని సమాచారం. ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు, భారత క్రికెట్ నియంత్రణ బోర్డు వన్డే, టీ20 సిరీస్‌లను వచ్చే ఏడాదికి వాయిదా వేయాలని నిర్ణయించాయి. షెడ్యూల్ ప్రకారం.. ఆగస్టు 17 నుంచి బంగ్లాదేశ్‌లో భారత్ మూడు వన్డేలు, టీ20 సిరీస్‌లో ఆడాల్సి ఉంది. అయితే, రాజకీయ అనిశ్చితి కారణంగా బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నా యి. ఆగస్టులో జరగాల్సిన వన్డే, టీ20 సిరీస్‌కు బంగ్లాదేశ్‌కు భారత జట్టును పంపేందుకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని తెలుస్తున్నది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం జట్టును భారత్‌కు పంపేందుకు అనుమతి ఇవ్వలేదని సమాచారం. అయితే, రాజకీయ అనిశ్చితి కారణంగా బంగ్లాదేశ్‌లో తీవ్ర అలజడి వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సిరీస్ వాయిదా వేసేందుకు బిసిసిఐ మొగ్గు చూపినట్లుగా వార్తలు వచ్చాయి. అయితే, ప్రస్తుతానికి సిరీస్‌ను రద్దు చేయకుండా ఏడాది వాయిదా వేసేందుకు బిసిసిఐ, బిసిబి అంగీకరించాయి. సెప్టెంబర్‌లో నైనా కేంద్రం నుంచి అనుమతి వస్తుందా లేదా అన్నది ఎదురుచూడాల్సిందే. ఇదిలా ఉండగా.. భారత్–బంగ్లాదేశ్ చివరిసారిగా ఈ ఏడాది జరిగిన ఐసిసి చాంపియన్స్ ట్రోఫీలో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. రెండు జట్లు చివరిగా 2024లో భారతదేశంలో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో ఆడాయి. ఇందులో రెండు టెస్టులు, మూడు టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి.

# ఫోకస్ స్పోర్ట్స్






## ఆరోగ్యానికి సైక్లింగ్

సైక్లింగ్ ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది సులభంగా చేయగల వ్యాయామం. రోజూ కనీసం 15 నుంచి 30 నిమిషాలు సైక్లింగ్ చేయడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది, రక్త ప్రసరణ బాగా జరుగుతుంది, బ్లడ్ షుగర్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. బిపి సమస్యలు తగ్గుతాయి. సైక్లింగ్ వల్ల కాళ్ల, తొడల, పిక్కల కండరాలు బలంగా మారతాయి. ఎముకల బలం పెరుగుతుంది, ఆర్థరైటిస్ వంటి కీళ్ల సమస్యలకు సహాయం చేస్తుంది. సైక్లింగ్ జీవక్రియ రేటును పెంచి శరీరంలో కొవ్వు కరిగించడంలో సహాయపడుతుంది. గంట సేపు సైక్లింగ్ చేస్తే, సుమారు 300 కేలరీలు బర్న్ అవుతాయి. ఇది బరువు నియంత్రణకు ఉపయోగపడుతుం ది. సైక్లింగ్ వల్ల మానసిక ఒత్తిడి, డిప్రెషన్, యాంగ్జయిటీ తగ్గి, మెదడు చాలా చురుగ్గా పనిచేస్తుంది. ఇది కీళ్లపై తక్కువ ఒత్తిడి కలిగించే వ్యాయామం కాబట్టి, మోకాళ్ళు, కీళ్లకు ఎలాంటి అదనపు ఒత్తిడి ఉండదు. సైక్లింగ్ వల్ల పెద్దప్రేగు, రొమ్ము కేన్సర్ ప్రమాదం తగ్గుతుంది. అలాగే టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని నిపుణులు అంటారు. సైక్లింగ్ వల్ల శరీరానికి మంచి ఆక్సిజన్ సరఫరా జరుగుతుంది, ఇది రోజంతా శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది. స్థూలంగా చెప్పాలంటే, సైక్లింగ్ ఆరోగ్యాన్ని సమగ్రంగా మెరుగుపరచే, సులభంగా చేయగల వ్యాయామం. రోజువారీ అలవాటుగా తీసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు అందుకోవచ్చు.

## ప్రఖ్యాత మహిళా సైక్లిస్టులు..

**అన్నెమీక్ వాన్ వ్ల్యూటెన్:** నెదర్లాండ్స్‌కు చెందిన రోడ్ సైక్లిస్టు. ప్రపంచ ఛాంపియన్, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్.
**ఎలిసా లాన్గో బోర్గిని:** ఇటలీకి చెందిన సైక్లిస్ట్. రోడ్ ఈవెంట్స్‌తోపాటు, మౌంటైన్, హిల్ విభాగాల్లోనూ రాణిస్తున్నది. గత ఏడాది 'గిరో డిఇటాలియా' విజేతగా నిలిచింది.
**మారియన్ వోస్:** నెదర్లాండ్స్‌కు చెందిన మల్టీడిసిప్లిన్ సైక్లిస్టు, పలు వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లు, ఒలింపిక్ పతకాలు గెల్చుకుంది.
**ఎలెన్ వాన్ డైక్:** టైమ్ ట్రయల్ స్పెషలిస్ట్, వరల్డ్ టైమ్ ట్రయల్ ఛాంపియన్, అవర్ రికార్డ్ హోల్డర్.
**క్రిస్టిన్ ఆర్మ్‌స్ట్రాంగ్:** అమెరికా నుంచి వచ్చిన మూడు ఒలింపిక్ గోల్డ్ మెడల్స్ సాధించిన రోడ్ టైమ్ ట్రయల్ స్పెషలిస్ట్.
**ఫాబియానా లూపెర్జిని:** ఇటలీకి చెందిన మల్టిపుల్ జిరో డోనె విజేత.
**లిజీ డెగనన్:** బ్రిటన్‌కు చెందిన వరల్డ్ ఛాంపియన్, ఒలింపిక్ పతక విజేత.




## మహిళా సైక్లిస్టులకు పరీక్ష
# గిరో డెఇటాలియా

పురుషులకు మాత్రమే పరిమితమనుకున్న ఎన్నో క్రీడా విభాగాల్లో మహిళలు సైతం దూసుకెళుతున్నారు. అత్యంత కష్టతరమైన క్రీడల్లో ఒకటిగా పేర్కొనే సైక్లింగ్‌లోనూ మహిళలు రాణిస్తున్నారు. ఈనెల 6 నుంచి 13వ తేదీ వరకూ జరిగే ఇటలీలో జరిగే 'గిరో డెఇటాలియా' మహిళా సైక్లింగ్ చాంపియన్‌షిప్స్ వారి సామర్థ్యానికి పరీక్ష పెట్టడం ఖాయం. అంతర్జాతీయ సైక్లింగ్ యూనియన్ (యుసిఐ) ఆధ్వర్యంలో జరిగే ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఈ చాంపియన్‌షిప్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. మహిళల విభాగంలో జరిగే 'టూర్ డెఫ్రాన్స్ ఫెమ్మీన్స్' తర్వాత, 'గిరో డెఇటాలియా' రెండో స్థానంలో ఉంది. ఇందులో పాల్గొనే అర్హత సంపాదించడమే గొప్ప విజయంగా సైక్లిస్టు భావిస్తారు. యుసిఐ ఉమెన్స్ వరల్డ్ టీమ్స్ 15, ఉమెన్స్ ప్రో టీమ్స్ 2, ఉమెన్స్ కాంటినెంటల్ టీమ్స్ 5 చొప్పున మొత్తం 22 జట్లు వివిధ విభాగాల్లో టైటిళ్ల కోసం పోటీపడతాయి. ఇండివిజువల్ విభాగంలో నిరుటి విజేత ఎలిసా లాన్గో బొర్గిని మరోసారి సత్తా చాటేందుకు సిద్ధంగా ఉంది. ఎనిమిది రోజులు, ఎనిమిది దశల్లో రేస్ కొనసాగుతుంది. ఈ నెల 6వ తేదీ, మొదటి రోజున బెర్గామో నుంచి మొదలయ్యే ఇండివిజువల్ టైమ్ ట్రయల్ 13.6 కిలోమీటర్లు కొనసాగుతుంది. రెండో రోజు (జులై 7) క్లూసోన్ నుంచి అప్రికా వరకు హిల్లీ స్టేజ్ రేస్ 99 కిలోమీటర్లు ఉంటుంది. మూడో రోజు (జులై 8) వెజ్జా డి ఒర్లియో నుంచి ట్రెంటో వరకు 124 కిలోమీటర్ల హిల్లీ స్టేజ్ రేస్‌ను నిర్వహిస్తారు. నాలుగో రోజు (జులై 9) కాస్టేల్లో టెసినో నుంచి పియానెజ్జె (వ్లాడొబియన్‌డెన్) వరకు మౌంటైన్ స్టేజ్ రేస్ 156 కిలోమీటర్లు కొనసాగుతుంది. ఐదో రోజు (జులై 10) మిరానో నుంచి మొసెలిస్ వరకూ 108 కిలోమీటర్ల దూరం ఫ్లాట్ స్టేజ్ రేస్ ఉంటుంది. ఆరో రోజు (జులై 11) బెల్లారియా నుంచి ఇగియా మారియా వరకు 144 కిలోమీటర్ల హిల్లీ స్టేజ్ రేస్‌ను నిర్వహిస్తారు. ఏడో రోజు (జులై 12) ఫెర్నిగ్నానో నుంచి మాంటే నెరోన్ వరకూ 157 కిలోమీటర్ల మౌంటైన్ స్టేజ్ రేస్ జరుగుతుంది. ఈ మొత్తం ఈవెంట్‌లో ఇదే అత్యంత క్లిష్టమైన దశ. చివరిదైన ఎనిమిదో రోజు (జులై 13) ఫోర్లీ నుంచి ఇమోలా వరకూ 138 కిలోమీటర్ల దూరం జరిగే రేస్‌తో 'గిరో డెఇటాలియా' ముగుస్తుంది. మొత్తం ఈ రేస్‌లో మహిళా సైక్లిస్టులు 939.6 కిలోమీర్ల దూరాన్ని పూర్తి చేస్తారు.

# రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ**




**ప్రజాపక్షం/బోధన్ :** కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి ప్రస్తుత రాజ్యాంగంలో ఉన్న సోషలిజం, సెక్యులరిజం తొలగించి మనువాదం తెచ్చే కుట్రలు చేస్తున్నదని రాజ్యాంగాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. శనివారం సిపిఐ బోధన్ మండల మహా సభ లెర్నర్ స్కూల్ ఆవరణలో కంజర భూమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మైనార్టీ ప్రజలపై దాడులు చేస్తూ భయానక పరిస్థితి నెలకొల్పుతున్నదని అన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు ఊడిగం చేయటంలో భాగంగానే అమెరికా దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నదని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా జూలై 9న జరిగే సమ్మెలో గ్రామీణ ఉపాధి కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య మాట్లాడుతూ.. సిపిఐ గ్రామ శాఖ, మండల, జిల్లా మహాసభ జరుపుకొని ఆగస్టులో మేడ్చల్ జిల్లాలో రాష్ట్ర మహా సభలు, సెప్టెంబర్‌లో చండీగర్ రాష్ట్రంలో జాతీయ మహాసభలు జరుగుతున్నాయని, ఈ మహా సభల సందర్భంగా అన్నీ శాఖలలో ప్రజా సమస్యలను చర్చించి పోరాటాలను రూపొందించాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఐ బోధన్ మండల కార్యదర్శిగా రాధాకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఖురేషి, కార్తిక్ సభ్యులుగా హనుమంతరావు, యాదు, ఎస్కే మన్నన్, మహమ్మద్, గౌస్ సలీం, ఎం.వెంకటేష్, డి.శంకర్, బోధన్ రూరల్ మండల కార్యదర్శిగా జయమ్మ, సహాయ కార్యదర్శిగా గౌతమ్ ప్రకాష్ పటేల్ సభ్యులుగా గైని రాములు, సాయిబాబా, గంగవ్వలను ఎన్నుకున్నారు.

# 'ఉపాధి' పథకానికి నిధులు పెంచండి

**బికెఎంయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్**



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బికెఎంయు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 9వ మహాసభలను జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలకొండ కాంతయ్య మాట్లాడుతూ కూలీలు పనిచేస్తున్న ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచడంతోపాటు పనిదినాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2005లో ఉపాధి హామీ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని, అప్పట్లో వ్యవసాయ కార్మికులకు జీవనోపాధి బ్రహ్మాండంగా సాగిందని వివరించారు. క్రమక్రమంగా ఈ పథకానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడం, ఉద్యోగులను తొలగించడం వెనుక ఉద్దేశం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తుందని, ఉపాధి హామీ పథకం జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఐదు లక్షలు ప్రొసిడింగ్స్‌లు దళిత, గిరిజనుల లబ్ధిదారుల చేతిలో పెట్టి చేతులు దులుపుకుంటుందని మండిపడ్డారు. చిత్తశుద్ధి లేని హామీలు ఇస్తున్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు పరచడంలో పునర్ ఆలోచన చే యాలని సూచించారు. సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఉచిత బియ్యం ఇచ్చి ప్రజల ఓట్లు కొల్లగొట్టి అధికార దాహంతో జల్సాలు చేస్తున్నారని వాపోయారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, ఎఐటియు సి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహ్మారెడ్డిలు మాట్లాడుతూ ఈ మహాసభలు మూడేళ్లకు ఒకసారి జరుగుతాయని, ఈ మూడు సంవత్సరాల కాలంలో మరణించిన కార్మికులకు సంతాపం తెలిపారు. మూడేళ్లకు సంబంధించిన రిపోర్టును జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ప్రవేశపెట్టగా మండల నాయకత్వం చర్చల్లో పాల్గొని చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్.లక్ష్మ య్య, రమేష్ యాదవ్, జిల్లేల వెంకటేష్, తదితరులులపాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు వామపక్షాల మద్దతు

**సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి**




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో జరిగిన వామపక్షాల సంయుక్త సమావేశంలో మేకల రవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం గత పదకొండు సంవత్సరాలుగా కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. అనేక దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న నలభై నాలుగు కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు కోడ్ లను ఏర్పాటు చేసి కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేస్తునా, మోడీ పాలనను గమనిస్తే పూర్తిగా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తున్నాడని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధన కోసం, రైతుల సంక్షేమం కోసం, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం, మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అన్ని జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను ఈ నెల 9న జయప్రదం చేయాలని, సంఘటిత, అసంఘటిత రంగ ఉద్యోగులకు కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మెను జయప్రదం చేయాలని ఈనెల 8న వ రంగల్ చౌరస్తాలో అన్ని వామపక్ష పార్టీలతో సమ్మెకు సంఘీభావంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో కార్మిక వర్గ శ్రే యోభిలాష లు రైతు పక్షపాతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికైనా మోదీ ప్రభు త్వం కొనసాగిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని లేదంటే రానున్న రోజుల్లో అన్ని కార్మిక సం ఘాలు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకమై ఉద్యమాలను ఉధృతం చేస్తామని మోదీ ప్రభుత్వా న్ని గద్దె దించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు . ఈ సమావేశానికి న్యూ డెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు , సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్,తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

**ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు**




**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఏలాంటీ ప్రయోజనాలు లేవని, బడా కార్పొరేట్ వ్యాపార వర్గాల ప్రయోజనాల కోసం మాత్రమే వాటిని అమలు చేస్తున్నారని ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు విమర్శించారు. శనివారం బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమావేశంలో పాల్గొని జూలై 9న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు బిజెపి ప్రభుత్వ మనుగడకు తోడ్పడే విధంగానే ఉన్నాయే తప్ప, కార్మికులకే ఏమాత్రం మేలు చేసేవి కావన్నారు. బిజెపి ప్రభుత్వం తన కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లెబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, జులై 9న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమొగిలి, కొంకుల రాజేష్, విజ్జగిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**ఎఐఎస్‌ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్**

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ఎఐఎస్‌ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ మాట్లాడుతూ జూన్ 12న ఈ విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పటికీ సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. రానున్నది వర్షాకాలమని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కొన్ని బిల్డింగ్స్ శిథిలావస్థలో ఉన్నాయని అలాంటి పాఠశాలల బిల్డింగ్‌ను గుర్తించి డిస్మెంటల్ చేసి నూతన భవనాలు నిర్మించాలన్నారు. అదే విధంగా తరగతులకు అనుగుణంగా టీచర్స్‌ను నియమించాలని, పాఠశాలలో పరిశుభ్రత కోసం స్కావెంజర్స్‌లను నియమించాలన్నారు. అదేవిధంగా వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు పరిమిషన్ లేకుండా నడుపుతూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ ఇష్టానుసారంగా సిటీ నగరంలో హోల్డింగ్‌ను పెట్టి విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని, పర్మిషన్ లేని ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేయాలన్నారు. లేనియెడల ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ హరీష్, శివకుమార్, సోను, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు



## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు కుట్ర




**అధిక ఫీజుల వసూళ్లకు ప్రభుత్వం వత్తాసు ప్రజాప్రతినిధుల విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించాలి : కసిరెడ్డి మణికంఠరెడ్డి**

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ పథకాన్ని ఎత్తివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. పెండింగ్ బకాయిలపై పూటకో మాట మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాట మాడుతుందన్నారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మణికంఠరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీ అరికట్టకుండా ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం వత్తాసు పలుకుతుందని, ప్రజాప్రతినిధులు సేవకులైతే వారి విద్యాసంస్థల్లో ఉచిత విద్య ఇవ్వాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు పేరుతో గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిని ప్రభుత్వం విస్మరిస్తుందని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి కేటాయింపు ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అధికారంలోకి వస్తే ఒకేసారి బకాయిలు విడుదల చేస్తామన్న రేవంత్‌రెడ్డి నేడు 18 నెలలు కావస్తున్నా నిర్లక్ష్యం చేస్తున్నారు. అన్ని బకాయిలను విడుదల చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం రూ.8 వేల కోట్ల బకాయిలను విడుదల చేయకుండా ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.
ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా ఉ న్న వారి విద్యాసంస్థలను ప్రభుత్వం వెంటనే ప్రభు త్వ విద్యాసంస్థలుగా మార్చాలని, అందులో ఉచిత విద్య అందించాలని, రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి ఆర్టీసీలో ఉచిత రవాణా అందించాలని, ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, విద్యార్థినులకు తక్ష ణమే ఎలక్ట్రిక్ స్కూటీలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెం టనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త మిలిటెంట్ ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చరమేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ కేశబోయిన రాము యాదవ్, కనకం సాగర్ తదితరులున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం :కలెక్టర్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వనమహోత్సవాన్ని పురస్కరించుకుని సారంగాపూర్ మండలంలోని చించోలి గ్రామ పంచాయతీలో శనివారం సామూహికంగా మొక్కలు నాటారు.కలెక్టర్ అభిలాష అభినవ్,అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,అధికారులు,గ్రామస్థులు పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ,పర్యావరణపరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమన్నారు. పరిరక్షించడంలోనూ ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని పేర్కొన్నారు.జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,ఎంపీడీఓ లక్ష్మీ కాంతం, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



## వాటర్‌వాల్స్‌పై తాత్కాలిక పైకప్పులు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/సిర్పూర్ (టి):** సిర్పూర్ మండలంలోని పాఠశాల సమీపంలోని ప్రమాదకర వాటర్‌వాల్స్‌పై ప్రజాపక్షం దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు తక్షణమే స్పందించారు. శుక్రవారం రోజున మండల విద్యాధికారి వేణుగోపాల్ స్వయంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పంచాయతీ కార్యదర్శి తిరుపతితో కలిసి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితిని తక్షణమే అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాటర్‌వాల్స్ వద్ద తాత్కాలికంగా కర్రలతో పై కప్పులు ఏర్పాటు చేసి చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతానికి ప్రమాదం నుంచి ఉపశమనం లభించింది.వారంరోజుల్లో శాశ్వత పరిష్కారంగా సిమెంట్‌తో తయారైన బిల్లలు తెచ్చి శాశ్వత పై కప్పులు ఏర్పాటు చేస్తాం అని పంచాయతీ కార్యదర్శి తిరుపతి పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా ఎదురవుతున్న సమస్యపై అధికారుల వేగవంతమైన స్పందన చూసి విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## రౌడీ షీటర్లు మారకపోతే చర్యలు

### బెల్లంపల్లి ఎసిపి రవికుమార్



**ప్రజాపక్షం / మందమర్రి :** రౌడీ షీటర్లు తమ నేర ప్రవృత్తిని వెంటనే విరమించుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ హెచ్చరించారు. శనివారం బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ మందమర్రి సర్కిల్ కార్యాలయంలో రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో నేరంలోకి జారిన తరువాత కూడా మారకుండా నేర ప్రవృత్తితో కొనసాగుతూ సమాజంలో రౌడీషీటర్లుగా మిగిలిపోతే సహించేది లేదని, ఇప్పటికైనా మారాలని, పోలీస్ శాఖ మంచి మార్పును గుర్తిస్తుందని, మీరు మంచి పనులు చేస్తే, అది రికార్డుల్లో మారుతుందని తెలిపారు. మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్ పటేల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి ఆరుగురు విద్యార్థులు

**ప్రజాపక్షం/ జన్నారం :** జన్నారం మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యకు అర్హత సాధించారు. రాథోడ్ యోగేశ్వర్, ఎల్పుల నరేందర్, కొత్త అనిల్, ముగల హారిక, కామెర హారిక, పెరుగు అక్షరలు సీటు సాధించారు. సీటు సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

## సమ్మెకు దూరంగా ఉండాలి

### సింగరేణి జిఎం దేవేందర్

**ప్రజాపక్షం / మందమర్రి :** జూలై 9న కార్మిక సంఘాల జెఎసి పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనకూడదని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి. దేవేందర్ సూచించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి విధులకు హాజరై సంస్థ లక్ష్యసాధనకు సహకరించాలని, సమ్మెకు పిలుపునిచ్చిన డిమాండ్లు సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావని, అలాగే వాటిని సింగరేణి యాజమాన్యం పరిష్కరించగలదని, సంస్థ పరిధిలోని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్నప్పుడు సమ్మెలో పాల్గొనడం అవసరం లేదు అని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంస్థ 72మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించిందని, జూలై 1 వరకు కేవలం 22.4 శాతం మాత్రమే సాధించగలిగినట్టు తెలిపారు. ఒకరోజు సమ్మె వల్ల సంస్థకు సుమారు రూ.76 కోట్ల ఉత్పత్తి నష్టం, కార్మికులు కోల్పోయే వేతనాలు రూ.13 కోట్ల వరకు ఉంటాయి. అలాగే దాదాపు 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇప్పటికే ఓవర్‌బర్డెన్ తొలగింపు పనుల్లో వెనుకబడి ఉన్నాం అని అన్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో వర్షాలు సాధారణంగా అధికంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఇప్పుడు ప్రతి రోజూ లక్ష్యసాధనకు కీలకం అని, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు సరఫరా నిరంతరంగా కొనసాగించాలంటే సమ్మెలకు దూరంగా ఉండాలని కోరారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తం



**ప్రజాపక్షం/కంటాల :** వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి రాజేంధర్ అన్నారు. శనివారం కుంటాల ప్రాథమిక ఆరోగ్య శనివారం కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.పాత భవనాన్ని పరిశీలించారు. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపటి వారం రోజుల్లో అందుబాటులో కి తెస్తామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పీఆర్ అధికారులు పనుల పర్యవేక్షణ చేపట్టి రోగుల కు ఇబ్బందులు ఎదురవ్వకుండా భవనాన్ని తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పిరశుభ్రత పాటించాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతిరెడ్డి, ఎంపీడిఓ లింబాద్రి, పంచాయతీ కార్యదర్శి రాజా బాపు, స్థానిక బిజేపి నాయకులు జక్కుల గజేంధర్, సిబ్బంది ఉన్నారు.

## బైంసాలో మావోయిస్ట్ వ్యతిరేక పోస్టర్లు కలకలం



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహానికి మావోయిస్ట్ వ్యతిరేక పోస్టరూ కలకలం రేపుతున్నాయి. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని సూచిస్తూ మావోయిస్టు ఆత్మరక్షణ ప్రజాపంట్ తెలంగాణ పేరిట పట్టణంలో పోస్టరు వెలువడడం ప్రజల్లో చర్చనీయాంశంగామారింది.మారిన కాలానికి అనుగుణంగా కాలం చెల్లిన సిద్ధాంతాలను ఆయుధాలను వీడి వారి మేధస్సును ఆలోచన విధానాలను ప్రజల అభివృద్ధికి ఉపయోగించి ప్రజాస్వామ్య గొంతుక కావాలని పోస్టర్లలో పేర్కొన్నారు.

# అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని సమావేశ మందిరంలో శనివారం ఆయన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్యల ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కులసంఘాల నాయకులతో అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ వివిధ శాఖల ద్వారా షెడ్యూల్డ్ కులాలు, తెగల వారి కోసం వెచ్చిస్తున్న నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.బాధితుల నుండి విజ్ఞాపనలు స్వీకరించారు.చైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పెట్టకుండా చూడాలన్నారు. నిధులు దుర్వినియోగమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేయాలని అధికారులకు హితవు పలికారు. ధీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సమస్యల పట్ల మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి జూలై మాసం నుండి కార్యాచరణ రూపొందించుకుని ప్రతి నెల చివరి శనివారం పౌర హక్కుల దినాన్ని నిర్వహించి తహసీల్దార్, పోలీస్ అధికారి తప్పనిసరిగా హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.జిల్లాలోనిసమస్యలను తెలుసుకునేందుకు వీలు గా మూడు మాసాలకోసారి డివిజనిన సమావేశాలు నిర్వహించి సంబంధిత శాఖల అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మూఢనమ్మకాలు, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీకి సంబంధించిన చట్టాలపై, అవి అందరికి సమానమనే విషయాన్ని అవగాహనకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా అంకిత భావంతో పని చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పక్కాగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, స్వయం ఉపాధి కార్యక్రమాలలో కూడా వాటాలకనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు లబ్ది చేకూరేలా చూడాలన్నారు. కార్పోరేషన్ ద్వారా వచ్చే పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే వారి పట్ల కఠిన చర్యలు చేపట్టాలని అన్నారు. కాగా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నోట్ బుక్కులు, టెక్స్ట్ బుక్కులు, ఏకరూప దుస్తులు అందేలా చూడాలన్నారు.అంతకుముందు ఐడీఓసీకి చేరుకున్న కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. కమిషన్ చైర్మన్, జిల్లా అధికారులు భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు నీలాదేవి, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహాతో, ట్రేనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారిని రజిత, అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అస్వస్థతకు గురైన ఆదర్శ కళాశాల విద్యార్థులు



**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలోని ఆదర్శ కళాశాలలో పలువురు విద్యార్థులు శనివారం అస్వస్థతకు గురయ్యారు. రుద్రూర్ మండలం అంబం గ్రామ ఆదర్శ కళాశాలలోని విద్యార్థులు అస్వస్థతకు గురై వర్ని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు భోజనం చేయకుండా కళాశాల వైద్య అధికారిని ఇచ్చిన ఐరన్ మాత్రలు వేసుకున్న తరువాత తమకు ఈ పరిస్థితి వచ్చిందని విద్యార్థులు వెల్లడించారు. కళాశాలలోని విద్యార్థులు 40మందికి పైగా ఐరన్ మాత్రలు వేసుకోగా మిగతా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఐదుగురు విద్యార్థినీలు వర్ని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ప్రాణాపాయం ఏమీ లేదని పరిస్థితి నిలకడగా ఉందని వర్ని వైద్యాధికారులు తెలిపారు.

## 4 నెలల పెండింగ్ వేతనాలు ఎప్పుడిస్తారు?




**ప్రజాపక్షం/బోధన్:** ఆస్పత్రిలో పనిచేస్తున్న కారప్పలకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని శనివారం బోధన్ జిల్లా ఆస్పత్రి ముందు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(ఎఐటియుసి) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాహుల్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం యూనియన్‌జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ.. బోధన్ జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్నటువంటి నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, శానిటేషన్ పాత టెండర్ కాల పరిమితి ముగియనున్నందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. బోధన్ జిల్లా ఆస్పత్రిని 200పడకలకు పెంచి శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.శంకర్, ఎం.నాగమణి, సతీష్ దేవేందర్, అనిల్, ఈశ్వర్, వెంకటేష్, సాయిలు, సుదర్శన్, కార్మికులు పాల్గొన్నారు.

## కళాశాలల మరమ్మతులకు నిధులు మంజూరు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల మరమ్మతులు, మంచినీటి వసతి, కరెంట్ రిపేర్లు ఇతర కనీస వసతుల నిమిత్తం 3 కోట్ల 23 లక్షల ఒక వెయ్యి రూపాయలను రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ శ్రీకృష్ణ ఆధిత్య మంజూరు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు 30 లక్షలు, నిజామాబాద్ ప్రభుత్వ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాలకు 56 లక్షలు, డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 14 లక్షలు, మాక్లూర్ ప్రభుఏత్వ జూనియర్ కళాశాలకు 10 లక్షలు, మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 26 లక్షల 35 వేలు, వర్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 20 లక్షల 50 వేలు, బోధన్ మధుమలాంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 10 లక్షల 70వేలు, ఆర్మూర్ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 16 లక్షలు, ఆర్మూర్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 24 లక్షలు మంజూరు అయ్యాయి.

## అటవీ రెవెన్యూ భూ సమస్యలు పరిష్కరించాలి

### మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** అటవీ, రెవెన్యూ భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ నగేష్ డీఎఫ్ఓ జోజి, ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్ రెడ్డి, జై చంద్రారెడ్డి, సంబంధిత తహసిల్దారు లతో టెలి కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి ఫారెస్ట్ రెవెన్యూ భూ సమస్యలపై చర్చించారు. అటవీ, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సమస్యలను రికాన్సిలేషన్ చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అటవీ భూములు, రెవెన్యూ భూములకు సంబంధించి అధికారులు జాయింట్ తనికి చేసి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. మండలాల వారీగా అసైన్మెంట్ రిజిస్టర్ వెరిఫై చేసి, పూర్తి స్థాయిలో తనిఖీ చేసి రిపోర్ట్ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏడి సర్వే ల్యాండ్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ చట్టాలపై ప్రచారం



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** జిల్లాలో బాలల సంరక్షణ చట్టాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ప్లాన్ ఇండియా, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభా గం సంయుక్తంగా బాలల సంరక్షణ మరియు చట్టపరమైన అవగాహనకార్యక్రమంలో భాగంగా, మొబైల్ వ్యాన్ ను ఆదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మెద క్ జిల్లా లోనీ పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో 6 రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఏసీడిపిఓ పద్మలత , జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ గంగాధర్, ప్లాన్ ఇండియా నుండి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాహుల్, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ సుజాత రాజ్, వెంకటేశ్వర్లు, సోషల్‌వర్కర్స్ మంజుల, భార్గవి, రవి, విమెన్ ఎంపవర్మెంట్ హబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం

### ఎమ్మెల్యే రామారావు పటేల్

**ప్రజాపక్షం/ముధోల్ :** అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ సూచించారు.శనివారం నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లోని క్యాంపు కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి , షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభ్వుతం కొలువుదీరిన నాటి నుండి ఇప్పటివరకు కళ్యాణ లక్ష్మి ,షాదీముబారక్ చెక్కులను ఐదవ సారి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాలను త్వరగా అందేలా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందని పేర్కొన్నారు.దాదాపు 37 కళ్యాణలక్ష్మి ,షాదీముబారక్ చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు అందించారు. కళ్యాణ లక్ష్మి ,షాదీముబారక్ నిదులను తక్కువ సమయంలోనే ప్రభుత్వం మంజురు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు.ఇవే కాకుండా కొత్తగా పెళ్లయిన 106కళ్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో మంజూరు చేసేలా తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు ముధోల్ నియోజకవర్గ కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని వెల్లడించారు.ప్రభుత్వం సైతం ఎన్నికల ముందు ఇచ్చిన ఒక తులం బంగారం హామీని మరవొద్దని గుర్తుచేశారు.ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న బ్రహ్మన్ గాం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రస్తావనను అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 5 కోట్ల 88 లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని వివరించారు. దీంతో త్వరలో 5 నుండి 6వేల ఎకరాల వరకు సాగునీరు అందనుందన్నారు.నియోజకవర్గ రైతుల తరపున వారికి ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా తమ నియోజకవర్గ అభివృద్ధి కొరకు నిధుల మంజూరుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇంచార్జ్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తదనంతరం బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ షిందే ఆనంద్‌రావు పటేల్,ముధోల్ డివిజన్ ఆత్మ చైర్మన్ గన్ను నర్సారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీని మరవదని ఇది ప్రజాప్రభుత్వం అని గుర్తుచేశారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయడంతో ఎన్ని ఆటంకాలు ఎదురైన బెదరకుండా ఇచ్చిన హామీలకు కట్టుబడి తమ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు.కళ్యాణ లక్ష్మి ,షాదీముబారక్ పథకంలో భాగంగా ఇచ్చిన ఒక తులం బంగారం హామీని త్వరలోనే నెరవేరుస్తుందని తెలిపారు.ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించాలని కోరారు. తహసీల్దార్ శ్రీలత,మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న,మాజీసర్పంచ్ శ్రీనివాస్, రామ్ చందర్,ఎంపీటీసీ లక్ష్మి నారాయణ, బీజేవైఎం అధ్యక్షుడు సూర్యవంశీ శ్రీధర్ పటేల్, బీజేపీ మం డల కోఆర్డినేటర్ కాసారం శ్రీకాంత్, నాయకులు తాటివార్ రమేష్, జీవన్, బత్తినోళ్ల సాయినాథ్, దత్తాత్రి, సంతోష్, మోహన్ యాదవ్ ఉన్నారు.

## పాఠశాలలో శుభ్రత, పారిశుద్ధంపై నిరంతర పర్యవేక్షణ

### సంగారెడ్డి కలెక్టర్ పి. ప్రావీణ్య



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సాంఘీక సంక్షేమ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు పరిశుభ్రత ,ఆహార నాణ్యత , బోధన విదానాన్ని పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలు అవసరాలు అభిప్రాయాలు స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థుల భద్రత మౌళిక వసతుల మెరుగుదల కోసం నిరంతరం నిఘా ఉంచాలని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు విద్యార్థులతో మాట్లాడుతూ వారిని పరిశీలిస్తూ ఉండాలన్నారు. పాఠశాలలో శుభ్రత పారిశుద్యంపై రోజు వారీ పర్యవేక్షణ నిర్వహించాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని కష్టపడి చదవి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో సత్తా చాటిన 'నిజామాబాద్' విద్యార్థులు

### జిల్లాలో డొంకేశ్వర్ మండల టాప్.. 41మంది సెలెక్ట్

### డొంకేశ్వర్ జెడ్‌పిహెచ్‌ఎస్ నుంచి 26మంది విద్యార్థులు




**ప్రజాపక్షం/ఎడపల్లి:** బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల్లో అత్యధిక మంది నిజామాబాద్ జిల్లా నుంచే ఉండటం విశేషం. ఈ ఏడాది బాసర ట్రిపుల్ ఐటిలో మొత్తం 1690మంది విద్యార్థులు ప్రవేశానికి అర్హత సాధించగా, నిజామాబాద్ జిల్లా నుంచి ఏకంగా 297మంది విద్యార్థులు ఎంపికై రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఇది జిల్లా విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది. రెండవ స్థానంలో సంగారెడ్డి జిల్లా నిలవగా, ఆ జిల్లా న ఉంచి 222మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కామారెడ్డి జిల్లా నుంచి 128మంది విద్యార్థులు ఎంపికై మూడవ స్థానంలో నిలిచారు. దురదృష్టవశాత్తు వనపర్తి జిల్లా నుంచి కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే ఎంపికై చివరి స్థానంలో నిలిచింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యార్థులు సాధించిన ఈ అద్భుత విజయం జిల్లాలోని విద్యా సంస్థలకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు గర్వకారణం. భవిష్యత్తులో ఈ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకవస్తారని ఆశిద్దాం. ఇదిలా ఉండగా కేవలం ఒక్క డొంకేశ్వర్ మండలం నుంచి 41మంది విద్యార్థులు బాసర ట్రిపల్ ఐటికి ఎంపికై జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో డొంకేశ్వర్ మండలం అగ్రస్థానంలో నిలిచింది. డంకేశ్వర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి 26మంది విద్యార్థులు ఎంపిక కాగా, తొండాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి 9మంది, నికాల్పూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి ఐదుగురు, గాదేపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నుంచి ఒక్కరూ ఎంపికయ్యారు.

## లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి : కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజోపయోగ కార్యక్రమాలను పకడ్బంధీగా అమలు చేస్తూ నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వనమహోత్సవం, సీజనల్ వ్యాధులు, నివేశన స్థలాల క్రమబద్ధీకరణ అంశాలపై మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమీషనర్లు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వైద్యాధికారులు, హౌసింగ్ ఏఈలు, ఐకెపి ఎపియంలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని లబ్ధిదారులకు ఐకెపి మెప్మా ద్వారా ఆర్థిక తోడ్పాటు కోసం అవసరమైన రుణాలు మంజూరు చేయిస్తూ ఇల్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్‌డీఓ సాయగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీయంఅండ్‌హెచ్ డాక్టర్ రాజశ్రీ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఆసిఫ్‌నగర్ రోడ్డును పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ సిరిసిల్ల రహదారిలో బావుపేట వద్ద డ్రైనేజీ నీరు వెళ్లే దారి లేక రోడ్డుపై వరద నీరు నిలవడంతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. మ్యాపును పరిశీలించి డ్రైనేజీ నీరు వెళ్లేందుకు పలు సూచనలు చేశారు. తాత్కాలికంగా నాలా ఏర్పాటు చేసి నిల్వ ఉన్న నీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాల వాఖ డీఈని, ఎంపిడివోను ఆదేశించారు. శాశ్వత పరిష్కారం కోసం రూ.90 లక్షలతో డ్రైనేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి డీఈ కిరణ్, కొత్తపల్లి తహసీల్దార్ ఆర్.వెంకటలక్ష్మి, ఎంపిడివో శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



## ‘ఎక్కడి చెత్త.. అక్కడే..’కథనానికి స్పందన

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ముత్తారం:** ప్రజాపక్షం దినపత్రికలో శనివారం ప్రచురించిన" మారని పంచాయతీ తీరు! ఎక్కడి చెత్త.. అక్కడే.. అనే వార్త కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని గ్రామపంచాయతీ సిబ్బందిచే తొలగించి, డ్రైనేజీలు శుభ్రపరిచారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో గత కొద్దిరోజులుగా అధ్వానంగా డ్రైనేజీలు, రోడ్లపై చెత్తాచెదారం ఉండడంతో ప్రజాపక్షం దినపత్రిక వార్త కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించి గ్రామంలో గ్రామపంచాయతీ సిబ్బందిచే చెత్తను తొలగిస్తూ డ్రైనేజీలు శుభ్రపరిచే పనులు చేయించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ.. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజాపక్షం ప్రచురించి సమస్యను పరిష్కరించిన దినపత్రికను గ్రామస్తులు హర్షిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇవిఎం గోడౌన్‌ను, కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ ఇవిఎం గోడౌన్‌ను ,కేంద్రంను శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఇవిఎం భద్రతకు సంబంధించి ప్రతి నెలలో తనిఖీ చేస్తున్నామని, ఇవిఎం గౌడ్ కేంద్రంను సందర్శించడం జరిగిందని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత, జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధసూధన్, ఎలక్షన్ సూపరింటెండెంట్, జగిత్యాల , అర్బన్ తహసీల్దార్ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు

## తైక్వాండో చాంపియన్స్‌ను అభినందించిన బండి



**ప్రజాపక్షం/చొప్పదండి:** జూన్ 23 నుంచి 25వ తేదీ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరిగిన జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కరీంనగర్ జిల్లా చొప్పదండి పట్టణానికి చెందిన పడకంటి కాశీవిశ్వనాథ్, బూసారపు వెంకటేష్ గౌడ్, స్పందన, సౌమ్య, రాంచరణ్ అనే విధ్యార్థులు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి 7 గోల్డ్, 1 సిల్వర్, 1 రజత పతకాలు సాధించారు. ఈ సంధర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ విధ్యార్థులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విధ్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, పార్లమెంటు పరిధిలోని చొప్పదండి పట్టణ విధ్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్తి గోల్డ్ మెడల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. విధ్యార్థులు కష్టపడి బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పదవ తరగతి చదువుతున్న విధ్యార్థులందరికీ ఉచితంగా సైకిల్‌లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చిల్ల శ్రావణ్, కోచ్ శ్రీగాధ సంతోష నేషనల్ రెఫరీ రమ్య, పిల్లల తల్లిదండ్రులు పడకంటి రాజు, శ్రీగాధ లక్ష్మణ్, బూసారపు శ్రీనివాస్ తదితరులున్నారు.

## జర్నలిస్టు ప్రసాద్ హఠాన్మరణం బాధాకరం: రాష్ట్ర ప్రభుత్వ విప్

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన టివి9 రిపోర్టర్ ప్రసాద్ ఆకస్మిక మరణం పట్ల రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రసాద్ మరణం జర్నలిస్టు లోకానికి తీరని లోటని, చిన్న వయస్సులో మరణించడం బాధాకరమన్నారు. వారు మీడియా రంగంలో పనిచేస్తూ జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి ప్రజా సమస్యలను మీడియాతో పరిష్కరిస్తూ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ సమయంలో వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

## ఆల్ఫోర్స్ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ ఉత్సవం



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ జరుపుకుంటారని ఈ పండుగకు చాలా విశిష్టత ఉన్నదని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేంధర్‌రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల పట్టణంలోని శివవీధి లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ఆషాడ మాసం సందర్భంగా అత్యంత భక్తిశ్రద్దలతో కన్నుల పండుగగా బోనాల పండుగ నిర్వహించడం జరిగింది. నవదుర్గ చిత్రపటానికి పూలమాల వేసి ఉత్సవాలను ప్రారంభించారు. విద్యార్థ ప్రదర్శించినటువంటి ఓ తల్లి మైసమ, ్మ పోచమ్మ తెచ్చావమ్మ, బోనం అమ బోనమే మా దైవం నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. సుమారు 50 మంది విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి బోనాలను ఎత్తుకొని పండుగ వాతావరణం నెలకొంది. పోతరాజుల వేషధారణలు వివిధ అమ్మవారి వేషధారణ అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి నరేంధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బోనా లపండుగ అత్యంత ప్రీతికరమైనదని, తరాతరాలనుండి అవలంబిస్తున్నా ఈ ఘనమైనటువంటి సాంప్రదాయం ఎటువంటి లోటు పాటు లేకుండా కొనగసాగించడం చాలా శుభ పరిణామమని అందరికి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల్లో జర్నలిస్టు భాగస్వామ్యం చేస్తాం



రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్ట్ లను ప్రభుత్వ పథకాలలో భాగస్వాములను చేస్తామని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వపరంగా తనవంతుగా కృషి చేస్తానని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.శనివారం మంథని ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జర్నలిస్టులు అందరికీ భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. రాజకీయాలకతీతంగా పాత్రికేయులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పత్రికలు ప్రజలకు వారధిగా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజల సంక్షేమం ఈ ప్రాంత అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై పాత్రికేయులు తమ ఆలోచన విధానాన్ని వార్తల రూపంలో అందజేయాలని కోరారు. మంథని ప్రాంత జర్నలిస్టుల సమస్యల కోసం తాను రాజకీయాలకు వచ్చినప్పటి నుంచి కృషి చేస్తున్నట్లు తెలిపారు గతంలో వారి అభివృద్ధి కోసం అనేక విధాలుగా సహకరించానన్నారు. మంథనిలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి సీఎస్ఆర్ నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. పాత్రికేయులకు ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ యువ వికాస్ పథకాల మంజూరు కోసం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును ప్రెస్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల టియుడబ్ల్యూజే జిల్లా ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షుడు కొమురోజు చంద్రమోహన్, కోశాధికారి తగరం రాజు, కార్యవర్గ సభ్యులు లక్కాకుల నాగరాజు లను శాలువాలతో మంత్రి శ్రీధర్ బాబు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్, ఉపాధ్యక్షులు బర్ల సంపత్, ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, సహాయ కార్యదర్శి గంధం అంజిబాబు, ప్రెస్ క్లబ్ సభ్యులు అంకరి ప్రకాష్, కంది కృష్ణారెడ్డి, ఆర్ల బాబు, పెండ్యాల రామ్ కుమార్, బాసాని సాగర్, ఒజ్జల శ్రీనివాస్, లింగాల సురేష్, దొరగొర్ల రవీందర్, కేసారపు రవి, బండారి సమ్మయ్యలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడేది సిపిఐ ఒక్కటే

సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల మధ్య నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాడే పార్టీ సిపిఐ అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం సుభాష్ నగర్ రాజన్న సిరిసిల్ల సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం పంతం రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి చాడా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా సమస్యలే అజెండాగా ఆర్థిక అసమానతలు లేని సమసమాజ స్థాపన కొరకు ఎర్రజెండా పోరాటం చేస్తుందన్నారు. శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికే భూమి కావాలని శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచానికి విప్లవ పాఠాలు నేర్పిన నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని ఎరువులు విత్తనాలు సబ్సిడీపై ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సెక్యులర్ సోషలిజం పదాలంటే బిజెపి ఆర్ఎస్ఎస్‌కి భయం పట్టుకుందని గత 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కులాలు మతాలు రెచ్చగొడుతూ పాలిస్తుందన్నారు. ఆపరేషన్ కగార్‌పేరుతో చేస్తున్న మారణ హోమాన్ని ఆపాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఐ కాంగ్రెస్ పొత్తును మిత్ర ధర్మంగా ప్రభుత్వ పథకాల్లో సిపిఐ కార్యకర్తలకు అవకాశం కల్పించాలని, పొత్తులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, నాయకులు గుంటి వేణు, కడారి రాములు,మీసం లక్ష్మణ్, మంద అనిల్,ఎలిగేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం

మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మైదంబండ వద్ద రామగిరి మండలంలోని సాయి ప్రగతి ప్రైవేటు పాఠశాల బస్సు ఆటోను ఢీకొట్టగా అందులో గాయపడిన క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం కోసం కరీంనగర్ లోని మేడ్ కేర్ ఆస్పత్రిలో నాణ్యమైన మెరుగైన వైద్యం పరీక్షలు అందిస్తున్నట్లు ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు తెలిపారు. గాయపడిన వారి కుటుంబ సభ్యులతో మంత్రి శ్రీధర్ బాబు చరవాణి ద్వారా మాట్లాడి ఎవ్వరు అధర్యపడవద్దని గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. అనంతరం గాయపడిన ఆటోడ్రైవర్ గడిచర్ల శంకర్ తో పాటు కేషనపల్లి గ్రామానికి చెందిన మహిళ కూలీలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చోప్పరి సదానందం,పోతారం గ్రామ మాజీ సర్పంచ్ నెత్తెట్ల మహేందర్ యాదవ్ తో పాటు మాజీ సర్పంచ్ వేల్పూరి సంపత్ రావు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం /ధర్మపురి :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండల కేంద్రంలో శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శిథిలావస్థకు చేరిన పురాతన ప్రభుత్వ ఉన్నత పాఠశాల గదులను పరిశీలించి తక్షణమే 6గదులను కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని రహదారులను, డ్రైనేజిలను పరిశీలించిన కలెక్టర్ పారిశుద్ధ్య చర్యలు ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసి నదినీటి మట్టం పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణానికి అనుగుణంగా డబ్బులు జమ అవుతుందని త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ధర్మపురి మున్సిపాలిటి ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలను సంరక్షించడం అందరి బాధ్యతగా చెప్పారు. స్వయం ఉపాధితో అగరుబత్తులు, ఇతర పూజా సామాగ్రి తయారీ దారులను కలిసి తయారు విధానాన్ని పరిశీలించి మరింత నాణ్యతతో మార్కెట్‌లో నిలదొక్కుకోవాలని సూచించారు.ధర్మపురిమున్సిపల్‌కమిషనర్‌శ్రీనివాస్‌రావు, ఇన్‌చార్జీ తహసీల్దార్ సుమన్, ఎంపిడిఓ రవీందర్ పాల్గొన్నా రు.

**రోగులకు మెరుగైన సేవలు అందించాలి**

పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, సదుపాయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అవసరమైన మందులు నిలువ ఉంచుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణం వేగవంతం చేయాలని, పనుల నాణ్యతపై రాజీ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి

ఆల్ఫోర్స్ అధినేత వి. నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం /సుల్తానాబాద్:** పాఠశాల స్థాయి నుం చి విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందు కు ఆల్ ఫోర్స్ ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని అధినేత నరేందర్ రెడ్డి అన్నా రు. శనివారం సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ధ్రువ, లక్ష్య, సరస్ ,తేజస్ గ్రూపులకు హౌస్ ఎలక్షన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యార్థులకు అన్ని రంగాల్లో తర్ఫీదు ఇచ్చేందుకు నిష్ణాతులైన అధ్యాపకులచే విద్యాబోధన చేస్తున్నామని అందులో భాగంగానే వివిధ అంశాలపై పోటీలు నిర్వహించేందుకు పాఠశాలలో నాలుగు గ్రూపులను ఏర్పాటు చేసి, ప్రతి ఏటా ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు.ఎన్నికల తతంగాన్ని తలపించే విధంగా విద్యార్థుల ను ఓటింగ్ ద్వారా కెప్టెన్, వైస్ కెప్టెన్లను ఎన్నుకోవడంతో గ్రూపుల మధ్య పోటీతత్వం ఏర్పడుతున్నారు. పోటీల్లో నిలబడ్డ విద్యార్థులు తమకు ఓటు వేయాలని అభ్యర్థులు నిర్వహించిన ప్రచారం ఎన్నికల వాతావరణాన్ని తలపించాయి. ఈ ఎన్నికలలో విద్యార్థులు తమ యొక్క ఓటు హక్కును విధిగా ఉపయోగించుకున్నారు చిన్నతనంలోనే ఓటు హక్కును వినియోగించుకోవడంతో చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు.దీంతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవాడతాయని భవిష్యత్తులో మంచి రాజకీయ నాయకులు ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ,విద్యార్థులతో పాటు, ప్రిన్సిపల్, ఆధ్యాపబృందం, తదితరులు పాల్గొన్నారు.

## ‘కరీంనగర్’ను నెంబర్ 1గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో అభివృద్ధిపనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికోసం ఇప్పటి వరకు రూ.20 వేల కోట్లకు పైగా నిధులను ఖర్చు చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్ర మంత్రిగా మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం రాజకీయ పార్టీలకతీతంగా స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. శనివారం హుజురాబాద్ నియోజకవర్గంలో పర్యటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆయనతో కలిసి జాతీయ ఉపాధి పథకం కింద జమ్మికుంట మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో రూ.78 లక్షల వ్యయంతో నిర్మించిన 13 అంతర్గత రోడ్లను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రోడ్లకు అత్యధిక ప్రాధాన్యత నిస్తోందని, తాను ఎంపిగా, కేంద్ర మంత్రిగా ఉంటూ ఎక్కువ నిధులు కరీంనగర్ పార్లమెంటుకు తీసుకొచ్చానంటే అవి రోడ్ల కోసమేనన్నారు. అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పార్లమెంటు పరిధిలో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగాఉన్నానని, సహకరించాలని మీడియాతో కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో కరీంనగర్ జిల్లా వైస్ చైర్మన్ పింగిలి రమేష్, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్‌రావు, మండల అధ్యక్షులు కోలకాని రాజు, ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, బిఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తదితరులున్నారు.

## జూనియర్ కళాశాలల్లో నమోదు పెంచాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** జిల్లాలోని ప్రభు త్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ పమేలా సత్పతి అ న్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో శనివారం స మావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ప్రతి విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చేలా ప్రోత్సహించాలని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి అడ్మిషన్లు పెంచాలన్నారు. అన్ని ప్రభు త్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయా లు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ వసతిగృహా ల్లో జూనియర్ కాలేజీ విద్యార్థుల వసతి అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఒకేషనల్ కోర్సులు చదివే వి ద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారికి అవసరమైన మెటీరియల్‌ను జిల్లా యంత్రాంగం ను ంచి సమకూరుస్తామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులకు తదుపరి ఉన్నత విద్యలో ఉచితంగా ప్రవేశాలు, అనేక అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి వెసులుబాట్ల ను తెలియజేసేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలు ఉన్నచోట్ల ఆ ర్‌టిసి రిక్వెస్ట్ స్టాప్ అంశాన్ని అధికారులతో చర్చిస్తామని తెలిపారు. అనంతరం పదవ తరగతి, ఇం టర్ ఓపెన్ స్కూల్ దరఖాస్తు మార్గదర్శకాలకు సం బంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. సమావేశం లో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి .గంగాధర్, ఓపెన్ స్కూల్ ప్రిన్సిపాల్ , ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

## గురుకులాలను పరిశీలించిన కలెక్టర్ హైమావతి





**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే హైమావతి హుస్నాబాద్ పట్టణం, మండల పరిదిలోని పలు గురుకులాలకు శనివారం పరిశీలించారు. మందుగా పట్టణంలోని హుస్నాబాద్ పట్టణంలోని తెలంగాణ గిరిజన సాంఘీక పాఠశాలను మరియు జూనియర్ కాలేజీని కలెక్టర్ పరిశీలించారు. అలాగే జిల్లెల గడ్డలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర మరియు జూనియర్ కాలేజీని పరిశీలించి అక్కడ ఉన్న పరిసరాలను చాల బాగున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే పోతారం గ్రామ సమీపంలోని మహత్మజ్యోతీ బాపూలే తెలంగాణ బి సి బాలికల గురుకుల పాఠశాలను అకస్మికంగా పరిశీలించారు. అనంతరం అల్పసంఖాక బాలికల గురుకుల పాఘశాలను మరియు జూనియర్ కళాశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురుకులాల్లో మెను ప్రాకారం పిల్లకు అహారం అందించాల ని అలాగే సమయపాలన పాటిస్తు రుచికరమై భోజనం అందించాలని కొరారు, పిల్లల పట్ల అప్రమత్తగా ఉండాలని ముఖ్యంగా బాలిక భద్రత అతి ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా రోజువారి సమయపాలన రిజిష్టర్‌ను పరిశీలించారు. పిల్లలకు ప్రతి నెల అర్ బి ఎస్ కే పరిక్షలు నిర్వహించి వీక్‌గా ఉన్న వారికి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పలు పాఠశాలల్లో పిల్లలతో ఉపాధ్యాయుల భోధన పై పిల్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనం నాణ్యతను పరిశీలించారు.

**సిద్దిపేటప్రతినిధి:** విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు.శనివారం జిల్లాని సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బిసి బాలికల పాఠశాల జూనియర్ కళాశాలను,నారాయణరావుపేట మండలం గుర్రాలగొంధీలో తెంగాణ సాంఘీక సంక్షేమ శాఖ బాలుర పాఠశాలను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.ఈ సంధర్భంగా విద్యార్థులతో మాట్లడి సమస్యలను అడిగి తెలుసున్నారు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ వసతి గృహల్లో వంట గదిని ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని,వసతి గృహల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు.

# రీల్

## '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' ఫస్ట్ లుక్ విడుదల




సప్త సాగరాలు దాటి సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్ రావు, తాజాగా '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' అనే టైటిల్‌తో ఒక సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో పుష్ప చిత్రంలో అలరించిన నటుడు డాలీ ధనుంజయ నటిస్తుండగా.. కన్నడ చక్రవర్తి శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. జె.ఫిలమ్స్ పతాకంపై వైశాక్ గౌడ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుండి డాలీ ధనుంజయ్ న్యూ లుక్‌ను విడుదల చేసారు. డిఫరెంట్ లుక్‌లో ఉన్న ధనుంజయ్ లుక్ కు మంచి రెస్పాన్స్ లభిస్తోంది. పుష్ప 12 చిత్రాలతో పాపులర్ అయిన డాలీ ధనుంజర్ 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ చిత్రంలో డిఫరెంట్ రోల్‌లో నటించారు. జైలర్ 2, పెద్ది చిత్రాల్లో నటిస్తోన్న శివరాజ్ కుమార్ ఈ సినిమాలో మరో విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. చరణ్ రాజ్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమాకు అద్వైత గురుమూర్తి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. విశ్వాస్ కశ్యప్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎమోషన్స్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్ '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' చిత్రం కన్నడతో పాటు తెలుగులో ఒకేసారి విడుదల కాబోతోంది.

## 'బకాసుర రెస్టారెంట్' టైటిల్ ర్యాప్ సాంగ్ ఆవిష్కరణ






తన నటనతో, డైలాగ్ డెలివరితో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాందించుకున్న క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్', ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలోని బకాసుర టైటిల్ ర్యాప్ సాంగ్‌ను బ్లాక్‌బస్టర్ మాస్ దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. వికాస బడిస సంగీతం సమాకూర్చిన ఈ పాటను ర్యాప్ సింగర్ రోల్ రైడ్, వికాస బడిస ఆలపించారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ '' బకాసుర రెస్టారెంట్ టైటిల్‌తో పాటు ఈ పాట కూడా బాగుంది. చాలా కొత్తగా అనిపించింది. ఈ సినిమా ఐడియా బాగుంది. నటుడు ప్రవీణ్ నాకు మొదట్నుంచి తెలుసు. ప్రవీణ్ హీరోగా రాబోతున్న ఈ చిత్రం మంచి సక్సెస్ కావాలి. తొలి చిత్ర దర్శకుడు ఎస్‌జే శివతో పాటు అందరికి ఈ చిత్రం మంచి పేరును తీసుకరావాలి' అన్నారు.


## మరో ఆఫర్ పట్టేసిన పూజా హెగ్డే !



టాలీవుడ్‌లో కొన్నాళ్ల కితం వరుస బ్లాక్ బస్టర్ హిట్స్‌తో అదరగొట్టిన స్టార్ హీరోయిన్స్‌లో పూజా హెగ్డే కూడా ఒకరు. మరి పూజా హెగ్డే హీరోయిన్‌గా మళ్ళీ కొంత కాలం తర్వాత సిల్వర్ స్క్రీన్ పై బిజీగా మారింది. అయితే ఎక్కువగా తమిళ్ లోనే సినిమాలు చేస్తున్న పూజా హెగ్డే రీసెంట్ గానే 'రెట్రో' సినిమాలో సూర్య సరసన కనిపించింది. ఇక ఇవి కాకుండా తమిళ్ లోనే కూలీ, ఇంకా జన నాయగన్ లాంటి భారీ సినిమాల్లో కూడా ఆమె నటించిన సంగతి తెలిసిందే. మరి ఈ ప్రాజెక్ట్‌లు కాకుండా మరో సాలిడ్ ప్రాజెక్ట్‌ని ఆమె పట్టేసినట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. దీని ప్రకారం పూజా హెగ్డే నెక్స్ట్ హీరో ధనుష్ సరసన కనిపించనున్నట్టుగా తెలుస్తుంది. ధనుష్ లేటెస్ట్‌గా కుబేరతో హిట్ కొట్టాడు అలాగే తన హిందీ సినిమా ఒకటి పూర్తి చేసుకున్నాడు. మరి ఫైనల్‌గా తన నెక్స్ట్ సినిమా కోసం కూడా సిద్ధం అవుతుండగా అందులో పూజా నటించనున్నట్టు ఇపుడు తెలుస్తుంది. ఇక దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

## నటుడు ఫిష్ వెంకట్‌కు సహాయం చేయండి


### – కుమార్తె వేడుకోలు



రెండు కిడ్నీలు పాడయిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నటుడు ఫిష్ వెంకట్‌కు సహాయం చెయ్యాలని ఆయన కుమార్తె స్రవంతి విజ్ఞప్తి చేశారు. గత కొద్దీ కాలంగా ఫిష్ వెంకట్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు కిడ్నీలు పాడైపోయి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో చికిత్స కోసం ఎవరైనా సహాయం చెయ్యాలని స్రవంతి తెలిపారు. అయితే ప్రభాస్ సాయం చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఆయన కూతురు చెబుతున్నారు. ప్రభాస్ పిఎ అని ఒకరు కాల్ చేశారు. వివరాలు తెలుసుకొని సాయం చేస్తా అన్నారు కానీ, ఇప్పటి వరకు వారి నుంచి ఎలాంటి సాయం అందలేదు. తమకు వచ్చిన నెంబర్‌కు కాల్ చేసినా ఎవరు లిఫ్ట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఫేక్ కాల్స్‌తో కాలయాపన చేసే సమయం కాదని, తండ్రి ఫిష్ వెంకట్ ఆరోగ్యం రోజురోజుకి క్షిణిస్తుందని ఆమె అన్నారు. సాయం చేసేవాళ్లు ఎవరైనా సహాయం చెయ్యాలని ఆమె వేడుకున్నారు. ఈ మేరకు ఒక వీడియోను మీడియాకు విడుదల చేశారు.

## వైరల్ వయ్యారి నేనే వయసొచ్చిన అణుబాంబు నేనే

### జూనియర్ నుంచి పాట రిలీజ్



ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా పరిచయం అవుతున్న సినిమా జూనియర్. రాధా కృష్ణ దర్శకత్వంలో వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ జూలై 18న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి 'వైరల్ వయ్యారి నేనే వయసొచ్చిన అణుబాంబు నేనే' అనే పాటను ఆవిష్కరించారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. దేవిశ్రీ హరిప్రియ ఇద్దరూ పాడిన స్టైల్ సాంగ్‌ని ఇంకో లెవల్‌కి తీసుకెళ్లింది. ఈ పాటను కళ్యాణ్ చక్రవర్తి రాశారు. యూత్‌ను బాగా ఆకట్టుకునేలా ఈ పాత సాగుతుంది. కిరీటి రెడ్డి, శ్రీలీల కలిసి డాన్స్ అదరగొట్టారు. కిరీటి స్టెప్పుల్లో గ్రేస్ చూపిస్తే, శ్రీలీల తన అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆకట్టుకుంది. అందమైన సెట్స్‌లో షూట్ చేసిన వైరల్ వయ్యారి పాట క్యాచీ మ్యూజిక్, ట్రెండీ లిరిక్స్, కలర్ ఫుల్ విజువల్స్‌తో ఈ సాంగ్ ఈ ఏడాది వైరల్ చార్ట్‌బస్టర్ హిట్ కానుందని నిర్మాత రజని కొర్రపాటి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సినిమాకి కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ, నిరంజన్ దేవరమనే ఎడిటర్. కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని డైలాగ్ అందిస్తున్నారు.

## 11న వస్తున్న 'మై బేబీ'





తమిళ నటుడు అథర్వ, నిమిష సజయన్ హీరో హీరోయిన్లుగా నెల్సన్ వెంకట్ దర్శకత్వంలో తెరకెక్కిన మై బేబీ సినిమాను తెలుగులో విడుదల హేస్తున్నారు. కుటుంబంలో ఉండే సమస్యల నేపథ్యంలో రూపొందించిన ఈ సినిమాను ఈనెల 11న విడుదల చేయనున్నామని నిర్మాత సురేష్ కొండేటి తెలిపారు. ఫ్యామిలి ఉండే ఎమోషన్స్ ప్రధానంగా ఈ సినిమాను తెరకెక్కించారని అన్నారు. తమిళంలో నిర్మించిన ఈ సినిమాను తెలుగులో విడుదల చేయడానికి హక్కులు కొనుగోలు చేశానని సురేష్ కొండేటి అన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే సినిమా అవుతుందని చెప్పారు. ప్రేమిస్తే సినిమా తరువాత అంతటి ఫీల్ గుడ్ మూవీ అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఓ భామ అయ్యో రామ ట్రైలర్ విడుదల



సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. హీరో సుహాస్, మాళవిక మధ్య వచ్చే లవ్ సీన్స్ కూడా అలరించే విధంగా ఉంటాయి. సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. జూలై 11న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం అని ఆయన అన్నారు. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు. మణికందన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్ని సమాకూరుస్తున్నాడు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## 'కొత్తపల్లిలో ఒకప్పుడు' టీజర్ రిలీజ్



రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, మీనింగ్ ఫుల్ ఎంటర్ టైనింగ్ సినిమాలకి సపోర్ట్ తో తెరకేకించిన సినిమా 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి దర్శకత్వంలో రూపొందించిన ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మనోజ్ చంద్ర అనే పాత్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపిస్తాడు. అతను డ్యాన్స్ పార్ట్నర్ కోసం వెతుకుతున్నప్పుడు ఊహించని సమస్యలలో చిక్కుకుంటాడు. ఇలాంటి కథతో కొత్తదనంగా చెప్పే ప్రయత్నం చేసిన సినిమా ఇది. గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఈ చిత్రమని దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెలిపారు. ఈ చిత్రంలో మోనికా, ఉషా బోనెల కూడా ప్రముఖ పాత్రల్లో నటించారు. గురుకిరణ్ బత్తుల కథ, సంభాషణలను అందించారు. దాదాపుగా అన్ని పనులు పూర్తి కావచ్చిన ఈ సినిమాను జూలై 18న థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇతర పాత్రల్లో రవీంద్ర విజయ్, బెనర్జీ, బొంగు సత్తి, ఫణి, ప్రేంసాగర్ నటిస్తున్నారు.

## సుప్రీంకోర్టుకు 'ఎడిఆర్'

(మొదటి పేజీ తరువాయి)

స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలకు అంతరాయం కలిగించగలదని పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఆర్డర్‌లోని డాక్యుమెంటేషన్ అవసరాలు, తగిన ప్రక్రియ లేకపోవడం, బిహార్‌లో ఓటర్ల జాబితా నిర్దిష్ట ఇంటెన్సివ్ సవరణకు అసమంజసంగా తక్కువ సమయం ఉండటం వల్ల ఈ కసరత్తు లక్షలాది మంది నిజమైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని, ఇది వారి ఓటు హక్కును కోల్పోయేలా చేస్తుందని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. బిహార్‌లో ఇటువంటి సవరణ 2003లో జరిగింది. ఎన్నికల సంఘం ప్రకారం.. శరవేగంగా నగరీకరణ, తరచూ వలసలు, యువ పౌరులు ఓటుకు అర్హులైన వారి వివరాలు, మరణాలకు సంబంధించిన వివరాలు, విదేశాలకు అక్రమ వలసదారుల పేర్లను చేర్చడం వల్ల ఈ కసరత్తు చేయడం తప్పనిసరి అవసరమైంది.ఈ కసరత్తుతో దోషరహిత ఓటర్ల సమగ్ర జాబితాను తయారుచేయాలనుకుంటున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ధృవీకరణ కోసం ఇంటింటి సర్వే నిర్వహించేందుకు బూత్ అధికారులచే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించబడుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, 1950 ప్రజాప్రాతినిథ్య చట్టంలోని సెక్షన్ 16లో పేర్కొన్న రాజ్యాంగ చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తామని ఎన్నికల సంఘం తెలియజేసింది.

## 2036 ఒలంపిక్స్ పతకాలే లక్ష్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఒలంపిక్స్ పతకాలే లక్ష్యంగా అధికారులు కార్యచరణ రూపొందించుకుని పనిచేయాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్ధేశ్యం చేశారు. సచివాలయంలో శనివారం ఆయన తన చాంబర్లో క్రీడా శాఖపై స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా అధికారులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. క్రీడలను శిఖర స్థాయికి చేర్చాలన్న సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు క్రీడా శాఖ పనితనంలో కొత్తదనం కనిపించాలన్నారు. గతంలో జరిగిన వైఫల్యాలను అలసత్వాన్ని పక్కనపెట్టి నూతన వొరవడితో క్రీడా శాఖ పనిదానంలో కొత్తదనం కనిపించాలని సూచించారు. 2036 ఒలంపిక్స్‌లో పతకాలు లక్ష్యంగా తెలంగాణ క్రీడా శాఖ పనిచేయాలని, చిత్తశుద్ధితో పనిచేస్తే లక్ష్యాన్ని సాధించడం సులభతరమైనేనన్నారు. క్రీడారంగంలో సమూల మార్పు కొరకు కార్యాలయాల్లో కూర్చుంటే సాధ్యం కాదని కార్య క్షేత్రంలోకి వెళ్లాలని ఆయన అధికారులకు సూచించారు .విద్యాశాఖ తో సమన్వయం చేసుకొని పాఠశాల స్థాయి నుండే క్రీడాకారులను గుర్తించాలని గురుకుల విద్యాలయల్లో ఉన్న ప్రతి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ యువజన అభివృద్ధి పర్యాటక, క్రీడలు ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు ఇంజనీరింగ్ విభాగం, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కెసిఆర్, కెటిఆర్ ఇద్దరూ నేరస్తులే

### ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేసిన ఘటన మర్చిపోయారా..? : ఎం.కోదండరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతులను నమ్మించి మోసం చేసిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, మాజీ ఐటి శాఖ మంత్రి కె.తారక రామారావు ఇద్దరూ నేరస్తులేనని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. మాజీ మంత్రికెటిఆర్ వ్యాఖ్యలపై కోదండరెడ్డి స్పందిస్తూ బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఖమ్మం జిల్లాలో మిర్చి రైతులు తమకు మార్కెట్‌లో న్యాయమైన ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేసిన రైతులకు బేడీలు వేశారని, అలాంటి నాయకులు ఇప్పుడు రైతులపై కపట ప్రేమ నటించడం ఆశ్చర్యకరమని కోదండరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన దరిద్రపు ధరణితో 30 లక్షల కుటుంబాలకు భూమి హక్కు ఉన్నప్పటికీ వారు పట్టాలను కూడా పొందలేక, అనేక రకాలుగా నష్టపోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్న సమయంలోనే భూదాన బోర్డును రద్దు చేసి, అర్ధ రాత్రి దర్వాజలు పగులగొట్టి దస్త్రాలు ఎత్తుకెళ్లారని ఆయన ఆరోపించారు. ఇందిరా గాంధీ పేదలకు అసైన్డ్ చేసిన భూములను రియల్ ఎస్టేట్ వారికి వేలం వేసి అమ్మిన ఘనత కెసిఆర్‌దేనని అన్నారు. తెలంగాణకు చెందిన భూముల వివరాలను కెటిఆర్ ఒక దివాళా తీసిన అమెరికు చెందిన క్వాంటెలా కంపెనీకి అప్పంగించారని, బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ కార్డు వివరాలను కూడా అప్పగించారని కోదండరెడ్డి గుర్తు చేశారు.

## సిఎంను ప్రశ్నించే స్థాయి కెటిఆర్‌కు లేదు

### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించే, సవాల్ చేసే హక్కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు లేదని, కెటిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు సెకండ్ బెంచ్ లీడర్లని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డిని కెటిఆర్ ప్రశ్నించాలనుకుంటే ఆయన తండ్రి కెసిఆర్‌ను ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయించి, ప్రతిపక్ష నాయకుడి పదవి కెటిఆర్ తీసుకుని మాట్లాడాలని, కెటిఆర్ మాటలను పరిగణలోకి తీసుకుంటామని జగ్గారెడ్డి అన్నారు. ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ మాట్లాడకుండా సెకండ్ బెంచ్ లీడర్స్ మాట్లాడుతున్నారన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి గురువు చంద్రబాబు అని కెటిఆర్ పదే పదే అంటున్నారని, అయితే కెటిఆర్ తండ్రి కెసిఆర్‌కు గురువు కూడా చంద్రబాబు కదా అన్నారు. ఎన్‌టిఆర్‌ను సిఎం పదవి నుండి దించడానికి వైస్రాయ్ హోటల్ ఇంచార్జిగా పనిచేసినందుకు కెసిఆర్‌కు రవాణా శాఖ మంత్రి పదవిని చంద్రబాబు ఇచ్చారన్నారు. అసెంబ్లీకి రావాలని సిఎం రేవంత్‌రెడ్డి కోరుతుంటే బోట్స్ క్లబ్‌కు, ప్రెస్ క్లబ్‌కు రావాలని కెటిఆర్ అంటున్నారని, బయట చర్చించేందుకని, అంతదానికి అసెంబ్లీ ఎందుకని ఆయన ప్రశ్నించారు. ప్రజాసమస్యలపై చర్చించడానికి అసెంబ్లీ పెట్టాలని అధికార పార్టీని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేస్తుంది. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని, ప్రతిపక్ష నాయకుడు రావాలని కోరుతున్నారన్నారు' అని జగ్గారెడ్డి అన్నారు.

## బ్రిక్స్ ప్లస్ గ్రూప్ దేశాల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల జాబితాలో ఒకటిగా భారతదేశం బ్రిక్స్‌లో కీలకపాత్ర వహిస్తోంది. జి–20 ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఇప్పటికే అనుభవం సంపాదించుకుంది. ''ప్రతి ఒక్కరితోస్నేహం'' అనే ప్రాతిపదికపై బ్రిక్స్ తన వ్యూహాన్ని ముందుకు తీసువెళుతున్నది. పారిశ్రామికంగా వెనుకబడిన దేశాలకు బ్రిక్స్ వేదిక వ్యూహాత్మకమైన పట్టువిడుపుల ధోరణితో సభ్యత్వాలు ఇస్తున్నది. రష్యాతో ఎంపిక చేసిన సమస్యలపై భారత్ తన సహకారాన్ని కొనసాగిస్తుండగా, క్వాడ్ కూటమిలో సభ్యదేశంగా అమెరికాతో కూడా స్నేహాన్ని భారత్ కొనసాగిస్తున్నది. క్వాడ్ గ్రూపులో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలు ఉన్నాయి. ఇటీవలి నెలల్లో భారత్–పాకిస్థాన్ మధ్య తాజా సంఘర్షణ అనిశ్చితి తర్వాత మోదీ ప్రపంచ నాయకత్వ ఆశలకు బ్రిక్స్ ఒక ప్రధానవేదికగా అవకాశం ఇచ్చింది. అదేవిధంగా బ్రెజిల్ దేశాధినేత లులా డసిల్వా కూడా అంతర్గతంగా ఉన్న సమస్యల నుండి తాత్కాలిక ఉపశమనం పొందుతారు. ప్రపంచ వాతావరణ సమస్యల వేదిక కాప్–30 సమావేశ నిర్వహణకు సన్నాహాలు చాలా నత్తనడకన జరుగుతున్నాయని డసిల్వాపై దేశంలో ప్రతిపక్షం ఆరోపణలు చేస్తున్నది. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సెనారో ఈ విమర్శలు చేయడంలో ముందున్నారు. ఈ పరిస్థితుల్లో లులా డసిల్వాకు ఈ సమావేశాల ద్వారా కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక శరవేగంగా విస్తరిస్తున్నది. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు 2024లో బ్రిక్స్ వేదికలో సభ్యులుగా చేరడంతో దీనికి కొత్తబలం చేకూరింది. అదే విధంగా ఆగ్నేయ ఆసియాలో ప్రఖ్యాతదేశం ఇండోనేసియా కూడా ఈ ఏడాదిలోనే బ్రిక్స్ సభ్యత్వం తీసుకుంది. 2011లో దక్షిణాఫ్రికా బ్రిక్స్‌లో చేరింది. ఇప్పుడు 10 సభ్యదేశాల వేదికగా అవతరించిన బ్రిక్స్‌గ్రూపు 2024 నుండీ మరో పది సభ్యదేశాల గ్రూపుతో కలిసి నడుస్తోంది. బెలారస్, బొలీవియా, క్యూబా, కజఖస్థాన్, మలేసియా, నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, వియత్నాం దేశాలు దీనికి జత కలిశాయి. 11వ శతాబ్దం నాటి దేశం సౌదీ అరేబియా కూడా బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్–2025 సమావేశ జాబితాలో ఉన్నట్లు సంబంధిత వెబ్‌సైటు తెలియజేసింది. ఐతే సౌదీ అరేబియాకు ఇంకా సభ్యత్వం ఇచ్చారా? లేదా? అనే విషయం స్పష్టం కాలేదు. అభివృద్ధి చెందుతున్న దేశబూలు ఒక బలమైన వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్నాయి. 2001లో గోల్డ్‌మన్ సాచ్ ఇచ్చిన నివేదిక ప్రకారం, 21వ శతాబ్దం పూర్తిగా అభివృద్ధి చెందతున్న దేశాలదేనని పేర్కొన్నారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలు ఒక రాజకీయ ఉద్యమంగా రూపుదిద్దుకున్నాయి. వీరు ఐక్యరాజ్యసమితి సమావేశాల సందర్భంగా కలిసి కూర్చుని ప్రపంచ ఆర్థిక పరిస్థితుల గురించి మాట్లాడుకోవడం ప్రారంభించారు. 2008 నాటికి అమెరికా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రుణాల సామూహిక ఎగవేతల కారణంగా ప్రపంచంలో ఆర్థిక సంక్షోభం సంభవించింది. ఈ పరిస్థితుల్లో బ్రిక్స్ వేదిక దేశబూలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ వృద్ధి తిరిగి పుంజుకోవడంలో ఒక చోదకశక్తిగా పనిచేశాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలపై బ్రిక్స్ దేశాలు చాలా నిశితమైన నిర్మాణాత్మకమైన విమర్శలు చేయడం ప్రారంభించాయి. ప్రత్యేకించి బ్రెట్టన్ ఉడ్స్ ఇనిస్టిట్యూషన్స్, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకులపై విమర్శలు చేస్తున్నాయి. 2008లో ఆర్థిక సంక్షోభాన్ని సామూహికంగా నిలబడి నివారించడంలో విఫలమయ్యాయని 2009 జూన్‌లో మొదటిసారి బ్రిక్స్ ఆవిర్భావ సమావేశంలో నాయకులు విమర్శించారు. ఈ సమావేశం ఆనాడు రష్యాలోని యెకటెరింబర్గ్‌లో జరిగింది.






## బిజెపిని అడ్డుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

కాలేదని, అమిత్ షా కమ్యూనిజాన్ని లేకుండా చేయగలరా..? అని ప్రశ్నించారు. దేశంలో వామపక్షాలకు సిపిఐ పెద్దన్న పాత్ర పోషిస్తుందని, 1951 వరకు తాము సాయుధపోరాటం చేసామని, పరిస్థితులను బట్టి ఆయుధాలను జమ్మిచెట్టు మీద పెట్టామని, వాటిని తిరిగి తీసే అవసరం రాకూడదనే కోరుకుంటున్నామన్నారు. మావోయిస్టులు కూడా ఆ దిశగా ఆలోచన చేయాలని కోరుతున్నామని, మావోయిస్టులు కూడా తమతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు అంటే మనవాడేనని, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) మనవాడేనని, ఎర్రజెండా పట్టుకున్న ప్రతివాడు మన వాడేనని చెప్పారు. కమ్యూనిస్టులను పురిటిలోనే చంపాలని చూసిన కంసుని లాంటి బూర్జువాలు, పెత్తందార్లు, కార్పోరేట్ శక్తులు ఎందరో కాలగర్భంలో కలిసిపోయారు. కమ్యూనిజం సజీవం.. శాశ్వతం.. అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా కమ్యూనిస్టులు ప్రజలకోసం పోరాడుతారని, తప్పు చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని, పాలకులను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. పదవులు తమకు ముఖ్యం కాదని, మమ్మల్ని, ప్రజల్ని కాదనుకొని బిఆర్ఎస్ ఫాంహౌస్‌కు పోయిందని, ప్రజలకు నష్టం చేస్తే రేపు కాంగ్రెస్ గతైనా అంతేనని స్పష్టం చేశారు. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా గ్రామ గ్రామాన ఆవిర్భావ ఉత్సవాలు జరుపుతున్నామని, ఖమ్మంలో డిసెంబర్ 26న వంద సంవత్సరాల వేడుకను లక్షలాదిమందితో నిర్వహించబోతున్నామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ పుట్టింది మనిషి కోసమేనని, మనుషులు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని చెప్పారు.

### జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కండి

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు**

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలం అయిందని చెప్పారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ రాలేదని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభం కాలేదని చెప్పారు. ఈ ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసిన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### కురవిలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

సిపిఐ మహబూబాబాద్ జిల్లా తృతీయ మహాసభల సందర్భంగా కురవిలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ఓం ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ర్యాలీలో ఎర్ర చొక్కాలతో యువకులు, ఎర్ర చీరలతో మహిళలు కదం తొక్కారు. ఈ ర్యాలీ, బహిరంగ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమెర విశ్వేశ్వర్ రావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి అజయ్, రాష్ట్ర సమితి సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి, నాయకులు పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మి, చింతకుంట్ల వెంకన్న, రేశపల్లి నవీన్, కనకం రాజన్న, నెల్లూరి నాగేశ్వర్ రావు, పాండురంగ చారి, వరిపల్లి వెంకన్న,జంపాల వెంకన్న,చొప్పరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com